

ప్రకృతి సోయగం!

• కోనలో కనువిందు చేస్తున్న జలపాతం

చుట్టూ ఎత్తయిన కొండలు... పచ్చని చెట్లు... పక్షుల కిలకిలరావాలు.. వన్యప్రాణుల సందడి... బండరాళ్లను చీల్చుకుంటూ పాలవెల్లువలా దుముకుతున్న జలపాతం ప్రకృతి ప్రియులను ఆహ్లాదపరుస్తోంది. వాయుగుండం ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు వెలుగొండ తడిసి ముద్దయ్యింది. కొండకోనల్లోనుంచి వస్తున్న నీరు పెంచలకోన అభయారణ్యంలోని ఎత్తయిన బండరాళ్ల నుంచి కిందకు జాలువారుతోంది. ఈ సుందర దృశ్యాన్ని పెంచలస్వామి దర్శనం కోసం వచ్చిన భక్తులను విశేషంగా ఆకట్టుకుంటోంది. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన సందర్శకులు కూడా తమ కెమెరా, మొబైల్ ఫోన్లలో ఈ సుందర దృశ్యాలను బంధించి సామాజిక మాధ్యమాల్లో షేర్ చేసుకుంటున్నారు.

- రాపూరు (ఆంధ్రజ్యోతి)






భూమిలో ఏమిటా శబ్దం!

వర్షాలు తగ్గడంతో తాను వేసిన మినుము పంట ఏమైందని వెళ్లిన రైతుకు భూమిలో వస్తున్న శబ్దం భయాందోళనకు గురి చేసింది. ఓ రంధ్రంలోనుంచి గ్యాస్ లీకయినట్టు శబ్దం రావడంతో అగ్గిపుల్ల వెలిగించి చూశాడు. మంటలు రాలేదు. మరి ఆ శబ్దం ఎందుకు వస్తోందని సదరు రైతుతోపాటు చుట్టుపక్కల రైతులను కలవరపాటుకు గురిచేసింది.

- ఆ వివరాలు - 6లో..



రైల్వే రికార్డుల వెలుగొండ!

పచ్చని సొయగాల కొండ.. వెలుగొండ భారత రైల్వేలో రికార్డులకెక్కింది. వెంకటాచలం-ఓబులవారిపల్లె మధ్య ఉన్న రైల్వేలైన్ వెలుగొండ అడవిలో నుంచి సాగుతుంది. 6.6 కి.మీ మధ్య అడవిలో వేసిన సొరంగం ఒక రికార్డు అయితే, అసలు గేటులేని రైల్వే మార్గంగా కూడా రికార్డుకెక్కింది. అదెలాగో ఈ కథనం చదవండి..

- ఆ వివరాలు - 6లో..



మద్యం దుకాణం వద్దే వద్దు!

జీవితాలను గుల్ల చేస్తున్న మద్యం తమ ప్రాంతంలో వద్దేవద్దంటూ పొదలకూరులో నారీలోకి ఆందోళనబాటపట్టింది. పట్టణంలోని రాంనగర్ గేట్ సెంటర్‌లో బైఠాయించి ప్లకార్డులు చేతబట్టి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా స్థానికులు అల్లూరు రమణయ్య, సత్యం, భాగ్యలక్ష్మి తదితరులు మాట్లాడుతూ మద్యం దుకాణాన్ని ఏర్పాటు చేసే ప్రాంతానికి అతి సమీపంలోనే బడి, గుడి ఉందని గుర్తు చేశారు. నివాస గృహాల మధ్య దుకాణాన్ని ఏర్పాటు చేస్తే ఊరుకోబోమని, తొలగించే వరకు ఆందోళన చేస్తామని వారు హెచ్చరించారు. నరసయ్య, చాట్ల పుల్లయ్య, వేమయ్య, మహేష్, కిషోర్ పాల్గొన్నారు.

- పొదలకూరు (ఆంధ్రజ్యోతి)

• అర్ధంతరంగా 1.0 సాఫ్ట్‌వేర్ రద్దు
• ఈనెల 4వ తేదీ నుంచి ఇబ్బందులు
• కాళ్లరిగేలా తిరుగుతున్న ప్రజలు





జారీ కాని ఈసీలు..

రిజిస్ట్రేషన్లకు బ్రేక్!

నెల్లూరు (హరనాథపురం), అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : అమలులో ఉన్న 0.1 సాఫ్ట్‌వేర్‌ను అర్ధంతరంగా రద్దు చేయటంతో ఈసీ (ఎన్‌కంబరెన్స్ సర్టిఫికెట్)ల జారీకి తీవ్ర విఘాతం కలుగుతోంది. ఈ సాఫ్ట్‌వేర్ రద్దు వల్ల వచ్చే ఇబ్బందులను ముందుగా గుర్తించి పరిష్కార మార్గం చూపకుండానే అర్ధంతరంగా 1.0ను ఎత్తేయడంతో ఈసీల జారీతోపాటు రిజిస్ట్రేషన్ల ప్రక్రియకూ విఘాతం కలిగింది. రిజిస్ట్రేషన్ శాఖలో దస్తావేజుల రిజిస్ట్రేషన్లు, ఈసీల జారీ, స్టాంపుల జారీకి సంబంధించి 1.0, 2.0 సాఫ్ట్‌వేర్‌లు అమలులో ఉన్నాయి. వైసీపీ హయాంలో ప్రవేశపెట్టిన కార్డుప్రైమ్ 2.0 సాఫ్ట్‌వేర్ పాత విధానం కంటే మెరుగ్గా ఉంటుందని ప్రజలు భావించారు. కానీ 1.0 లో సాఫీగా సాగిపోయిన రిజిస్ట్రేషన్ విధానానికి తీవ్ర అడ్డంకులు ఏర్పడ్డాయి. రిజిస్ట్రేషన్లు అంటేనే జనం బెంబేలెత్తి పోయారు. ఉదయం 10 గంటలకు రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వెళితే తిరిగి ఇంటికి ఎప్పుడు చేరతారో తెలియని పరిస్థితి నెలకొని ఉంది. అమ్మకందారు, కానుగోలుదారులు, సాక్షులు గంటల తరబడి వేచి ఉండలేక ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అంతేగాక సర్వర్లు కూడా ప్రతిరోజూ మొరాయించాయి. 2.0 సాఫ్ట్‌వేరుకు తోడుగా 1.0 సాఫ్ట్‌వేర్ ఉండటంతో కొంత సమస్య తీరింది. తాజాగా 1.0ను రద్దు చేయటంతో సమస్య మళ్లీ మొదటకొచ్చింది.

• ఈసీలు లేకపోతే...

దస్తావేజుల రిజిస్ట్రేషన్లకు, ఈసీలు ఎంతో ముఖ్యం. వీటి ఆధారంగానే రిజిస్ట్రేషన్లు చేయించుకుంటారు. గత 13 రోజుల నుంచి దస్తావేజుల రిజిస్ట్రేషన్లతోపాటు ఈసీల జారీ ఆగిపోవటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆస్తి వివరాలు సంపూర్ణంగా తెలుసుకోవడానికి ఈసీలు ఎంతో ముఖ్యం. అలాంటి ఈసీల జారీకి కూడా 1.0 నుంచి 2.0 సాఫ్ట్‌వేర్‌ను వినియోగించటంతో సమస్యలు తలెత్తాయి. 1.0 పద్ధతిలోని ఫార్మాట్‌లో డాక్యుమెంటు నెంబరు పేర్కొనగానే ఈసీలు వెంటనే వచ్చేవి. 2.0 సాఫ్ట్‌వేర్‌కు మార్పు చేయటంతో సమస్య తలెత్తింది.

• స్టాంపుల జారీకి ఇబ్బందులు

నాన్‌జ్యుడీషియల్ స్టాంపులు, కోర్టు ఫీజు స్టాంపుల జారీకి 1.0 సాఫ్ట్‌వేర్ రద్దు వల్ల తీవ్ర ఇబ్బందులు నెలకొన్నాయి. ఈ స్టాంపులు విక్రయించేటప్పుడు కొనుగోలుదారు వివరాలు కంప్యూటర్లలో నమోదు చేయాలి. వీటి వివరాలు నమోదుకు 1.0 సాఫ్ట్‌వేర్ లేకపోవటంతో వాటి అమ్మకాలు కూడా ఆగిపోయాయి.

• రిజిస్ట్రేషన్ ఆదాయానికి గండి

జిల్లాలో రియల్ ఎస్టేట్ వ్యాపారం ఇప్పుడిప్పుడే పుంచుకుంటోంది. అయితే, ఈ నెల 4వ తేదీ నుంచి సక్రమంగా రిజిస్ట్రేషన్లు జరగక పోవటంతో స్టాంపులు-రిజిస్ట్రేషన్ శాఖ ఆదాయానికి గండి పడుతోంది. ఈసీల కోసం జనాలు మాత్రం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నారు. ఎప్పటికి ఈసీలు సక్రమంగా జారీ అవుతాయో, రిజిస్ట్రేషన్ల ప్రక్రియ సక్రమంగా జరుగుతాయో చెప్పలేని పరిస్థితి నెలకొని వుంది.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం



ఈసీల సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాము. సమస్యను పరిష్కరించి, ప్రజలకు ఇబ్బందులు లేకుండా ఈసీలు, స్టాంపులు వచ్చేలా చూస్తున్నాం.

- హరివర్మ, జిల్లా రిజిస్ట్రార్

ఏపీ టెట్ ఆన్సర్ కీ విడుదల

నెల్లూరు (విద్య), అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : ఏపీ ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)కు సంబంధించిన ప్రాథమిక కీ విడుదలైంది. ఈ నెల 3 నుంచి 14వ తేదీ వరకు జరిగిన అన్ని పరీక్షల ప్రశ్నపత్రాలు, ప్రిలిమినరీ కీ లను పాఠశాల విద్యా శాఖ వెబ్‌సైట్ aptet.apcfss.inలో పొందుపరిచారు. తేదీలు, సబ్జెక్టుల వారీగా ఆన్సర్ కీ చెక్ చేసుకోవడానికి అవకాశం కల్పించారు. పేపర్ 1 ఏ, పేపర్ 1 బీ పరీక్ష ప్రిలిమినరీ కీలపై అభ్యంతరాలను ఈ నెల 18వ తేదీలోపు ఆన్‌లైన్‌లో తెలియచేయాలి. మిగిలిన ప్రశ్నపత్రాల కీలను పరీక్షలు పూర్తయిన వెంటనే విడుదల చేయనున్నట్లు అధికారులు తెలిపారు. ఆన్‌లైన్‌లో కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ పద్ధతిలో నిర్వహించే ఈ పరీక్షలు ఈ నెల 21వ తేదీ వరకు జరగనున్నాయి. అనంతరం 27న ఫైనల్ కీ విడుదల చేసి నవంబరు 2న ఫలితాలను ప్రకటించనున్నారు. కాగా, గురువారం జరిగిన పరీక్షకు జిల్లావ్యాప్తంగా 218 మంది అభ్యర్థులు హాజరవగా, 42 మంది గైర్హాజరయ్యారు. ఈ పరీక్షలను జిల్లా అబ్జర్వర్, రాష్ట్ర ఓపెన్‌స్కూల్ డైరెక్టర్ కె.నాగేశ్వరరావు, డీఈఓ రామారావు, విద్యాశాఖ అధికారులు పర్యవేక్షించారు.

• ఇష్టానుసారంగా బిడ్‌లు వేసిన కాంట్రాక్టర్లు
• నివ్వెరపోయిన కలెక్టర్, అధికారులు
• చివరకు లక్కీడిప్ ద్వారా కాంట్రాక్టర్ల ఎంపిక

ఇసుక టెండర్లలో గందరగోళం

నెల్లూరు (వెంకటేశ్వరపురం), అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని నాలుగురు రీచ్‌ల నుంచి స్టాక్ పాయింట్లకు ఇసుకను చేరవేసేందుకు పిలిచిన టెండర్ల వ్యవహారం గందరగోళానికి దారితీశాయి. ఇరువూరు, పల్లిపాడు, మినగల్లు, పీకేపాడు రీచ్‌ల నుంచి స్టాక్ పాయింట్‌కు ఇసుకను చేర్చేందుకు మైనింగ్ శాఖ కాంట్రాక్టర్ల నుంచి టెండర్లు ఆహ్వానించింది. టన్నుకు రూ.90, కూలీలు తదితర ఖర్చులతో కలిపి రూ.115 వరకు రవాణా ఖర్చు అవుతుందని ఒక అంచనా వేశారు. ఈ మేరకు టెండర్లు ఆహ్వానించగా, నాలుగు రీచ్‌లకు కలిపి 43 మంది టెండర్లు దాఖలు చేశారు. వీటిని గురువారం కలెక్టరేట్‌లోని శంకరన్ హాలులో కలెక్టర్ ఆనంద్, జేసీ కార్తీక్ ఇతర శాఖల అధికారుల సమక్షంలో బిడ్‌లను తెరిచి చూడగా చిత్ర విచిత్రాలు కనిపించాయి. కొందరు రూ.36లకే కోడ్ చేస్తే, మరికొందరు రూ.124.90లకు వేశారు. వీటిని చూసిన కలెక్టర్ ఇంత తక్కువకు బిడ్ వేస్తే ఇసుక పక్కదారి పడుతుందని గ్రహించారు. గందరగోళంగా ఉన్న ఈ టెండర్ల ప్రక్రియను రద్దు చేశారు. టెండర్‌దారులతో మాట్లడి లక్కీడిప్ ద్వారా రీచ్‌లను అప్పగించేందుకు సిద్ధమయ్యారు. ఆ మేరకు నాలుగు రీచ్‌ల పరిధిలో నలుగురు కాంట్రాక్టర్లకు లక్కీడిప్ ద్వారా అప్పగించారు. వీరు ప్రభుత్వం అంచనా వేసిన రూ.115 ధరకు రీచ్ నుంచి స్టాక్ పాయింట్‌కు ఇసుకను రవాణా చేయాల్సి ఉంటుంది. శుక్రవారం నుంచే ఇసుక తరలింపు ప్రారంభించాలని కాంట్రాక్టర్లను కలెక్టర్ ఆదేశించారు.



టెండర్‌దారులతో మాట్లాడుతున్న మంత్రి నారాయణ, కలెక్టర్

• 21నాటికి పూర్తిస్థాయిలో అందుబాటులోకి

టెండర్ల ప్రక్రియను పరిశీలించిన రాష్ట్ర మంత్రి నారాయణ మాట్లాడుతూ ఈ నెల 21వ తేదీ నాటికి జిల్లాలో పూర్తిస్థాయిలో ఇసుకను అందుబాటులోకి తీసుకురానున్నట్లు చెప్పారు. ఈ టెండర్ల ప్రక్రియలో ఎస్పీ కృష్ణకాంత్, కార్పొరేషన్ కమిషనర్ సూర్యతేజ, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

గండం.. గడిచింది!

• తీరం దాటిన వాయుగుండం
• తగ్గిన వర్షాలు.. ఊపిరి పీల్చుకున్న ప్రజలు
• నష్టాల అంచనాలో అధికార యంత్రాంగం
• 675 హెక్టార్లలో నీట మునిగిన పంటలు
• 88 కి.మీ పొడవున దెబ్బతిన్న రోడ్లు

నెల్లూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : మూడు రోజులపాటు జిల్లాను వణికించిన భారీ వర్షాలు గురువారం తగ్గుముఖం పట్టాయి. అల్పపీడనం కాస్తా తీవ్ర అల్పపీడనంగా మారడం, అది క్రమేణా బలపడి వాయుగుండంగా రూపాంతరం చెందడంతో రోజురోజుకూ వర్షాలు ఎక్కువవుతూ వచ్చాయి. దీంతో వాయుగండం తీవ్రంగా మారి తుఫాన్‌గా మారుతుందని అంతా భయపడ్డారు. అయితే ఎటు వంటి ప్రమాదం లేకుండా వాయుగుండం క్రమేణా బలహీనపడి గురువారం వేకువజామున తడ వద్ద తీరం దాటింది. ఆ తర్వాత చిన్నపాటి చినుకులు తప్ప భారీ వర్షాలు కురవలేదు. మధ్యాహ్నం తర్వాత ఎండ వచ్చింది. దీంతో అధికార యంత్రాంగంతోపాటు ప్రజలు కూడా ఊపిరిపీల్చుకున్నారు. గురువారం జిల్లాలో సరాసరి 6.3 మి.మీ వర్షపాతం నమోదైంది. అత్యధికంగా పొదలకూరులో 25.6 మి.మీ, కలువాయిలో 17, వింజమూరులో 16.2, అనంతసాగరంలో 14.8, కందుకూరులో 13.6, దుత్తలూరులో 13.6, సైదాపురంలో 13.2, మనుబోలులో 11.6, రాపూరు, కలిగిరి మండలాల్లో 10.6 మి.మీ చొప్పున వర్షం కురిసింది. మొత్తంగా ఈ నెల 14వ తేదీ నుంచి జిల్లాలో సరాసరి 235.5 మి.మీ వర్షపాతం నమోదైనట్లు అధికారులు ప్రకటించారు. అందులో అత్యధికంగా జలదంకి మండలంలో 419.2 మి.మీ వర్షం కురవడం గమనార్హం. మూడు రోజుల పాటు కురిసిన భారీ వర్షాలకు జిల్లాలోని చెరువులన్నీ దాదాపుగా నిండిపోయాయి. సోమశిల జలాశయానికి కూడా వరద ఉధృతి పెరిగింది. దీంతో డ్యాం నీటిమట్టం 54.44 టీఎంసీలకు పెరిగింది. అదే సమయంలో కండలేరుకు ఆరు వేల క్యూసెక్కులను విడుదల చేస్తుండగా గురువారం ఆ మొత్తాన్ని 8 వేలకు పెంచారు. కాగా నెల్లూరు నగరంలో కూడా పరిస్థితులు చక్కబడు తున్నాయి. రోడ్లు, అండర్ బ్రిడ్జీల వద్ద నిలి చిన నీటిని అధికార యంత్రాం గం బయటకు పంపింది. తల్పగిరి కాలనీ వంటి లోత ట్టు ప్రాంతాల్లో ఇంకా నీరు నిలిచి ఉంది.

• స్వల్ప నష్టాలే!

నెల్లూరు (హరనాథపురం/వ్యవ సాయం) : మూడురోజుల పాటు కురిసిన వర్షాలకు జిల్లాలో స్వల్ప నష్టం వాటిల్లిందని అధి కారులు తాత్కా లిక ప్రాథమిక అంచనా నివేదికను తయారు చేశారు. ఈ వర్షం 13 మండలాలు, ఒక పట్టణం పై ప్రభావం చూపించినట్లు పేర్కొన్నారు. 658.354 హెక్టార్లలో పంట నష్టం జరగ్గా, 17.6 హెక్టార్లలోని ఉద్యాన పంటల్లో నీరు నిలిచినట్లు నివేదికలో పేర్కొన్నారు. దాదాపుగా రూ.4.68 కోట్ల మేర నష్టం వాటిల్లినట్లు అంచనా వేశారు. అలాగే, 119 ఇళ్లకు నష్టం వాటిల్లగా, జంతునష్టం రూ.1.70 లక్షలకు జరిగినట్లు పేర్కొన్నారు. 19 పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేయ గా, 1376 మందికి వాటిల్లో పునరావాసం కల్పించారు. 88 కి.మీ పొడవున రోడ్లు దెబ్బతిన్నట్లు నష్టాల నివేదికలో పేర్కొన్నా రు. మున్సిపాలిటీకి సంబంధించి 543 వీధిలైట్లు దెబ్బతిన్నట్లు పేర్కొన్నారు. వర్షం పూర్తిస్థాయిలో ఆగాక మరోమారు అధికా రులు నివేదిక తయారు చేయనున్నట్లు సమాచారం.

మర్రిపాడు : రొచ్చురొచ్చుగా చిన్నమాచునూరు ప్రధాన రహదారి





మంచాలపల్లి వద్ద రోడ్డుపై గుంతలు



అనంతసాగరం : కొత్తపల్లిలో నేలకొరిగిన వరిపైరు



సీతారామపురంలో వరిపైరు దుస్థితి



పలేటివారిపాళెం : అంకభూపాలపురం రోడ్డుపై గుంతలు



కావలి : బోగోలు రైల్వే ఎల్‌సీ గేట్‌కు పడమర వైపు దెబ్బతిన్న రోడ్డు



గరుడ వాహనంపై ప్రసన్న వేంకటేశ్వరుడు


గరుడ గమనా గోవిందా..!

బోగోలు మండలంలోని బిలకూట క్షేత్రంలో ప్రసన్న వేంకటేశ్వరస్వామి గురువారం రాత్రి గరుడ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఆశ్వీయుజ పౌర్ణమి సందర్భంగా శ్రీవారికి వైనతేయ వాహనంపై ఆయన ప్రదక్షిణ ఉత్సవం వైభవంగా జరిగింది. బెంగళూరుకు చెందిన పూసపాటి రామానుజ రెడ్డి, సమత దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. గరుడసేవను తిలకించేందుకు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. గోవిందనామ స్మరణతో కొండబిట్రగుంట మారుమోగింది.

- బిట్రగుంట(ఆంధ్రజ్యోతి)



రైల్వే సొరంగమార్గం ఉండేది ఈ వెలుగొండల్లోనే..



సొరంగ మార్గంలో నుంచి బయటకు వస్తున్న గూడ్స్ రైలు

రైల్వే రికార్డుల వెలుగొండ!

భారత రైల్వే చరిత్రలో గేటులేని తొలి మార్గం.. తొలి ఎలక్ట్రిఫైడ్ రైల్వేలైన్ ● దక్షిణ భారత్‌లోనే అతిపెద్ద సొరంగ మార్గం

- వెంకటాచలం-ఓబులవారిపల్లె రైల్వేలైన్
- నిరంతరాయంగా గూడ్స్ రైళ్ల పరుగు
- ప్యాసింజర్ రైళ్లకు పడని గ్రీన్‌సిగ్నల్!
- నెరవేరని మెట్టవాసుల కల

నిలువెత్తు కొండలు.. పచ్చని చెట్లు.. అటవీపూల పరిమళాలు, పక్షుల కిలకిలరావాలు, వన్యప్రాణుల కేరింతలు.. జాలువారే జలపాతాలు వెలుగొండల సొంతం. వీటి మధ్య రోడ్డుమార్గాన రాపూరు-చిట్వేలు ఘాట్‌లో సాగే ప్రయాణం అబ్బో మహాద్భుతంగా ఉంటుంది. అలాంటి అడవి మధ్య రైలులో ప్రయాణం అంటే ఇంకా మజాగా ఉంటుంది కదూ. కూ.. చుక్‌చుక్ అంటూ రైలు కూత చెవికి వినసొంపుగా వినబడుతోంది తప్ప అందులో ఎక్కి ప్రయాణించే భాగ్యం మాత్రం పడమర మెట్టవాసులకు దక్కడంలేదు. కృష్ణపట్నం పోర్టు నుంచి కడప జిల్లా ఓబులవారిపల్లి వరకు రైల్వేలైన్ ఐదేళ్ల క్రితమే పూర్తయి గూడ్స్ రైళ్లు తిరుగుతున్నాయి. ప్యాసింజర్ రైళ్ల పరుగుకూ పచ్చజెండా ఊపుతారన్న ప్రచారం సాగినా ఆ ఊసే లేకుండా పోయింది.

● **భారత రైల్వేలోనే ప్రత్యేకం..**

భారత రైల్వేలోనే ఈ రైలు మార్గం ప్రత్యేకంగా నిలుస్తోంది. 113 కి.మీ పొడవైన ఈ మార్గంలో ఒక్క గేటు కూడా లేదు. పైగా కొండను చీల్చుతూ 6.6 కిలోమీటర్ల పొడవైన విద్యుద్దీకరణతో ఏర్పాటైన సొరంగ మార్గం కావడం మరో విశేషం. ఈ మార్గంలో మొత్తం ఆరు రైల్వేస్టేషన్లు ఉండగా, ప్రతి స్టేషన్ వద్ద మూడు ట్రాక్‌లు ఏర్పాటు చేశారు. కడప జిల్లాలోని మంగంపేట, చెర్లోపల్లె, నెల్లూరు జిల్లాలోని నవాబుపేట, సంకురాత్రిపల్లి, కట్టుబడిపల్లి, కసుమూరులలో అధునాతన సౌకర్యాలతో స్టేషన్లు నిర్మించారు. కొత్తగా రాపూరుకు సమీపంలో రాపూరు ఎట్ వెలికల్లు ,పొదలకూరు మండలంలోని వీరంపల్లి సమీపంలోని కట్టుబడిపల్లి వద్ద స్టేషన్‌లు ఉన్నాయి. వెంకటాచలం వద్ద చెన్నై లైను, కడప జిల్లా ఓబులవారిపల్లి వద్ద ముంబయి రైల్వే లైన్‌లో కలుస్తుంది. వెంకటాచలం వద్ద ఈ లైన్‌కు కనెక్టివిటీ లేకున్నా ఓబులవారిపల్లి వద్ద మాత్రం మెయిన్‌కు కనెక్టివిటీ ఉంది. వెంకటాచలం వద్ద ఈ లైన్ కనెక్టివిటీ చేస్తే నెల్లూరు నుంచి కడపకు, నెల్లూరు నుంచి తిరుపతికి రైళ్లు తిరిగే వెసులుబాటు వస్తుంది.

- రాపూరు (ఆంధ్రజ్యోతి)



సొరంగ మార్గంలో లోపలిభాగం



రోడ్డు ఉన్న ప్రతిచోటా ఇలా వంతెన నిర్మించారు!

● **వెంకయ్య స్వప్నం..**

వెలుగొండల్లో రైలు కూత పెట్టడం తన స్వప్నమని తరచూ పూర్వ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు చెప్పడమే కాదు.. ఆ స్వప్నాన్ని నిజం చేసి ఆ రైలు మార్గంలో కుటుంబ సభ్యులతో కలిసి ప్రయాణించారు. త్వరలో ప్యాసింజర్ రైలు నడుపుతామని రైల్వే ఉన్నతాధికారులు ప్రకటించినా అది కాగితాల్లోనే ఉండిపోయింది.

● **4 మండలాలకు తొలిసారిగా..**

జిల్లాలోని 4 మండలాల్లో తొలిసారిగా రైలు మార్గం ఏర్పాటైంది. రాపూరు, సైదాపురం, పొదలకూరు, డక్కిలి మండలాల్లో సుమారు లక్ష మంది రైలులో ప్రయాణించేందుకు ఈ రైల్వే లైన్ దోహదపడుతుంది. అయితే, తమ కళ్ల ముందే రైళ్లు పరుగెడుతున్నా తమకు రైలెక్కే భాగ్యం ఎప్పుడు కలుగుతుందా!? అని ఆశగా ఎదురుచూస్తున్నారు.

ప్రాజెక్టు పేరు : కృష్ణపట్నం-ఓబులవారిపల్లి రైల్వే లైన్ **దూరం :** 113 కి.మీ **వ్యయం :** రూ.2000 కోట్లపైనే **సొరంగ మార్గం :** 6.6 కి.మీ **రైల్వే స్టేషన్లు :** 8 **రైల్వే నిర్మాణానికి అనుమతి :** 2006 **ప్రారంభం :** 2019, ఫిబ్రవరి **గూడ్స్ రైళ్ల పరుగు :** 2019, జూన్

రైతు సేవా కేంద్రాల్లో విత్తనాలు.. ఎరువులు సిద్ధం

- 6200 క్వింటాళ్ల వరి విత్తనాలు
- 25590 మెట్రిక్ టన్నుల ఎరువులు

నెల్లూరు(వ్యవసాయం), అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి) : జిల్లాలో రబీ సీజన్‌కు సంబంధించి రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు రైతు సేవా కేంద్రాల్లో సిద్ధం చేసినట్లు జిల్లా వ్యవసాయాధికారి పీ సత్యవాణి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సోమశిల జలాశయంలో దాదాపు 53 టీఎంసీల సాగునీరు అందుబాటులో ఉండటంతో పాటు ఈశాన్య రుతుపవనాలు ప్రవేశించి వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు రాయితీ ధరలకు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. బీపీటీ-5204 రకం వరి విత్తనాలు 900 క్వింటాళ్లు, కేఎన్ఎం-1638 రకం 4500, ఎన్ఎల్ఆర్-34449 రకం 800 క్వింటాళ్లు అందుబాటులో ఉంచామని తెలిపారు. వీటితోపాటు ఆర్ఎన్ఆర్-15048, ఎన్ఎల్ఆర్-3354 రకాలు కూడా త్వరలో అందుబాటులో ఉంచుతామని పేర్కొన్నారు. రైతులకు అవసరమైన రసాయనిక ఎరువులు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, రైతు సేవా కేంద్రాలు, అధీకృత డీలర్ల ద్వారా అందించేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లాలో ప్రస్తుతం 8012 మెట్రిక్ టన్నుల యూరియా, 2206 మెట్రిక్ టన్నుల డీఏపీ, 1194 మెట్రిక్ టన్నుల ఎంవోపీ, 13814 మెట్రిక్ టన్నుల కాంప్లెక్స్ ఎరువులు, 364 మెట్రిక్ టన్నుల ఎస్ఎస్‌పీ ఎరువులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ నెల 20వతేదీ నాటికి మరో 5500 మెట్రిక్ టన్నుల యూరియా, 1800 మెట్రిక్ టన్నుల డీఏపీ ఎరువులు అందుబాటులోకి వస్తాయన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకుని మంచి దిగుబడులు సాధించాలని కోరారు.



రామాయణం మహాకావ్యం

వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్ ఆనంద్

భారతజాతి మొత్తాన్ని ఐక్యంగా ఉంచే గొప్ప భావజాలం గల మహాకావ్యం రామాయణమని కలెక్టర్ ఆనంద్ కొనియాడారు. గురువారం కలెక్టరేట్ ప్రాంగణంలోని తిక్కన భవన్‌లో వాల్మీకి జయంతి జరిగింది. ఆ మహర్షి చిత్రపటానికి కలెక్టర్ పూలమాల వేసి అంజలి ఘటించారు. వాల్మీకి జయంతిని రాష్ట్ర పండుగగా జరుపుకోవటం సంతోషకరమన్నారు. వాల్మీకి రాసిన రామాయణాన్ని ప్రతి ఒక్కరూ చిన్నప్పటి నుంచి వింటూ ఉంటారని, జీవితంలో ఎదిగే కొద్దీ రామాయణం స్ఫూర్తి అందరికీ అర్థమవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వాల్మీకి బోయ సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, జడ్పీ మాజీ చైర్మన్ చెంచలబాబు యాదవ్, జిల్లా వెనుకబడినవర్గాల సంక్షేమాధికారి కొల్లి ప్రసూన, సాంఘిక సంక్షేమశాఖ డీడీ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

- నెల్లూరు హరనాథపురం, (ఆంధ్రజ్యోతి)

ఇరిగేషన్ ఎస్ఈ కృష్ణమోహన్ బదిలీ

నెల్లూరు, అక్టోబరు 17 (ఆంధ్ర జ్యోతి) : ఇరిగేషన్ సర్కిల్ ఎస్ఈ పీ కృష్ణమోహన్ బదిలీ అయ్యారు. కావలి ఈఈగా ఉంటూ ఎఫ్ఏసీ ఎస్ఈగా ఆయన కొనసాగు తున్నారు. ఇటీవల జరిగిన బదిలీల్లో కావలి ఈఈ నుంచి పల్నాడు జిల్లా లింగంగుంట్ల ఎన్ఎస్‌జేసీ సర్కిల్‌కు ఈఈ గా బదిలీ అయ్యారు. గురువారం రాష్ట్రవ్యాప్తంగా ఎఫ్ఏసీ ఎస్ఈలను కూడా బదిలీ చేస్తూ జలవనరులశాఖ కార్యదర్శి జీ సాయిప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా ఇరిగేషన్ సర్కిల్ నూతన ఎస్ఈ (ఎఫ్ఏసీ)గా సుగాలి దేశేనాయక్‌ను నియమించారు. ప్రస్తుతం ఆయన నెల్లూరు డ్రైనేజీ డివిజన్ ఈఈగా ఉన్నారు. ఇటీవల బదిలీల్లో దేశే నాయక్ అనంతపురం నుంచి నెల్లూరుకు వచ్చారు. కాగా కావలి డీఈగా పని చేస్తున్న ముజాహిద్‌ఖాన్ పఠాన్‌కు కావలి డివిజన్ ఈఈగా ఎఫ్ఏసీ బాధ్యతలు ఇచ్చారు.



భూమిలో ఏమిటా శబ్దం!

చవటపల్లి రోడ్డు సమీపంలోని పొలంలో నుంచి వస్తున్న శబ్దం రైతులను భయాందోళనకు గురిచేసింది. చేజర్ల మండలం చిత్తలూరు గ్రామానికి చెందిన కూరపాటి బాబు అనే రైతు కలువాయి మండలం చవటపల్లి సమీపంలో 20 ఎకరాల్లో మినుము సాగు చేశారు. వర్షాలు తగ్గుముఖం పట్టడంతో గురువారం సదరు రైతు పొలం వద్దకు వెళ్లారు. పొలంలోని భూమిలోని చిన్న రంధ్రం నుంచి గ్యాస్ లీక్ అవుతున్న శబ్దం వినిపించింది. ఎంత సేపటికీ శబ్దం తగ్గకపోవడంతో చుట్టూ ఉన్న రైతులకు ఈ విషయం చెప్పాడు. దీంతో వారు కూడా వచ్చి ఆ రంధ్రం దగ్గర అగ్గిపుల్ల వెలిగించి చూశారు. అయితే, మంటలు రాలేదు. కేవలం భూమిలో నుంచి గ్యాస్ లీక్ అయినట్టు శబ్దం వస్తున్నట్లు గ్రహించారు. ఎంతసేపటికీ శబ్దం అలాగే వస్తుండంతో రైతులు భయాందోళన చెందారు. ఈ విషయం మండలంలో దావానలంగా వ్యాపించింది.

- కలువాయి, (ఆంధ్రజ్యోతి)



మేత కోసం ఆవుల వలస..

వర్షాకాలం ప్రారంభమవడంతో స్థానిక పశుకాపరులు మేత కోసం పశువులతో ఉదయగిరి నియోజకవర్గం నుంచి పలు ప్రాంతాలకు వలస వెళ్లి అక్కడ కొంతకాలం ఉండి తిరిగి రావడం ఆనవాయితీ. ఈ క్రమంలో జలదంకి మండలం బ్రాహ్మణ క్రాక నుండి కలిగిరి, దుత్తలూరు మీదుగా కడప జిల్లా బద్వేలు ప్రాంతానికి గోవులను మేత కోసం తరలించకుపోవడం ఆంధ్రజ్యోతికి కనిపించింది.

- కలిగిరి

రోగాలొస్తాయి జాగ్రత్త!

- జిల్లాలో విస్తారంగా వర్షాలు
- అంటు వ్యాధులు ప్రబలే ప్రమాదం
- అవగాహన, అప్రమత్తత అవసరం

నెల్లూరు వైద్యం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : అల్పపీడన ప్రభావంతో గడిచిన నాలుగు రోజులు జిల్లా అంతటా విస్తారంగా వర్షాలు కురిశాయి. ఎడతెరపి లేని వర్షాల వల్ల కొత్త నీరు రావడం, నీటి వనరులు కలుషితం కావడం, పారిశుధ్యలేమి తదితర కారణాలతో వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా కలరా, డయేరియా వంటి వాటితోపాటు డెంగ్యూ, చికెన్‌గున్యా, మలేరియా, టైఫాయిడ్ వంటి వ్యాధులు సోకే అవకాశం ఉంటుందంటున్నారు. ఈ క్రమంలో ప్రజలు అప్రమత్తంగా ఉంటూ ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచిస్తున్నారు.

ఇలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి

● తాగునీటిని బాగా కాచి తాగాలి ● పండ్లు, కూరగాయలను వేడి నీళ్లలో పరిశుభ్రంగా కడిగి ఉపయోగించాలి.● పిల్లలు బయటి నుంచి వచ్చిన తర్వాత కాళ్లు, చేతులు శుభ్రంగా కడగాలి ● ఇంట్లో ఆహార పదార్థాలన్నిటిపై మూతలు పెట్టాలి. ● తాజాగా ఉడికించిన కూరగాయలనే ఆహారంగా తీసుకోవాలి ● నిల్వ ఉంచిన పదార్థాలకు దూరంగా ఉండాలి ● కొవ్వులు, నూనెలు తీసుకోవటం పరిమితం చేయాలి ● పాల ఉత్పత్తులను తగ్గించాలి. హెర్బల్ టీ తాగటం మంచిది. ● ఊపిరితిత్తుల సామర్థ్యాన్ని పెంచేందుకు క్రమం తప్పకుండా శ్వాసకు సంబంధించిన వ్యాయామాలు, ప్రాణాయామం వంటివి చేయాలి.

కాచి చల్లార్చిన నీటినే తాగాలి

ప్రస్తుతం కురుస్తున్న వర్షాల కారణంగా నీరు కలుషితమయ్యే అవకాశం ఉంది. ప్రతి ఒక్కరు కాచిన నీటినే తాగాలి. ప్రత్యేక నీటి శుద్ధి కేంద్రాల ద్వారా తీసుకువచ్చే నీరు కూడా కొంత వరకు కలుషితమయ్యే అవకాశం ఉన్నందున ఆ నీటిని కూడా కాచి తాగాలి. అలాగే ఆహారాన్ని కూడా వేడిగా ఉన్నప్పుడే తీసుకుంటే మంచిది.

- డాక్టర్ అమరేంద్రనాథ్‌రెడ్డి, పీహెచ్‌సీ వైద్యుల సంఘం జిల్లా అధ్యక్షుడు



కావలిలోని పాతూరు అక్కమ్మ బావి నీటిలో క్లోరినేషన్ చేస్తున్న మున్సిపల్ సిబ్బంది (ఫైల్)

96 వైద్య శిబిరాలు

తుఫాను హెచ్చరికల నేపథ్యం లో జిల్లాలోని వర్ష ప్రభావిత ప్రాంతాల్లో వైద్య శాఖ ముందస్తు చర్యల్లో భాగంగా 96 వైద్య శిబిరాలను ఏర్పాటు చేసిం ది. అత్యవసర బాధితులకు అవసరమైన వైద్య చికిత్సలు అందించేందుకు ర్యాపిడ్ రెస్పాన్స్ టీంలను సిద్ధం చేసిం ది. కందుకూరు. కావాలి ఏరియా ఆసుపత్రులతోపాటు డీఎంహెచ్‌వో కార్యాలయంలో కలిపి 5 టీంలను ఏర్పాటు చేశారు. వీటిలో ఓ వైద్యుడు, స్టాఫ్‌నర్సులు ఉంటారు. 29 తుపాను రిలీఫ్ కేంద్రాలలో ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేసినట్లు డీఎంహెచ్‌వో డాక్టర్ పెంచలయ్య పేర్కొన్నారు. అయితే తుఫాన్ తీరం దాటి వర్షాలు తగ్గుముఖం పట్టడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు.

పంటను కాపాడుకోండిలా!

● తెగుళ్లు, చీడపీడలు ఆశించే అవకాశం

మూడు రోజులపాటు ఎడతెరపిలేని వర్షాల కారణంగా చేతికొచ్చిన పంటలతోపాటు ఇప్పుడిప్పుడే ప్రారంభ దశలో ఉన్న పంటలు దెబ్బతింటున్నాయి. ప్రారంభ దశలో ఉన్న పంటకు తెగుళ్లు, చీడపీడలు ఆశించే ప్రమాదం ఉంది. ప్రస్తుతం సాగులో ఉన్న వరితోపాటు మినుము, నిమ్మ, అరటి, మిరప వంటి పంటలను ఎలా కాపాడుకోవాలనే దానిపై కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) సమన్వయకర్త డాక్టర్ జి.లలితాశివజ్యోతి రైతులకు పలు సూచనలు, సలహాలు అందించారు.

- నెల్లూరు వ్యవసాయం, (ఆంధ్రజ్యోతి)



చేజర్ల : రామతీర్థంలో దెబ్బతిన్న వరి పైరును పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

● **వరి :** ప్రస్తుతం కోత దశలో ఉన్న వరి పొలాల్లో నీరు అధికంగా నిల్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. కాలువలు ఏర్పాటు చేసుకుని బయటకు పోయేలా చర్యలు తీసుకోవాలి. వంగిపోయిన వరి దుబ్బులను లేపి కట్టలుగా కట్టి నిలబెట్టాలి. అదేవిధంగా గింజ మొలకెత్తకుండా 5శాతం ఉప్పు ద్రావణాన్ని పిచికారీ చేయాలి. ఇక నారు మడుల్లో నిలిచిన నీరు బయటకు పంపాలి. ఎదుగుదలకు 5 సెంట్ల నారుమడికి కేజీ యూరియా, కేజీ పొటాష్ పైపాలుగా వేసుకోవాలి. తెగుళ్లు ఆశించే అవకాశం ఎక్కువగా ఉంటుంది. కాబట్టి లీటరు నీటికి 2 గ్రాముల కార్బెండజిం 12శాతంతోపాటు మ్యాంకోజెట్ 63 శాతం లేదంటే ఒక గ్రాము కార్బెండజిం 50 శాతండబ్లుపి(బావిస్టిన్) మందు ద్రావణాన్ని పిచికారీ చేయాలి. అదే విధంగా నాట్లు వేసిన పొలంలో నీరు నిల్వ లేకుండా బయటకు పంపాలి. డ్రమ్‌సీ డర్, నేరుగా విత్తే వరి పైరు ప్రస్తుతం విత్తుకోకుండా కొద్ది రోజులు ఆగిన తరువాత చేపట్టడం మంచిది. తేమ అధికంగా ఉన్న వాతావరణ పరిస్థితుల్లో నాటినట్లయితే మొలక కుళ్లు వంటి తెగుళ్లు ఆశించే అవకాశం ఉంది.

● **మినుము :** జిల్లాలో చాలా ప్రాంతాల్లో మినుము పంట వేసుకోవడం జరిగింది. మొలకదశలో ఉన్న పొలంలో నీటిని బయటకు పంపే మార్గాలు చేయాలి. కుళ్లు, మచ్చ తెగుళ్లు ఆశించకుండా లీటరు నీటికి 2మి.లీ హెక్సకొనజోల్ లేదంటే 1మి.లీ ప్రొపికోనజోల్ ద్రావణాన్ని పిచికారీ చేయాలి. ఈ దశలో చిత్తపురుగులు ఆశించే అవకాశం కూడా ఎక్కువగా ఉంది. కాబట్టి 2.5 మి.లీ క్లోరిపైరిఫాస్ లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి.

● **మిరప :** ప్రస్తుత పరిస్థితుల్లో మిరపకు వేరుకుళ్లు, ఎండు తెగులు సోకే అవకాశం ఎక్కువగా ఉంది. పొలంలో నుంచి నీటిని బయటకు పంపి లీటరు నీటికి 3 గ్రాముల కాపర్ ఆక్సిక్లోరైడ్ మందు ద్రావణాన్ని మొదళ్లు తడిచేలా 5రోజుల వ్యవధిలో 2 నుంచి 3సార్లు పిచికారీ చేయాలి. అదేవిధంగా లీటరు నీటికి 10గ్రాముల పొటాషియం నైట్రేట్ (13-0-45) కలుపుకుని పిచికారీ చేయాలి.

● **ఆకుకూరలు :** ఆకుకూరలు వంటి పంటలు వేసుకునే రైతులు కొద్ది రోజులు ఆగడం మంచిది. ప్రస్తుతం కూరగాయల్లో ఆకుతినే పురుగు ఆశించే అవకాశం ఉంది. నివారణకు క్వినాల్ఫాస్ 2మి.లీ లేదంటే క్లోరిపైరిఫాస్ 2.5 మి.లీ లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి



వరి పైరును పరిశీలిస్తున్న కేవీకే కోఆర్డినేటర్ లలితాశివజ్యోతి పక్కనే శాస్త్రవేత్త లోకేష్‌బాబు తదితరులు (ఫైల్)


● **అరటి :** పక్వ దశకు వచ్చిన పండ్ల తోగల్లో వెంటనే కోత చేపట్టాల్సిన అవసరం ఉంది. అధిక గాలులను తట్టుకునేలా కర్రలను ఏర్పాటు చేసుకోవాలి. ప్రస్తుత పరిస్థితుల్లో అరటికి ఆకుమచ్చ తెగులు సోకే అవకాశం ఎక్కువగా ఉంది. కాబట్టి వర్షం ఆగిన 2 నుంచి 3 రోజులకు లీటరు నీటికి 1మి.లీ ప్రొపికోనజోల్ లేదంటే 1.4మి.లీ టెబుకోనజోల్‌తోపాటు ట్రైఫ్లాక్సీస్ట్రోబిన్ కలిపి పిచికారీ చేయాలి.

● **నిమ్మ :** తోటల్లో గజ్జి తెగులు ఆశించే అవకాశం ఎక్కువగా ఉంటుంది. నివారణకు 3 గ్రాముల కాపర్ ఆక్సిక్లోరైడ్ తోపాటు 0.1గ్రా స్ట్రెప్టోమైసిన్ సల్ఫేట్ ద్రావణాన్ని లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. వేరుకుళ్లు తెగులు వ్యాపించకుండా లీటరు నీటికి 2గ్రాముల కార్బండజిం కలిపిన మందు ద్రావణాన్ని ఒక చెట్టుకు 20 లీటర్లు లెక్కన పాది అంత తడిచేలా పోయాలి.

చలిగాలులకు రొయ్యలు భద్రం

ముత్తుకూరు (ఆంధ్రజ్యోతి) : తుఫాన్ ప్రభావంతో కురిసిన వర్షంతో పెరిగిన చలిగాలుల తీవ్రత నేపథ్యంలో రొయ్యలసాగులో పలు సమస్యలు తలెత్తే అవకాశాలు ఉన్నాయి. తగిన జాగ్రత్తలు పాటించడం ద్వారా నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చని మత్స్యశాస్త్రవేత్తలు తెలిపారు.

● తరచూ రొయ్యల చెరువులో నీటిని పరిశీలిస్తూ ఎలాంటి విష వాయువులు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.



● వర్షాల సమయంలో ఒక చెరువు నుంచి మరో చెరువులోకి రొయ్యల మార్పిడి చేయరాదు. దీనివల్ల వైరస్ సంబంధిత వ్యాధులు సంక్రమించే ప్రమాదం ఎక్కువ. చెరువులకు వలలు ఏర్పాటు చేసుకోవడం మంచిది.

● చల్లని వాతావరణం లో రొయ్యలు మేతను తక్కువగా తీసుకుంటాయి. అందువల్ల చెక్ ట్రేల ద్వారా మేత వినియోగాన్ని పరిశీలిస్తూ తగిన మోతాదులో మేత వేయాలి. లేదంటే మిగిలిన మేత వ్యర్థాలు చెరువు అడుగుభాగానికి పేరుకుని కుళ్లి విష వాయువులు తయారయ్యే అవకాశం ఉంది.

● చెరువులో ఆక్సిజన్ స్థాయిలు పడిపోకుండా ఎప్పటికప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలి. రాత్రుళ్లే కాకుండా పగలు కూడా ఏరియేటర్లను వినియోగించి ఆక్సిజన్ స్థాయికి పెంచుకోవడం ఉత్తమం.

● శీతల వాతావరణంలో రొయ్యల్లో ఎదుగుదల లోపాలు ఏర్పడే అవకాశం ఉంది. అందువల్ల తక్కువ సాంద్రతలో రొయ్యలసాగు చేయడం ద్వారా సమస్యను అధిగమించవచ్చు.

'సోమశిల'కు 35,956 క్యూసెక్కుల వరద

అనంతసాగరం (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి వరద ప్రవాహం పెరుగుతోంది. బుధవారం 23 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదవగా గురువారం నాటికి 35,956 క్యూసెక్కులకు చేరింది. డ్యాం పూర్తి సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా 54.894 టీఎంసీల నీరు నిల్వ ఉంది. దిగువ డెల్టాకు 50, కండలేరుకు 8,000, ఉత్తరకాలువకు 40 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

● 'రాళ్లపాడు'లో పెరిగిన నీటిమట్టం

లింగసముద్రం (ఆంధ్రజ్యోతి) : రాళ్లపాడు ప్రాజెక్టులో నీటిమట్టం 14 అడుగులకు చేరింది. ప్రాజెక్టులోకి 900 క్యూసెక్కుల మేర నీరు వస్తున్నట్టు ప్రాజెక్టు ఏఈ చంద్రమౌళి తెలిపారు. ఎగువ ప్రాంతంలో వర్షాలు ఆగడంతో నీటి ప్రవాహం తగ్గినట్టు పేర్కొన్నారు. ప్రస్తుతం ఉత్తర కాలువ నుంచి 180 క్యూసెక్కులు, మిగిలిన నీరు మన్నేరు నుంచి వస్తున్నట్టు పేర్కొన్నారు.

ఎన్నిసార్లు చెప్పినా మారరా?

- పారిశుధ్య పరిశీలనలో మంత్రి నారాయణ మండిపాటు
- ఆరుగురు ఉద్యోగులకు షాకాజు నోటీసులు
- ఎంహెచ్‌వోపై ఆగ్రహం



బోడిగాడితోట పరిసర వీధిలో పర్యటిస్తున్న మంత్రి నారాయణ, కలెక్టర్ ఆనంద్

నెల్లూరు(సిటీ), అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి) : 'శానిటేషన్ ఏమాత్రం బాగోలేదు. ఐయామ్ నాట్ శాటిస్‌ఫైడ్. మీకు ఎన్నిసార్లు చెప్పాలి?, నాకు శుభ్రత ముఖ్యం, ఇలా చేస్తే కుదరదు' అంటూ రాష్ట్ర పుర పాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ నెల్లూరు కార్పొరేషన్ అధికారులపై మండిపడ్డారు. రోడ్లపై చెత్తేంటంటూ ఎంహెచ్‌వో చైతన్యపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం నెల్లూరు నగరంలోని పెన్నా పరివాహక ప్రాంతంలో ఇసుకను పరిశీలించేందుకు కలెక్టర్ ఆనంద్, జేసీ, కమిషనర్‌తో కలిసి మంత్రి వెళ్లారు. 5వ డివిజన్ బోడిగాడితోట వద్ద స్థానికులు మంత్రిని కలిశారు. తమ ప్రాంతంలో పారిశుధ్యం అధ్వానంగా ఉందని ఫిర్యాదు చేశారు. వెంటనే వీధుల్లోకి నడిచివెళ్లిన ఆయన డ్రైనేజీ కాలువలను, రోడ్లను పరిశీలించారు. స్థానికులు చెప్పిందే నిజమని నిర్ధారించుకుని, అక్కడే ఉన్న ఎంహెచ్‌వోపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మీరు డివిజన్లలో తిరుగుతున్నారా? అని ప్రశ్నించారు. అనంతరం 48వ డివిజన్‌లోనూ ఆకస్మికంగా పర్యటించారు. అక్కడ కూడా పారిశుధ్యలేమి కనిపించడంతో మరోమారు యంత్రాంగంపై మండిపడ్డారు. స్థానికంగా విధుల్లో ఉండే శానిటేషన్ సెక్రటరీలు, ఇన్‌స్పెక్టర్లను సస్పెండ్ చేయాలని ఆదేశించారు. దీంతో కమిషనర్ సూర్యతేజ ఆరుగురు శానిటేషన్ ఉద్యోగులకు షోకాజు నోటీసులు జారీ చేశారు. కాగ రామలింగా పురం, చిల్డ్రన్స్‌పార్కు ప్రాంతాల్లోని డివైడర్లకు పోస్టర్లు కనిపించడంతో ప్లానింగ్ విభాగం అధికారులపై మంత్రి ఆగ్రహించారు. స్థానిక ప్లానింగ్ సెక్రటరీలకు షోకాజు నోటీసులు ఇవ్వాలని ఆదేశించారు. కాగా, మంత్రి గురువారం 47వ డివిజన్‌లోని షాదీమంజిల్‌ను సందర్శించారు. దాతల ద్వారా మంజిల్‌కు కొంత సామగ్రిని అందచేశారు. అనంతరం షాదీమంజిల్ నిర్వహణపై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి, రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్ అజీజ్, కమిషనర్ సూర్యతేజ, నుడా మాజీ చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, డిప్యూటీ మేయర్ రూప్ కుమార్‌యాదవ్, టీడీపీ నేత తాళ్లపాక అనురాధ తదితరులు పాల్గొన్నారు.

నగరంలో మూడు నూతన రీచ్‌లు

● 21 నుంచి ప్రారంభిస్తాం : మంత్రి నారాయణ

నెల్లూరు (వెంకటేశ్వరపురం), అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : ప్రజలకు ఇసుకను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తెచ్చేందుకు అన్ని చర్యలు తీసుకొంటున్నట్లు రాష్ట్ర మంత్రి పి నారాయణ పేర్కొన్నారు. గురువారం నగరంలోని పెన్నా పరివాహక ప్రాంతాల్లో కలెక్టర్ ఆనంద్, కమిషనర్, సూర్యతేజలతో కలిసి మంత్రి పర్యటించారు. పెన్నా సమీపంలోని మూడు నూతన రీచ్‌లను పరిశీలించి, మంత్రి మాట్లాడారు. సోమవారం నుంచి ఈ 3 రీచ్‌లు ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు తెలిపారు. 54 డివిజన్ పరిధిలోని భగత్‌సింగ్‌కాలనీతోపాటు 48, 49 డివిజన్ల పరిధిలో రెండు రీచ్‌లను ప్రారంభిస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం జిల్లావ్యాప్తంగా మూడు ఇసుక స్టాక్ పాయింట్లు మాత్రమే ఉన్నాయని, నగరంలో 3, జిల్లాలో మరో 7 పాంతాల్లో స్టాక్ పాయింట్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఇక నగరంలో ఫ్లెక్సీలను కేవలం 48 గంటలపాటు మాత్రమే ఉంచాలన్నారు. అదేవిధంగా రోడ్లపై తిరుగుతున్న పశువులను వాటి యజమానులు సొంత షెడ్లలో మాత్రమే ఉంచుకోవాలని సూచించారు. రూ.54 కోట్లతో నగరంలోని డ్రైన్లు డిజైన్ చేయమని ఆదేశాలు ఇచ్చామన్నారు. మంత్రి వెంట టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్, నాయకులు విజయభాస్కర్‌రెడ్డి, అనూరాధ, పట్టాభిరామిరెడ్డి తదితరులు ఉన్నారు.

నూతన ఆవిష్కరణలు చేయాలి

● వీఎస్‌యూ వీసీ ఆచార్య విజయభాస్కర్‌రావు



మ్యూజియంలో డీకేడబ్ల్యూ కళాశాల విద్యార్థినులు

నెల్లూరు (విద్య), అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు పరిశోధనా సామర్థ్యంతో నూతన ఆవిష్కరణలు చేయాలని విక్రమ సింహపురి విశ్వ విద్యాలయ ఉపకులపతి ఆచార్య ఎస్ విజయ భాస్కర్‌రావు పిలుపునిచ్చారు. నెల్లూరులోని డీకే ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థినులు గురువారం ఎడ్యుకేషన్ టూర్‌లో భాగంగా వీఎస్‌యూ నిర్వహించిన సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉపకులపతి మాట్లాడుతూ సమాజంలో సమాన అవకాశాలు కల్పించడం ద్వారానే పేదరిక నిర్మూలన సాధ్యమన్నారు. దీనికి విద్య ఒక్కటే అత్యున్నతమైన మార్గమని, విద్యార్థులు ఆ దిశగా కృషి చేసి ఉన్నతంగా ఎదిగేందుకు శ్రమించాలని సూచించారు. వర్సిటీ రిజిస్ట్రార్ సునీత మాట్లాడుతూ విద్యార్థి దశనుంచే ప్రతి ఒక్కరూ సేవాభావాన్ని అలవరచుకోవాలన్నారు. అనంతరం విశ్వవిద్యాలయంలో అన్ని విభాగాలను సందర్శించడంతోపాటు సేంద్రీయ వ్యవసాయం, తేనెటీగల పెంపకం, చెత్త నుంచి కంపోస్ట్ ఎరువు తయారు చేయడం వంటి వాటిపై వీఎస్‌యూ ప్రోగ్రాం ఆఫీసర్ వెంకట సుబ్బారెడ్డి విద్యార్థినులకు అవగాహన కల్పించారు. అలాగే కాకుటూరులోని జైన్ దేవాలయాన్ని, చెముడుగుంటలోని జిల్లా విజ్ఞాన ప్రదర్శనశాలను, జిల్లా మ్యూజియంను విద్యార్థులు సందర్శించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐవో డాక్టర్ కే శ్రీనివాసులు, వీఎస్‌యూ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ అల్లం ఉదయశంకర్, డీకే కళాశాల హాస్టల్ డిప్యూటీ వార్డెన్ కరుణకుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

జెన్నీమిల్క్ కేసులో మరో ఇద్దరి అరెస్టు

- ఐదుకు చేరిన నిందితులు
- విజయనగర ఎస్పీ శ్రీహరిబాబు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ శ్రీహరి బాబు

బళ్లారి గాంధీనగర్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): బళ్లారి కేంద్రంగా గాడిద పాల వ్యాపారం పేరుతో రైతులను మోసం చేసిన జెన్నీమిల్క్ కంపెనీ ప్రతినిధులు మరో ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేశారు. బుధవారం విలేకరుల సమావేశంలో విజయనగర ఎస్పీ శ్రీహరి బాబు నిందితుల వివరాలను వెల్లడించారు. జెన్నీ మిల్క్ కేసులో ఇదివరకే ముగ్గురిని అరెస్ట్ చేశామని, ఇప్పుడు మరో ఇద్దరిని అరెస్టు చేశామన్నారు. ఆంధ్రదేశ్‌లోని నెల్లూరు జిల్లాకు చెందిన ఎస్.హర్షవర్దన్ రాజు, రాయచోటికి చెందిన నంజనగూడిన, ఛామలపురలో నివాసం ఉంటున్న యోగానంద రెడ్డిలను పావగడ ప్రాంతంలో అరెస్ట్ చేశామన్నారు. కంపెనీకి చెందిన 33 బ్యాంకు ఖాతాలను సీజ్ చేశామన్నారు. ఈ కేసులో ఎంత మొత్తంలో గోల్‌మాల్ జరిగిందనే దానిపై విచారణ జరుపుతున్నామన్నారు. కోట్లాది రూపాయల వ్యవహారం జరిగినట్లు ఆరోపణలు ఉన్న నేపథ్యంలో కేసును సీఐడీ స్థాయిలో దర్యాప్తు చేయాలని కోరామని ఎస్పీ పేర్కొన్నారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీ సలీం పాషా, డీఎస్పీ మంజునాథ్ తదితర సిబ్బంది పాల్గొన్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	140
లేయర్ లైవ్	120
స్కిన్ చికెన్	250
స్కిన్‌లెస్	276
లేయర్	204

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.7375
వెండి కిలో ధర	రూ. 93,700
వెండి ఒక గ్రాము	రూ. 96.70

ఆయకట్టు ఎంత?

- నిర్ధారణ ఎప్పటికి పూర్తయ్యేను?
- లేఅవుట్లుగా మారుతున్న పంట పొలాలు
- అయినా పాత లెక్క ప్రకారమే నీటి కేటాయింపులు
- రెండు నెలల క్రితం మంత్రులు, కలెక్టర్ ఆదేశం
- ఇప్పటికీ కదలని ఇరిగేషన్, రెవెన్యూ శాఖలు
- లోకలైజేషన్‌పై ఉదాసీనత



నెల్లూరు రూరల్‌లో లేఅవుట్‌గా మారిన పంట పొలం

నెల్లూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : ఆయకట్టు నిర్ధారణ విషయంలో ప్రభుత్వం యంత్రాంగంలో అంతులేని అలసత్వం కనిపిస్తోంది. ఎన్నో ఏళ్ల నుంచి మెట్ట ప్రాంత రైతులు మొత్తుకుంటున్నా పట్టించుకున్న నాథుడు లేడు. ఎప్పుడో రెండున్నర దశాబ్దాల క్రితం నిర్ధారించిన ఆయకట్టు ప్రకారమే ఇప్పటికీ సోమశిల, కండలేరు జలాశయాల నుంచి నీటి కేటాయింపులు జరుపుతున్నారు. ఈ పాతికేళ్లలో కొన్ని వేల ఎకరాల పంట పొలాలు లేఅవుట్లుగా మారిపోయాయి. ఇలా తగ్గిన భూమి స్థానంలో మెట్ట ప్రాంతాల్లోని భూములను స్థిరీకరించాలని ఏళ్ల నుంచి విజ్ఞప్తులు అందుతున్నాయి. నూతనంగా కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ఈ అంశంపై దృష్టి సారించింది. రానున్న సీజన్‌లోపు లోకలైజేషన్(ఆయకట్టు నిర్ధారణ) పూర్తి చేసి, డెల్టాలో తగ్గిన దామాషాను మెట్ట ప్రాంతంలో స్థిరీకరించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ప్రస్తుతం ఏ కాలువ కింద ఎంత వాస్తవ ఆయకట్టు ఉందో లెక్క తేల్చాలంటూ రెండు నెలల క్రితం జిల్లాకు చెందిన మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, పొంగూరు నారాయణతోపాటు కలెక్టర్ ఓ ఆనంద్ అధికారులను ఆదేశించారు. కానీ నేటికీ ఇరిగేషన్, రెవెన్యూ శాఖలు కదలడం లేదు.

లేఅవుట్లుగా పంట పొలాలు

జిల్లాలో ప్రధానమైనది పెన్నా డెల్టా. సోమశిల జలాశయం కింద 5.50 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంటే అందులో మెజారిటీ పెన్నా డెల్టాలోనే ఉంది. సర్వేపల్లి, నెల్లూరు రూరల్, కోవూరు, ఆత్మకూరు, కావలి నియోజకవర్గాల పరిధిలో డెల్టా విస్తరించి ఉంది. ఈ ప్రాంతాల్లో చాలా భూములు లేఅవుట్లుగా రూపాంతరం చెందాయి. ముఖ్యంగా నెల్లూరు నగరం చుట్టు పక్కల వేల ఎకరాల పంట భూముల్లో లేఅవుట్లు వెలిశాయి. ఇక్కడే కాకుండా జిల్లాలో అనేక ప్రాంతాల్లో వేల ఎకరాల సాగు భూముల్లో ఇప్పుడు వ్యవసాయం జరగడం లేదు. కానీ ఈ భూములను కూడా లెక్కల్లోకి తీసుకొని ఏటా సాగునీటి సలహా మండలి(ఐఏబీ) సమావేశంలో నీటి కేటాయింపులు జరుపుతున్నారు. దీంతో నీరు వృథా అవుతోంది. నిబంధనల ప్రకారం అధికార యంత్రాంగం ఎప్పటికప్పుడు లోకలైజేషన్ ప్రక్రియను కొనసాగించాల్సి ఉంటుంది. కానీ అది అమలు కావడం లేదు. పాతికేళ్ల క్రితం సోమశిల ఆయకట్టును నిర్ధారించారు. ఇప్పటికీ దానినే అనుసరిస్తున్నారు.

కదలని యంత్రాంగం

రైతుల విజ్ఞప్తులను పరిగణలోకి తీసుకున్న మంత్రులు.. వీలైనంత త్వరగా లోకలైజేషన్ పూర్తి చేయాలని ఆదేశించారు. కలెక్టర్ కూడా పలుమార్లు సమావేశాలు నిర్వహించి లోకలైజేషన్ వేగంగా పూర్తి చేయాలని సూచించారు. కానీ ఈ పని చేయాల్సిన రెవెన్యూ, ఇరిగేషన్ శాఖలు మాత్రం కదలడం లేదు. రెండు వారాల్లో పూర్తి చేయాల్సిన పనిని రెండు నెలలు గడిచినా చేయలేదు. నెల క్రితం వరకూ బదిలీలు అంటూ నెట్టుకొచ్చారు. ఆ తర్వాతేమో కొత్తగా వచ్చామంటూ సాకులు వెతుక్కుంటున్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభంలోపు లోకలైజేషన్ పూర్తయితే ఐఏబీలో కొత్త ఆయకట్టు స్థిరీకరణకు నీటి కేటాయింపులు జరిపేందుకు వీలుంటుందని అందరూ భావించారు. కానీ అధికారుల తీరు చూస్తుంటే ఇప్పట్లో లోకలైజేషన్ పూర్తి చేస్తారా..? అన్న అనుమానాలు కలుగుతున్నాయి. మరో రెండు వారాల్లో ఐఏబీ నిర్వహణకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఈ లోపు ఆయకట్టు నిర్ధారణ పూర్తి చేస్తారో లేదో చూడాలి!.

మెట్టకు ప్రయోజనం

సోమశిల జలాశయం కింద డెల్టాకు మొదటి ప్రాధాన్యత ఉంటుంది. డెల్టాలోని భూములకు నీరిచ్చాకనే మిగిలిన ప్రాంతాలకు కేటాయింపులు జరపాలని నిబంధనలు చెబుతున్నాయి. ఇప్పుడు డెల్టాతోపాటు అన్ని కాలువల కింద ఉన్న ఆయకట్టులో కొన్ని వేల ఎకరాల సాగు భూములు మాయమయ్యాయి. ఆ లెక్క తేలిస్తే ప్రస్తుతం ఏ కాలువ కింద ఎంత ఆయకట్టు ఉందన్న విషయం స్పష్టమవుతుంది. దీంతో ప్రస్తుత స్థిరీకరణ ఆయకట్టు తగ్గుతుంది. ఎంత మేర తగ్గిందో అదే స్థాయిలో కొత్త ఆయకట్టును సోమశిల కింద స్థిరీకరించేందుకు అవకాశం ఏర్పడుతుంది. ఇది మెట్ట ప్రాంత రైతాంగానికి ఎంతో ప్రయోజనాన్ని చేకూరుస్తుంది. డెల్టాలో తగ్గిన వేల ఎకరాల ఆయకట్టు మెట్టలో స్థిరీకరణ జరిగి సాగులోకి వస్తుంది. తద్వారా మెట్టలో కాలువలను కూడా బాగు చేసుకునేందుకు వీలు కలుగుతుంది.

మంచినీళ్లివ్వండి.. మహాప్రభో !



మనుబోలు మండలంలోని బండేపల్లి గ్రామస్థులు మూడురోజులుగా మంచినీళ్లు అందక అల్లాడిపోతున్నారు. ఈ క్రమంలో గురువారం గ్రామం లో ఆందోళన చేశారు. పంచాయతీ మినీ వాటర్ స్కీమ్‌కు తాగునీటిని అందించే మోటార్‌కు కరెంటు సరఫరా నిలిచిపోయింది. పొలాల్లో కరెంటు స్తంభం వర్షాలకు ఒరిగిపోవడంతో ఈ పరిస్థితి దాపురిచ్చింది. సమస్యను విద్యుత్ అధికారులకు తెలిపితే మరమ్మతులు చేశారు. అయినా ప్రయోజనం లేదు. దీంతో గ్రామానికి దూరంగా ఉన్న ఓ పరిశ్రమ వద్దకు వెళ్లి తాగునీటిని తెచ్చుకోవాల్సి వస్తోందని, ఇకనైనా పంచాయతీ అధికారులు స్పందించి తాగునీటిని గ్రామస్థులు కోరుతున్నారు.

-మనుబోలు,(ఆంధ్రజ్యోతి)

ఆదమరిస్తే ఇంతే..!



సౌత్‌మోపూరు వద్ద దెబ్బతిన్న కారు

ఇది నెల్లూరు - తాటిపర్తి రహదారి. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చాక ఈ రహదారిని ఆధునికీకరించే పనులు జరుగుతున్నాయి. తాజాగా కురిసిన వర్షాలకు వరద ప్రవాహంతో రోడ్డు పాడైంది. దీనిని గమనించని ఓ వాహనదారుడు కారు నడుపుకుంటూ వచ్చేయడంతో గుంతలోపడి కారు ముందున్న జీమ్ ఊడిపోయింది. స్థానికుల సహాయంతో కారును బయటకు తీయగా మరో మార్గంలో గమ్యం చేరుకున్నారు. కాగా, రోడ్డు నిర్మాణంలో డొల్లతనం వర్షాల కారణంగా బయటపడిందంటూ విమర్శలు గుప్పుమంటున్నాయి.

- నెల్లూరు రూరల్ (ఆంధ్రజ్యోతి)

'ఉపాధి'లో లొసుగులు తేలేనా ?

- కొనసాగుతున్న సామాజిక తనిఖీ
- 26న బహిరంగ సభ



కూలీల నుంచి వివరాలు సేకరిస్తున్న డీఆర్‌పీ (ఫైల్)

మనుబోలు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): గడిచిన ఆర్థిక సంవత్సరంలో మండలంలో జరిగిన ఉపాధి పనులపై ఈనెల 9నుంచి సామాజిక తనిఖీలు ప్రారంభమయ్యాయి. పదిరోజుల్లోనే తనిఖీలు పూర్తిచేయాలని నిర్ణయించారు. అయి తే ప్రభుత్వం పల్లెపండుగ కార్యక్రమం నిర్వహిస్తుండడంతో ఈనెల 25వరకు తనిఖీలు చేసి, 26న బహిరంగసభ ఏర్పాటు చేసి తనిఖీలు ముగించేలా ఉపాధిహామీ అధికారులు చర్యలు తీసుకున్నారు. ఎస్‌ఆర్‌పీ నాగార్జున ఆధ్వర్యంలో పదిమంది డీఆర్‌పీలు 19 పంచాయతీల్లో జరిగిన ఉపాధి పనులపై జోరుగా తనిఖీలు చేస్తున్నారు. గ్రామాలకు వెళ్లి కూలీల నుంచి జాబ్‌కార్డుల సేకరణ, నమోదు, ఎన్ని రోజులు పనులకు వెళ్లారు. ఎంతమేర కూలీ వచ్చిందన్న వివరాలను నమోదు చేసుకుని కూలీల నుంచి రాతపూర్వక సమాధానాలు తీసుకుంటున్నారు. ఇవి కాక కాలువలు, జగనన్న కాలనీలు, ఇళ్లు, రోడ్లు, చెరువు కట్టల మరమ్మతులపై క్షేత్రపరిశీలన చేసి, కొలతలు తీసి మరి రికార్డులలోని వ్యత్యాసాన్ని పరిశీలించి నమోదు చేస్తున్నారు.

● రూ. ఆరు కోట్లలో ఎంత అవినీతి జరిగింది ?

సుమారుగా 390పనులకు ఈ ఏడాది దాదాపుగా రూ.6కోట్లు ఖర్చుచేశారు. అయితే ఈ మొత్తంలో ఎంతమేర అవినీతి జరిగింది, పనులు చేయకుండానే క్షేత్రసహాయకులు, రాజకీయనాయకులు కూలీల పేరుతో ఎంతమేర దోపిడీ చేశారన్నది తేలుస్తారా, సామాజిక తనిఖీల నివేదికలను బహిరంగసభలో తనిఖీలకు వచ్చే అధికారులు తుస్సుమని వదిలేస్తారా.. అనేది తేలాల్సి ఉంది. ప్రతి ఏడాది తనిఖీలు చేస్తుంటారు. రూ. లక్షల్లో స్వాహాచేశారని తనిఖీ బృందాలు చెప్పినా, తనిఖీలకు వచ్చే ఉన్నతాధికారులు మమ అనిపించేసి రికవరీలకు రాస్తున్నట్లు చెబుతుంటారే తప్ప కూలీలకు ఈ తనిఖీల ద్వారా న్యాయం జరగడం లేదు. కూలీలు కోల్పోయిన పనిదినాలు, కూలిని తిరిగి సిబ్బందిచేత కూలీలకు అందించే పని జరగడం లేదు. రికవరీ పేరుతో సమయం ఇచ్చి వదిలేస్తున్నారు. రికవరీ చేసిన విషయాన్ని గుట్టు చప్పుడుగా కానిచ్చేస్తున్నారు. డ్వామాలో పనిచేసే సిబ్బందిపై ఎలాంటి చర్యలు తీసుకోకుండానే ప్రతి ఏటా తనిఖీలను, తనిఖీల్లో వెల్లడించే అవినీతిపై ఏమాత్రం పట్టించుకోవడం లేదు. ఈ ఏడాదైనా ఉపాధిలో జరిగిన లోటుపాట్లు, అవకతవకలు బయటపడతాయా, కూలీలకు న్యాయం జరుగుతుందో, లేదో వేచిచూడాల్సిందే.

ఎస్జీటీలకు రెసిడెన్షియల్ శిక్షణ

- 21 నుంచి తిరుపతి జిల్లాలో నిర్వహణ
- తొలి స్పెల్‌కు 100 మంది ఎంపిక
- వ్యతిరేకిస్తున్న ఫ్యాప్టో

నెల్లూరు (విద్య), అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులకు రెసిడెన్షియల్ శిక్షణ నిర్వహించేందుకు పాఠశాల విద్యాశాఖ ఏర్పాట్లు చేస్తోంది. 1, 2 తరగతులు బోధిస్తున్న ఉపాధ్యాయులకు ఈనెల 21 నుంచి 26వతేదీ వరకు తిరుపతి జిల్లాలో తర్ఫీదు ఇవ్వనున్నారు. మొత్తం 14 స్పెల్స్‌లో శిక్షణ తరగతులు నిర్వహించనున్నారు. జిల్లాలో మొత్తం 2,700 మంది ఎస్‌జీటీలు ఉండగా తొలి స్పెల్‌లో 100 మంది హాజరు కానున్నారు. ఇప్పటికే ఆ జాబితాతో జిల్లా విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. అలాగే జిల్లా నుంచి ఇప్పటికే 114 మంది ఉపాధ్యాయులు రీసోర్స్ పర్సన్లుగా శిక్షణ పొంది ఉండడంతో వీరిలో తొలి స్పెల్‌కు ఏడుగురిని ఎంపిక చేసి తిరుపతి పంపించనున్నట్లు అధికారులు తెలిపారు. శిక్షణ పొందిన వారిలో మిగిలిన ఉపాధ్యాయులు తరువాత స్పెల్స్‌లో ట్రైనింగ్ ఇచ్చేందుకు సంసిద్ధంగా ఉండాలని సూచించారు.

వెసులుబాటు కల్పించాలి: ఫ్యాప్టో

ఉపాధ్యాయులకు రెసిడెన్షియల్ శిక్షణ వల్ల విద్యా వ్యవస్థకు మేలు కన్నా నష్టమే ఎక్కువ జరుగుతుందని ఫాప్టో నేతలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికే బోధనేతర కార్యక్రమాలతో టీచర్లు బోధనకు దూరమయ్యారన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు కలిపి మొత్తం 9 కేంద్రాల్లో శిక్షణ తరగతులు ఏర్పాటు చేశారని, అసలే బోధనకు ఇబ్బందులు ఉన్న తరుణంలో దూర ప్రాంతాల్లో రెసిడెన్షియల్ ట్రైనింగ్‌కు హాజరవడం ఇబ్బందిగా ఉంటుందన్నారు. మహిళలు, అనారోగ్యంతో ఉన్న వారు, చిన్నపిల్లల తల్లులు, అనారోగ్య బాధిత తల్లిదండ్రులు ఉన్నవారు ఈ శిక్షణకు హాజరవడం కష్టతరమంటున్నారు. ఇప్పటికే శిక్షణ పొందిన రీసోర్స్ పర్సన్లతో స్కూల్ కాంప్లెక్స్‌లలో శిక్షణ ఇస్తుండగా ప్రత్యేకంగా మళ్లీ శిక్షణ తరగతులు ఏర్పాటు చేయడాన్ని ఆక్షేపిస్తున్నారు. దీనిపై ఉన్నతాధికారులు పునరాలోచన చేయాలని, మండల, డివిజన్ స్థాయిలో నానా రెసిడెన్షియల్ శిక్షణ నిర్వహించాలని కోరుతున్నారు.

సహాయక చర్యలను వేగవంతం చేయాలి

● జడ్పీ సీఈవో మోహన్‌రావు



అధికారులతో సమీక్షిస్తున్న జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి మోహన్‌రావు

ఆత్మకూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : తుపాను, వరదల సమయంలో పెన్నానది పరివాహక ప్రాంతాల్లో సహాయక చర్యలను వేగవంతం చేయాలని మండల స్పెషల్ ఆఫీసరుగా నియమితులైన జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి జి మోహన్‌రావు తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఆయన అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరదల కారణంగా సోమశిల జలాశయం నుండి పెద్దఎత్తున నీరు విడుదల జరిగినప్పుడు ప్రతి గ్రామానికి ఒక ప్రత్యేకాధికారిని నియమించి పర్యవేక్షించాలని ఆదేశించారు. తహసీల్దారు, ఇరిగేషన్ ఏఈ, ఎస్ఐ ఒక టీమ్‌గా ఏర్పడి తీరం వెంబడి ఉన్న గ్రామాల్లో పర్యటించాలని తెలిపారు. ముంపు ప్రాంతాలను గుర్తించి జనావాసాలలోకి నీరు చేరకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. గ్రామాల్లో తాగునీటి సరఫరా, పారిశుధ్య చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం ఆయన ఆత్మకూరు మండలంలోని అప్పారావుపాళెం పరిసర ప్రాంతాలలో పర్యటించి ప్రస్తుత పరిస్థితిపై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ స్థాయి అభివృద్ధి అధికారి టి రమణయ్య, ఎంపీడీవో పి ఐజాక్‌ప్రవీణ్, తహసీల్దారు సుధీర్, ఇరిగేషన్, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈలు రాజేష్, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి

● సంగం : వర్షాలు ప్రారంభమవడంతో జిల్లావ్యాప్తంగా పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు జడ్పీ సీఈవో మోహన్‌రావు పేర్కొన్నారు. గురువారం ఆయన సంగం మండల పరిషత్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు తనిఖీ చేశారు. గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీవో షాలెట్‌కు సూచించారు. అదేవిధంగా వర్షాల వల్ల తాగునీరు కలుషితమై అంటువ్యాధులు ప్రబలకుండా కాచి చల్లార్చిన నీటిని తాగాలని ప్రజలకు సూచించారు. కార్యదర్శులు పంచాయతీల్లో పారిశుధ్యం మెరుగుకు కృషి చేయాలన్నారు.

జీజీహెచ్‌కు రూ.1.2 లక్షల విరాళం

● విశ్రాంత ఉద్యోగి దాతృత్వం



సూపరింటెండెంట్‌కు చెక్కు అందిస్తున్న దాత ఆంజనేయప్రసాద్

నెల్లూరు వైద్యం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : మున్సిపల్ శాఖ విశ్రాంత ఉద్యోగి అంజనేయప్రసాద్ నెల్లూరులోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి రూ. లక్ష విరాళం అందించారు. గురువారం ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సిద్దానాయక్‌కు విరాళం చెక్కును అందజేశారు. ఆసుపత్రిలో జరిగే అభివృద్ధి కార్యక్రమాల కోసం ఈ మొత్తాన్ని అందజేశానని, ప్రసూతి విభాగంలోని చిన్న పిల్లల పాలకోసం మరో రూ.20వేలు అందించినట్లు దాత అంజనేయప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ నరేంద్ర, డాక్టర్ మస్తాన్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

లింగసముద్రం, (ఆంధ్రజ్యోతి) అక్టోబరు 17: అన్నెబోయినపల్లి సమీపంలోని మన్నేరు వాగులో ఇసుకను రవాణా చేస్తున్న రెండు ట్రాక్టర్లను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్‌ఐ షేక్ మహబూబ్ సుబాని తెలిపారు. ముం దుగా అందిన సమాచారం మేరకు తన సి బ్బంది బుధవారం అర్ధరాత్రి మన్నేరు వాగు లో ఇసుక నింపుకొని వెళుతున్న ట్రాక్టర్లు, డ్రైవర్లను పోలీస్‌స్టేషన్‌కు తరలించామ న్నారు. ఈ మేరకు ఇద్దరు డ్రైవర్లపై కేసు నమో దు చేశామన్నారు.

కూలిన పొగాకు బ్యారన్

వలేటివారిపాలెం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): నాలుగు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షాలకు కాకర్లవారిపాలెంలో ఉండేల వెంకటకృష్ణారెడ్డి, గోదా ర మణారెడ్డిలకు చెందిన జాయింట్ పొగాకు బ్యారన్ కూలిపోయింది. సుమారు లక్షన్నర ఆస్తినష్టం జరిగినట్లు బాధితుడు వెంకట కష్టారెడ్డి తెలిపారు. పొగాకుబోర్డు అధికారులు తమను ఆదుకోవాలని కోరారు.

దెబ్బతిన్న పొలాల పరిశీలన

చేజర్ల, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): గత నాలుగు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు మండలంలోని టికే పాడు, కోటితీర్థం గ్రామాలలో నీట మునిగిన పొలాలను నెల్లూరు ఆత్మ పీడీ శివనారాయణ, కేవీకే కోఆర్డినేటర్ శివజ్యోతి గురువారం పరిశీలించారు. ఈ రెండు గ్రామాలలో సుమారు 70 హెక్టార్లలో వరిపైరు నేలవాలిన నేపథ్యంలో పంట పొలాలను పరిశీలించి తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు, ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు సురేఖ, నాయక్, ఏవో శశిధర్, వీపీఏ హసన్ రైతులు పాల్గొన్నారు.

ఘనంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠ

దగదర్తి, (బిట్రగుంట) అక్టోబరు 17: నారాయణపురం మాధ వయ్య స్వామి ఆలయంలో గురువారం ధ్వజస్తంభ, విగ్రహాల ప్రతిష్ఠాపన చేప ట్టారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణా రెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల ఇన్‌చార్జి పమిడి రవికుమార్ చౌదరి, మండల అధ్యక్షుడు అల్లం హను మంతరావు, నేతలు శ్రీహరినాయుడు, మారుబోయిన వేణుగోపాల్, గోపిసాని శీనయ్య, డేగా అంక్కయ్య, పులి శ్రీని వాసులు, సురేష్, గద్దగుంట మాధవరావు ఉన్నారు.

గృహ నిర్మాణాలు పూర్తిచేయాలి

ఆత్మకూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని లేఅవుట్లలో వివిధ దశల్లో ఉన్న గృహ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని హౌసింగ్ పీడీ వేణుగోపాల్ తెలిపారు. గురువారం ఆయన బోయళ్లచిరువెళ్లలోని లేఔట్‌ను పరిశీలించారు. లబ్ధిదారులకు అవసరమైన మెటీరియల్‌ను అందించి ఇళ్లు పూర్తయ్యేలా చూడాలని అధికారులకు సూచించారు.

● అనంతసాగరం: సోమశిల, అనంతసాగరం, వడ్డిపాలెంలోని లేఅవుట్‌లలో నిర్మాణ దశలో ఉన్న ఇళ్లను హౌసింగ్ పీడీ వేణుగోపాల్ పరిశీలించారు. లబ్ధిదారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏఈ శరత్, ఏపీవో దయాసాగర్, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నివారణ చర్యలు

వలటివారిపాలెం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక బస్టాండు సెంటరులోని మూడు రోడ్ల కూడలిలో గురువారం స్థానిక ఎస్‌ఐ మరిదినాయుడు ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది ట్రాఫిక్ నివారణకు చర్యలు తీసుకున్నారు. ఆక్రమణలో రోడ్లు అన్న ఆంధ్రజ్యోతి కథనానికి ఎస్‌ఐ మరిదినాయుడు స్పందించారు. బస్టాండు సెంటరులోని ఆటోలు, ద్విచక్రవాహనాలు రోడ్లపై లేకుండా చర్యలు తీసుకున్నారు.

విత్తనాలకు రిజిస్ట్రేషన్ తప్పనిసరి

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలో రాయితీపై శనగ విత్తనాలు కావాల్సిన రైతులు ఆయా రైతుసేవా కేంద్రాల్లో తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి ఎన్ వెంకట సుబ్బారెడ్డి గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

'రాళ్లపాడు'కు ఏఈనే దిక్కు!

● బదిలీపై వెళ్లిపోయిన డీఈలు, ఏఈలు ● ఆయకట్టు రైతుల ఆందోళన

లింగసముద్రం, (ఆంధ్రజ్యోతి) అక్టోబరు 17: నాలుగు మండలాల్లోని రైతుల జీవనాడి అయిన రాళ్లపాడు ప్రాజెక్టుకు ప్రస్తుతం ఒక్క ఏఈ మాత్రమే దిక్కయ్యారు. ఇటీవల జరిగిన బదిలీల్లో ప్రాజెక్టులోని సబ్ డివిజన్-1, సబ్ డివిజన్-2లో పనిచేస్తున్న ఇద్దరు డీఈలు, నలుగురు ఏఈలలో ఇద్దరు డీఈలు, ముగ్గురు ఏఈలు బదిలీ అయ్యారు. వారిస్థానంలో డీఈలు కానీ ఏఈలు కానీ రాలేదు. అలాగే సింగరాయకొండలోని బకింగ్‌హామ్ కెనాల్ నుంచి డిప్యూటేషన్‌పై వచ్చిన ఇద్దరు లస్కర్లు, ఒక అటెండరు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. ఇక్కడ నుండి కందుకూరు మైనర్ ఇరిగేషన్ డీఈగా బదిలీపై వెళ్లిన హజరత్తయ్యను రాళ్లపాడుకు ఇన్‌చార్జి డీఈగా వ్యవహరిస్తున్నారు.

● సమస్యలను ఎవరికి చెప్పుకోవాలో..

రాళ్లపాడు ప్రాజెక్టుపై ఒక ఏఈ, ఇద్దరు లస్కర్లు మాత్రమే పని చేస్తుండడంతో తమ సమస్యలు ఎవరికి చెప్పుకోవాలో తెలియడం లేదని ఆయకట్టు రైతులు ఆందోళన చెందుతున్నారు. అయితే ఇన్‌చార్జి డీఈగా ఉన్న హజరత్తయ్య కందుకూరు నియోజకవర్గంలోని చెరువుల పరిస్థితిని కూడా వర్షాల సమయంలో చూడాల్సి ఉంటుంది. ఆయన అటు రాళ్లపాడు ఇటు చెరువులను పర్యవేక్షించాల్సి ఉంటుంది. ఇక ప్రాజెక్టుకు కొత్తగా పనులు వస్తున్నందున వాటిని కూడా అధికారులు పర్యవేక్షించాల్సి ఉంటుంది. ప్రస్తుతం సిబ్బంది కొరతతో ప్రాజెక్టుపై రాత్రి వేళల్లో కాపలా కూడా ఉండడం లేదని తెలుస్తోంది. ఇరిగేషన్ అధికారులు సిబ్బంది నియామకానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


రాళ్లపాడు ప్రాజెక్టు

వర్షాలకు దెబ్బతిన్న రోడ్లు


కావలి: దెబ్బతిన్న అన్నపుగుంటకు వెళ్లే రోడ్డు

కావలి అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): నాలుగురోజులుగా కురిసిన భారీ వర్షాలకు పట్టణంలో అన్నపుగుంట మీదుగా వైకుంఠపురం వెళ్లే రోడ్డు, కలుగోళ్లమ్మపేట దగ్గర రైల్వే ట్రాక్‌కు సమీపంలో పెద్ద గోయ్యి ఏర్పడింది. పాతూరులో పోలేరమ్మ అరుగు-శివాలయం రోడ్డులో గుంతలు పడ్డాయి. ముసునూరులో మర్రిచెట్టు కాలనీ వద్ద ట్రంకురోడ్డు వర్షపు నీటి ప్రవాహానికి అంచులు కోతకు గురయ్యాయి. మందాడిచెరువు ప్రాంతంలో కచ్చా రోడ్లు దెబ్బతిన్నాయి. ఇందిరమ్మ కాలనీ ప్రాంతంలో పలు రోడ్లు దెబ్బతిన్నాయి. బోగోలులో రైల్వేగేట్ ఎల్సీగేట్ -144కు పడ మర వైపు రోడ్డు దెబ్బతిన్నది. తిప్ప-ఉడ్‌హౌస్‌పేట మధ్య రోడ్డు ప్రమాదకరంగా మారింది. విశ్వనాథరావు పేట- తాళ్లూరు పంచాయతీల మధ్య ఉన్న ఆర్‌అండ్‌బీ రోడ్డుపై గుంటలు ఏర్పడి రాకపోకలకు ఇబ్బందిగా మారింది.

● ఉదయగిరి రూరల్, (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని దిలావర్‌భాయ్ వీధిలోని షేక్ షాహిదా పెంకుటిల్లు పైకప్పు గురువారం తెల్లవారు జామున కూలింది. ఈ సమయంలో కుటుంబ సభ్యులతో కలిసి ఇంట్లో నిదిస్తున్నా


ప్రమాదకరంగా ఉన్న నారాయణంపేట రోడ్డు

అదృష్టవశాత్తు ఎలాంటి ప్రమాదం సంభవించలేదు.

● అధ్వానంగా రహదారులు

ఆత్మకూరు, అనంతసాగరం, మర్రిపాడు, (ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు మండలం వాశిలి, బట్టేపాడు, అప్పారావుపాళెం, బి.చిరువెళ్ల బండారుపల్లి గ్రామాల్లో పంట పొలాలు నీట మునిగాయి. నల్లపురెడ్డిపల్లి రోడ్డు గుంతలమయమైంది. అనంతసాగరం మండలం కొత్తపల్లి, వడ్డిపాలెం పొలాల్లో వరద నీరు చేరగా పైరు నెలవాలడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. సోమశిల, అనంతసాగరంలో కూడా వరికి నష్టం వాటిల్లింది. సుమారు 400 ఎకరాల వరకు దెబ్బతిన్నట్లు వ్యవసాయాధికారులు గుర్తించి నివేదికను ఉన్నతాధికారులకు పంపారు. సోమశిల ప్రధాన రోడ్డు ధ్వంసమై నరకప్రాయంగా మారింది. మంచాలపల్లి, కమ్మవారిపల్లి, పడమటికంబంపాడు వద్ద గుంతలు పడి ఉండగా ప్రమాదాలు జరుగుతున్నాయి. మర్రిపాడు మండలం పెగళ్లపాడు, పొంగూరులో విద్యుత్ స్తంభాలు నెలకొరిగాయి. విద్యుత్ సిబ్బంది 8 చో ట్ల కొత్త స్తంభాలు ఏర్పాటు చేశారు. ఇక డివిజన్‌లోని పలు కాలువలు, వంకలు జలకళను సంత రించుకున్నాయి. సోమశిల జలాశయంలోకి వరద నీరు వచ్చి చేరడంతో వరి, ఇతర పంటల సాగుకు నీటిఇద్దడి తీరినట్లయింది.

● కందుకూరు, (ఆంధ్రజ్యోతి): కందుకూరు డివిజన్‌లో పొగనారు, మిరప, మినుము, మామిడి, సపోటా, జామాయిల్ పంటలకు మేలు జరిగింది. అలాగే లింగసముద్రం-కొండాపురం రోడ్డు, తిమ్మారెడ్డిపాలెం- వెంగళాపురం రోడ్డు, తాతాహోటల్ నుంచి చీమలపెంట రోడ్డు దెబ్బతిని రాకపోకలకు ఇబ్బందిగా మారింది. వలేటివారి పాలెం-అంకభూపాలపురం రోడ్డు దెబ్బతిన్నది. ఉలవపాడు మండలం బహింగ్‌హామ్ కాలువ అంచున రోడ్డు కోతకు గురైంది. తెట్టు జాతీయ రహదారి- రామాయపట్నం రోడ్డులో గుంతలు పడ్డాయి.

● ఉదయగిరి రూరల్ (ఆంధ్రజ్యోతి): మండలంలో కు రిసిన వర్షాలకు వరి రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది.


పీకేపాడు వద్ద రోడ్డుపై ఉన్న గుంతలు

సీతారామపురం మండలం నూతివారికొట్టాలు, సీతారామపురం, సంగసానిపల్లి తదితర గ్రామాల్లో పూత, చేతికందే దశలో ఉన్న వరి పంట దెబ్బతింది. బాధిత రైతులకు పరిహారం అందేలా చూస్తామని వ్యవసాయ సహాయ సంచాలకులు పీ.చెన్నారెడ్డి తెలిపారు.

● దెబ్బతిన్న రహదారులు

వర్షాలకు సీతారామపురం-నారాయణంపేట, వింజమూరు-నేరేడుపల్లి, ఉదయగిరి-బండగానిపల్లి ఘాట్‌రోడ్డు, కొండాయపాళెం-పామూరుపల్లి-తిడుగుపల్లి గ్రామాలతోపాటు అప్పసముద్రం, కొత్తపేట, బండకిందపల్లి, సాతువారిపల్లి, జీకొత్తపల్లి, కాకొల్లువారి పల్లి, రామాపురం, నల్లబోతువారిపల్లి తదితర గ్రామాల రహదారులు దెబ్బ తిన్నాయి.


అధ్వానంగా ఉన్న నేరేడుపల్లి రోడ్డు

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

● గ్రామ ప్రాంతాల్లో ఘనంగా పల్లె పండుగ కార్యక్రమాలు
● పాల్గొన్న కందుకూరు, ఉదయగిరి ఎమ్మెల్యేలు ఇంటూరి, కాకర్ల
● సీసీ రోడ్డు పనులకు శిలాఫలకాల ప్రారంభం

వలేటివారిపాలెం, (ఆంధ్రజ్యోతి) అక్టోబరు 17: రాష్ట్రంలో గ్రామాలను అభివృద్ధి చేయడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు తెలిపారు. గురువారం బడేవారిపాలెం, పోకూరు, శాఖవరంలో నిర్వహించిన పల్లె పండుగ కార్యక్రమంలో ఆయన సిమెంటు రోడ్లకు శంకుస్థాపన చేశారు. వైసీపీ పాలకులు పంచాయతీల అభివృద్ధిని నిర్వీర్యం చేశారన్నారు. గ్రామీణ రోడ్లకు తట్టమట్టి కూడ పోసిన పాపాన పోలేదని చెప్పారు. ప్రజలు రోడ్లపై ప్రయాణం చేస్తునప్పుడు నరకాన్ని చవిచూసినట్లు గుర్తుచేశారు. ఇక నుంచి అలాటి ఇబ్బందులు లేకుండా చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. కార్యక్ర మంలో పంచాయతీరాజ్ డీఈ వెంకటేశ్వర్లు, పీఆర్ ఏఈ శ్రీనివాసరావు, ఎంపీడీఓ నరేంద్రదేవ్, టీడీపీ మండలాధ్యక్షుడు మాదాల లక్ష్మీనరసింహం, నేతలు పొడపాటి నరసింహం, తాటికొండ సింహాద్రి, ఇంటూరి రంగారావు, పొడపాటి శకరయ్య, సోమినేని తిరుమలరావు, వడ్లమూడి నరసయ్య, పాడు రంగారావు, లక్ష్మీనరసింహం పాల్గొన్నారు.

● ఇంటూరిని కలిసిన డీఎస్పీ

కందుకూరు నూతన డీఎస్పీగా సీహెచ్ వీ.బాలసుబ్రహ్మణం గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇంటలిజెంట్ డీఎస్పీగా ఉన్న ఈయన బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన డివిజన్‌లోని


వలేటివారిపాలెం: శిలాఫలకం ఆవిష్కరణలో ఎమ్మెల్యే నాగేశ్వరరావు


కొండాపురం: శంకుస్థాపనలో పాల్గొన్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్

సీఐలు, ఎస్సైలు ఆయనకు పుష్పగుచ్చాలతో అభినందలు తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరా వుని పార్టీ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు.

కొండాపురం, (ఆంధ్రజ్యోతి): పంచాయతీల అభివృద్ధి కోసమే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌లు ప్రతిష్ఠాత్మకంగా పల్లెపండుగ కార్యక్రమాన్ని చేపట్టారని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ తెలిపారు. గురువారం గొట్టిగుండాల, ఉప్పలూరు, చింతలదేవి పంచాయతీలలో తొమ్మిది పనులకు సంబంధించి సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.47.28లక్షలతో చేపట్టిన పనులకు శంకుస్థాపన చేసి శిలాఫలకం ప్రారంభించారు. అనంతరం చింతలదేవి మాజీ సర్పంచ్ సీనియర్ నాయకుడు ఓరుగంటి కొండయ్యను పరామర్శించారు. కార్యక్రమంలో టీడీపీ కన్వీనర్ మామిళ్ళపల్లి ఓంకారం, యారవ కృష్ణయ్య, దామా మహేశ్వరరావు, గంటా నరసింహులు, పోలినేని రమేష్, సీహెచ్ వెంకటాద్రి, నరసింహులు పాల్గొన్నారు.

లింగసముద్రం, (ఆంధ్రజ్యోతి): ఎర్రారెడ్డిపాలెంలో నిర్వహించిన పల్లె పండుగ కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసులు ఆయన మాట్లాడారు. అనంతరం ఉట్లవారిపాలెంలో రూ.18.30 లక్షలతో సీసీ రోడ్డుకు, రూ.6.50 లక్షలతో నిర్మించే ఆర్వో ప్లాంటుకు శంకుస్థాపన చేశారు. అనంతరం వెంగళాపురంలో రూ.6.67లక్షలతో నిర్మించే సీసీ రోడ్డు పనులు చేపడతామన్నారు. కార్యక్రమంలో సర్పంచు మల్లికార్జున, ఏపీఓ షేక్ సమీర్‌బాషా, కార్యదర్శి లక్ష్మీనారాయణ, నేతలు పెద్ద మాధవ, ఆర్ మాలకొండయ్య, ఎల్.ప్రసాద్, ఎస్.నారాయణ, సీహెచ్ రత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వాల్మీకి మహర్షి జయంతి


జలదంకి: నివాళులర్పిస్తున్న అధికారులు

జలదంకి, అక్టోబరు17 (ఆంధ్రజ్యోతి) : స్థానిక తహసీల్దా ర్ కార్యాలయంలో గురువారం మహర్షి వాల్మీకి తహసీల్దార్ ప్రమీల ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డీటీ, ఆర్‌ఐలు జూలీబాయ్, శ్రీజ రీసర్వే డీటీ శ్యాంసన్, ఎఎస్ఓ వెంకటేశ్వర్లు ఉన్నారు.

వలేటివారిపాలెం: స్థానిక గ్రంథాలయంలో వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రంథపాల కుడు ఎల్.ప్రభాకర్‌రెడ్డి, కొల్లిబోయన శింగయ్య, దుద్దూరు అంజయ్య మాధవరావు పాల్గొన్నారు.

అల్లూరు: స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దారు లక్ష్మీనారాయణ వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డీటీ ప్రవీణ్‌కుమార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉదయగిరి రూరల్: పట్టణంలోని వాల్మీకి వీధిలో వాల్మీకి సంఘ నాయకులు, ప్రజలు వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే తహసీల్దారు కార్యాలయంలో తహసీల్దారు సుభద్ర, ఉద్యోగులు, సిబ్బంది, మేకపాటి గౌంతరెడ్డి ప్రభుత్వ వ్యవసాయ కళాశాలలో అసోసియేట్ డీన్ కృష్ణారెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఆత్మకూరు: స్థానిక ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో బి పావని వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీ వేణుగోపాల్, పోలీస్‌స్టేషన్‌లో సీఐ గంగాధరరావు, ఎస్‌ఐలు జిలాని, సాయిప్రసాద్ నివాళులర్పించారు. ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో ఐజాక్‌ప్రవీణ్, రవాణాశాఖ కార్యాలయంలో రాములు పూలమాల వేసి నివాళులర్పించారు.

● వరికుంటపాడు : భోగ్యంవారిపల్లిలో వాల్మీకి బోయసంఘం సభ్యులు వాల్మీకి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు భోగ్యం నవీన్, యు మోహన్‌రాజ, భోగ్యం వెంగయ్య, భోగ్యం మార్కండేయులు, ఎస్ శివరామయ్య తదితరులు పాల్గొన్నారు.


● సీతారామపురం: స్థానిక మండల కార్యాలయంలో ఎంపీడీవో భాస్కర్ ఆధ్వర్యంలో వాల్మీకి మహర్షి జయంతిని నిర్వహించారు. కార్యక్రమంలో ఏవో చంద్ర శేఖర్, సీనియర్ అసిస్టెంట్ ఖలీల్, కార్యదర్శి రామ్‌నాథ్‌రెడ్డి, అమీర్, ఏఎన్ఎం రత్తమ్మ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


ఆత్మకూరు: నివాళులర్పిస్తున్న డీఎస్పీ వేణుగోపాల్

● దుత్తలూరు(ఉదయగిరి రూరల్): వాల్మీకి మహర్షి జయంతి సందర్భంగా దుత్తలూరు బీసీ కాలనీలో వాల్మీకి విగ్రహావిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. వాల్మీకి సంఘ నాయకులు, ప్రజలు వాల్మీకి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నియో జకవర్గ అధికార ప్రతినిధి, నియోజకవర్గ వాల్మీకి సాధికారత కన్వీనర్ చల్లా ప్రసాద్, పాల్గొన్నారు.

సంగం: స్థానిక తహసీల్దారు, ఎంపీడీవో కార్యాలయాల్లో గురువారం వాల్మీకీ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దారు కార్యాలయం లో వాల్మీకీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అదేవిధంగా ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో షాలెట్ వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఆయా కార్యాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

బ్రిడ్జి మీదకు కొలినా పట్టించుకోరా..



కావలిలోని ఉదయగిరిరోడ్డులో వేపచెట్టు పూర్తిగా ఒరిగి ఆర్వోబీ వంతెన మీదకు వాలిపోయింది. చెట్టు బరువు వంతెన మీద పడి వంతెన దెబ్బతినే ప్రమాదం ఉంది. ఈ సమస్యతో ఆర్వోబీపై నున్న ఫుట్‌పాత్‌పై రాకపోకలు సాగించే పాదచారులకు వేప చెట్టు కొమ్మలు తగులుతున్నాయి. అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

\- కావలి (ఆంధ్రజ్యోతి)

ఒరిగిన విద్యుత్ స్తంభాలు



కూనిపాలెం ప్రధాన రోడ్డులోని నాలుగైదు విద్యుత్ స్తంభాలు ఒరి గి ప్రమాదకరంగా ఉన్నాయి. ఈ సమస్యతో విద్యుత్ తీగలు కూడా కిందకు వేలాడుతున్నాయి. వీటితో ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని వాహనదారులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తు తం వర్షాకాలం కావడంతో గాలు లతో కూడిన వర్షాలు వస్తే స్తంభా లు నేలకొరిగే ప్రమాదం ఉందన్నా రు. అధికారులు స్పందించి ప్రమా దాలు జరుగక ముందే వీటిని సరిచేయాలని కోరుతున్నారు.

\- వలేటివారిపాలెం (ఆంధ్రజ్యోతి

రాష్ట్రాభివృద్ధే లక్ష్యం : మంత్రి ఆనం

● పారదర్శకంగా ఉచిత ఇసుక విధానం అమలు
● ఆత్మకూరు అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

ఆత్మకూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అభివృద్ధే లక్ష్యంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సరికొత్త నిర్ణయాలు తీసుకుంటున్నారని రాష్ట్ర దేవదాయ శాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. గురువారం నెల్లూరులోని క్యాంపు కార్యాలయంలో ఆత్మకూరు రూరల్ మండల పార్టీ నాయకులతో విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉచిత ఇసుక విధానాన్ని పారదర్శకంగా అమలు చేస్తున్నామని తెలిపారు. ఎడ్లబండ్లు, ట్రాక్టర్లతో వ్యక్తిగత అవసరాలకు ఉచితంగా ఇసుకను తీసుకెళ్లవచ్చన్నారు. అధికారులు ఎవరైనా అడుకుంటే వారిని సస్పెండ్ చేస్తామని ముఖ్యమంత్రి ఆదేశాలు ఇచ్చారన్నారు. ఇతర రాష్ట్రాల్లో ఎక్కడాలేని విధంగా సరికొత్త మద్యం పాలసీని తీసుకొచ్చామని, పేదవాడి ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని నాణ్యమైన అన్ని బ్రాండ్ల మద్యాన్ని క్వార్టర్ బాటిల్ రూ.99కే అందుబాటులో ఉంచుతున్నామని తెలిపారు. రాష్ట్రంలో యువతకు 20 లక్షల ఉద్యోగాలు కల్పించేందుకు ముఖ్యమంత్రి ఇండస్ట్రియల్ పాలసీని ప్రవేశపెట్టారని తెలిపారు. రాష్ట్రంలో ఐదు నియోజకవర్గాలను సభ్యత్వ నమోదుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎంపికచేసి అబ్జర్వర్లను నియమించారని, అందులో ఆత్మకూరు నియోజకవర్గం ఎంపిక కావడంతో ప్రతి కార్యకర్త సభ్యత్వ నమోదు కార్యక్రమంలో చురుగ్గా పాల్గొని పార్టీ బలోపేతానికి కృషిచేయాలన్నారు. ఆత్మకూరు నియోజకవర్గంతో పాటు జిల్లా సమగ్రాభివృద్ధే ప్రధాన లక్ష్యంగా ముందుకు సాగుతామన్నారు. ఆత్మకూరు నియోజకవర్గంలో రాబోవు ఐదేళ్లలో పరిశ్రమలు, ఇరిగేషన్ ప్రాజెక్టుల ఏర్పాటు, వివిధ రెసిడెన్షియల్ కళాశాలలు, స్కిల్ కళాశాలల ఏర్పాటుకు కృషి చేస్తామని, నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో ఆలయాల మరమ్మతులకు రూ. 5లక్షల వరకు నిధులు మంజూరు చేస్తామని తెలిపారు. గ్రామస్థాయి నుంచి మండల స్థాయి వరకు పార్టీ నాయకులు, కార్యకర్తల సూచనలు, సలహాల మేరకు అభివృద్ధి పనులకు పెద్దపీట వేస్తామని వివరించారు. గ్రామాల్లో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో పాటు పార్టీ బలోపేతం, సభ్యత్వ నమోదులో కూడా నాయకులు, కార్యకర్తలు భాగస్వామ్యం కావాలని తెలిపారు.

వరద బాధితులకు విశ్వోదయ సంస్థల వితరణ

● ఎమ్మెల్యేకు రూ.లక్ష చెక్కు అందజేత


ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డికి చెక్కు అందచేస్తున్న విశ్వోదయ సంస్థల బాధ్యులు

కావలి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ వరదబాధితులకు చేయూతగా విశ్వోదయ సంస్థలు రూ.లక్ష వితరణ చేశారు. గురువారం కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డికి ఆయన నివాసంలో చెక్కును అందజేశారు. విరాళాలను విశ్వోదయ బాలుర, బాలికల ఉన్నత పాఠశాల, జవహర్‌భారతి జూనియర్, డిగ్రీ కళాశాల, జవహర్‌భారతి నర్సింగ్ కళాశాలల విద్యార్థులు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది సమకూర్చారు. కార్యక్రమంలో జవహర్‌భారతి డిగ్రీకళాశాల ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం, స్వయంఉపాధి కోర్సుల డైరెక్టర్ మాల్యాద్రి, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శామ్యూల్‌రాజు, నర్సింగ్ కాలేజి ప్రిన్సిపాల్ బ్యూలా, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్స్ నాగేశ్వరరావు, హయాబ్ అహ్మద్, డిగ్రీ కళాశాల లైబ్రేరియన్ బ్రహ్మానందం పాల్గొన్నారు.

● అడవులను సంరక్షించాలి

ఆక్రమణలతో, కలప అక్రమ నరికివేతతో అన్యాక్రాంతం అవుతోన్న అడవులను సంరక్షించాలని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి అటవీశాఖ అధికారులకు సూచించారు. కావలి ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్‌గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన జీ. శేషు గురువారం తమ సిబ్బందితో కలిసి మర్యాదపూర్వకంగా ఎమ్మెల్యేను కలిసి పూల మొక్కను అందజేశారు.

● అల్లూరు సమస్యలపై చర్చ

అల్లూరు నగర పంచాయితీ సమస్యలపై మున్సిపల్ కమిషనర్ ఉమామహేశ్వరరావుతో ఎమ్మెల్యే చర్చించారు. కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన ఉమామహేశ్వరరావు కావలిలో ఆయన నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

పెన్నా పొర్లుకట్టల పటిష్టతకు చర్యలు

సంగం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): వర్షాల సీజన్ ప్రారంభమవడంతో పెన్నాతీర ప్రాంతాల్లో వరదల వల్ల ప్రమాదం వాటిల్లకుండా ముందుస్తు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారని మండల ప్రత్యేకాధికారి రమేష్ నాయక్ పేర్కొన్నారు. అందులో భాగంగా గురువారం పెన్నానది తీరంలో ఉన్న సంగం మండలాన్ని సందర్శించి చేపట్టాల్సిన రక్షణ చర్యలపై తహసీల్దారు సోమ్లా నాయక్‌తో చర్చించారు. పెన్నా కాలువల పొర్లుకట్టలు బలహీనంగా ఉంటే తమ దృష్టికి తెస్తే కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి రక్షణ చర్యలు చేపడతామని తెలిపారు.

లైసెన్స్ లేకుండా టపాసులు విక్రయిస్తే చర్యలు

లింగసముద్రం, (ఆంధ్రజ్యోతి) అక్టోబరు 17: దీపావళి పండుగ సందర్భంగా టపాసులు అమ్మే యజమానులు సంబంధిత అధికారుల నుండి లైసెన్సు తీసుకోకుండా టపాసులు అమ్మితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్సై షేక్ మహబూబ్ సుబాని గురువారం తెలిపారు. అలాగే లైసెన్సు పొంది టపాసులు అమ్మదలచిన షాపు యజమానులు తగు జాగ్రత్తలు పాటించాలన్నారు.


రోడ్డు ఆక్రమణల తొలగింపు

కావలి, (ఆంధ్రజ్యోతి) అక్టోబరు 17: పట్టణంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు ట్రంకు రోడ్డుకు ఇరువైపులా ఉన్న మార్కింగ్‌ను అతిక్రమించి రోడ్డుపైకి వచ్చిన ఆక్రమణలను గురువారం సాయంత్రం మున్సిపల్ అధికారులు తొలగించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ ఎమ్మెల్యే ఆదేశాల మేరకు చేపట్టిన మార్కింగ్‌ను దాటి ఎవరైనా ముందుకు వస్తే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

లింగసముద్రం, (ఆంధ్రజ్యోతి) అక్టోబరు 17: వెంగళాపురంకు చెందిన ఎలిపాటి శ్రీను (48) గురువారం విద్యుదాఘాతంతో మరణించాడు. కరెంటు స్తంభం నుంచి ఇంట్లోకి వచ్చే సర్వీసు వైరుకు విద్యుత్ సరఫరా కావడం లేదు. ఈ వైరును బాగు చేసేందుకు ఉదయం 10గంటల సమయంలో స్తంభం ఎక్కి పట్టుకొన్నాడు. ఈ సమయంలో వైరుకు విద్యుత్ సరఫరా కావడంతో అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. అయితే బంధువులు అతన్ని చికిత్స కోసం కందుకూరుకు తరలిస్తుండగా మార్గమధ్యంలో చనిపోయినట్లు తెలిపారు.

వైద్యశిబిరం సందర్శన


మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో ప్రియంవద

ఉలవపాడు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): స్థానిక మన్నేటికోట పంచాయతీ పరిధిలోని జీవీఆర్ ఎస్టీ కాలనీలో తుఫాన్ బాధితుల పునరావాస కేంద్రలో ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంపును గురువారం జిల్లా ఉప వైద్యాధికారి ప్రియంవద సందర్శించారు. వర్షాలకు ప్రజలు ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రతలపై అవగాహన కల్పించాలని వైద్యఆరోగ్య సిబ్బందికి సూచించారు. అనంతరం కరేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. ఆయన వెంట కరేడు వైద్యాధికారి శ్రీనివాసరావు, ఎంపీహెచ్ఈవో ఎస్కే ఆరిఫ్, లక్ష్మీనారాయణ, ఏఎన్ఎం శోభ ఉన్నారు.

నెల్లూరు సిటీ, రూరల్ కోవూరు, సర్వేపల్లి

న్యూస్ బాక్స్

ముస్లిం నేత మృతికి సంతాపం

బుచ్చిరెడ్డిపాళెం,అక్టోబరు17 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ సీనియర్ ముస్లిం నాయకుడు సమీవుల్లా (బచ్చాబాయ్) ఆకస్మిక మృతి అటు పార్టీకి, ఇటు మైనారిటీలకు, తీరనిలోటు అని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. గురువారం బుచ్చి ఖాజానగర్‌లోని ఆయన నివాసానికి వచ్చి కుటుంబ సభ్యులను పరామర్శించారు. 'మీరు అధైర్య పడవద్దు, మీకుటుంబానికి అండగా మేము ఉన్నాం' అని వారిని ఓదార్చారు. ఆమె వెంట నాయకులు సర్దార్, ఫిరోజ్, షబ్బీర్, సందానీ, ఎంవీ.శేషయ్య, హరికృష్ణ, రామానాయుడు తదితరులు ఉన్నారు.

వ్యాధి నిరోధక టీకాలపై పరిశీలన

ఇందుకూరుపేట, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : జగదేవిపేట పీహెచ్‌సీ పరిధిలోని డేవిస్‌పేట, ఇందుకూరుపేట సచివాలయాల పరిధిలో ఉన్న చిన్నారులు, గర్భిణులకు సక్రమంగా వ్యాధి నిరోధక టీకాలు వేస్తున్నారా.. లేదా ? అనే విషయాన్ని గురువారం జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ ఉమామహేశ్వరి పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ ప్రత్యేకించి ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన సంచార జాతుల చిన్నారులు, గర్భిణులు, బాలింతల ఆరోగ్యంపై దృష్టి సారించాలన్నారు. వారందరికీ అంగన్‌వాడీ సెంటర్ల ద్వారా పౌష్టికాహారం అందేటట్లు చూడాలని అన్నారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ బ్రహ్మేశ్వరనాయుడు, డాక్టర్ కిషోర్ కుమార్, హెల్త్ ఎడ్యుకేటర్లు సుధాకర్‌రావు, అశోక్, ఫార్మసీ ఆఫీసర్ చంద్రశేఖర్, హెల్త్ సూపర్‌వైజర్లు రమా, సతీష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులపై గ్రామసభ

మనుబోలు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని వీరంపల్లి సచివాలయంలో గురువారం ఉపాధి పనుల తనిఖీపై గ్రామ సభ నిర్వహించారు. ఈ సభలో ఎస్ఆర్‌పి (స్టేట్ రిసోర్స్ పర్సన్) నాగార్జున నివేదికను చదివి వినిపించారు. దీనిపై గ్రామస్థులు పలు అభ్యంతరాలు తెలిపారు. గిరిజన కూలీలు పనులకు వెళ్లకపోయినా పనులు చేసినట్లుగా బిల్లులు ఎలా ఇచ్చారని, గిరిజనులు తమకు డబ్బులు అందలేదని రాతపూర్వకంగా రాసిచ్చారని, అలాగే కొన్ని పనులకు ఫొటోలు ఇవ్వలేదని, అయితే ఆ పనులు జరిగినట్టా, జరగనట్టా తెలియడం లేదంటూ సామాజిక తనిఖీ బృందం బయటపెట్టింది. దీనిపై అప్పటి క్షేత్ర సహాయకుడు సమాధానం చెప్పకపోవడంపై కూలీలు ఆగ్రహం చెందారు. మనుబోలులో జరిగే సభకు పూర్తి వివరాలతో రావాలని ఎస్ఆర్‌పీ క్షేత్ర సహాయకుడికి సూచించారు. ఈ కార్యక్రమంలో టీపీ ప్రసన్న, సీవో తదితరులు పాల్గొన్నారు.

రేపు అవగాహన సదస్సు

నెల్లూరు(హరనాథపురం), అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): కెనరాబ్యాంకు ఆధ్వర్యంలో శనివారం ఎంఎస్ఎంఈలకు ఆర్థిక సహాయ అవగాహన సదస్సు నిర్వహిస్తున్నామని ఎల్‌డీఎం శ్రీకాంత్ ప్రదీప్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఏపీఐఐసీ, డీఐసీతో కలిసి ఏకేనగర్‌లోని కెనరాబ్యాంకు సమావేశమందిరంలో ఉదయం 10.30 నుంచి 12.30 గంటల వరకు ఈ సదస్సు జరుగుతుందని తెలిపారు. రుణాల కోసం ఎదురుచూస్తున్న ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు ఈ కార్యక్రమానికి హాజరు కావాలని కోరారు.

20 నుంచి సీపీఎం నగర మహాసభలు

నెల్లూరు (వైద్యం), అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 20, 21వ తేదీలలో నెల్లూరులోని వీజీబీ కల్యాణ మండపంలో సీపీఎం నగర మహాసభలు జరుగుతాయని సీపీఎం నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు తెలిపారు. ఆ సభలను జయప్రదం చేయాలని కోరుతూ గురువారం 15వ డివిజన్ బాలాజీనగర్‌లో ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంచిపెట్టారు.

రేపు సైదాపురం మండల సర్వసభ్య సమావేశం

సైదాపురం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ఎంపీపీ పలుగోటి పెంచలమ్మ అధ్యక్షతన ఈ నెల 19వ తేదీన సాధారణ మండల సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఎంపీడీవో పురుషోత్తం శివకుమార్ గురువారం తెలిపారు. మధ్యాహ్నం 2గంటలకు మండల అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించడం జరుగుతుందని, మండల అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

డాక్టరు ఎప్పుడొస్తారో?

- జీజీహెచ్‌లో విధులకు వైద్యుల డుమ్మా
- ఎన్ని నిబంధనలు పెట్టినా అదే పంథా!
- ముఖహాజరునూ అనుకూలంగా మార్చేశారు
- ఆసుపత్రిలో వైద్య సేవలపై తీవ్ర ప్రభావం
- రోగులకు తప్పని పడిగాపులు

ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో వ్యాధిగ్రస్థులకు పడిగాపులు తప్పటం లేదు. వైద్యులు ఎప్పుడు ఉంటారో తెలియని పరిస్థితి నెలకొంది. పలువురు అనధికారికంగా విధులకు గైర్హాజరవుతున్నారన్న ఆరోపణలున్నాయి. ఓపీలో ఉన్న వైద్యులు రోగులను పరీక్షించి వివిధ రకాల వైద్య పరీక్షలకు చీటీ రాసిస్తున్నారు. తీరా ఆ పరీక్షలు చేయించుకుని వచ్చే సరికి సదరు వైద్యులు ఉండటం లేదు. ఈ విధంగా కొందరు వైద్యులు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండకపోతుండటంతో వారికి చూపించుకునేందుకు రోగులు మళ్లీ పక్కరోజు రావాల్సి వస్తోంది.





జీజీహెచ్‌లో వైద్యుల కోసం వేచి ఉన్న రోగులు, డాక్టర్ లేక ఖాళీగా ఉన్న కుర్చీ

నెల్లూరు వైద్యం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో వైద్యుల తీరు నానాటికీ తీసికట్టుగా మారుతోంది. ముఖ్యంగా రోజువారీ విధులకు హాజరు విషయంలో ఎన్ని నిబంధనలు విధించినా ఏదో ఒక మార్గం వెతుక్కుని జారుకుంటున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇటీవల ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సిద్ధానాయక్ వివిధ విభాగాల హెచ్‌వోడీలతో నిర్వహించిన సమీక్షలో వైద్యుల తీరుపై తీవ్ర అసంతృప్తి, ఆగ్రహం వ్యక్తం చేశారు. అసలు తమ విభాగాలను పర్యవేక్షించాల్సిన హెచ్‌వోడీలే ఎక్కువగా విధులకు డుమ్మా కొడుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. హెచ్‌వోడీలే ఇలా ఉంటే ఇక వైద్యుల తీరు ఎలా ఉంటుందని రోగులు పెదవి విరుస్తున్నారు.

బయోమెట్రిక్, ఎఫ్ఆర్ఎస్ అందుబాటులో ఉన్నా..

ఒకప్పుడు హాజరు నమోదుకు రిజిస్టర్‌లో సంతకం పెట్టే విధానం ఉండేది. ఈ పద్ధతిలో కొందరు వైద్యులు సంతకం చేసి వెళ్లిపోతున్నారన్న ఆరోపణలతో కొన్నేళ్ల క్రితం బయోమెట్రిక్ విధానాన్ని అమలులోకి తెచ్చారు. దీనిలోనూ లోపాలను వెతికి వైద్యులు విధులు నిర్వహించకుండా తప్పించు కుంటున్నారన్న విమర్శలతో ప్రస్తుతం ముఖ హాజరు (ఎఫ్ఆర్ఎస్)ను అమలు చేస్తు న్నారు. అయినా వైద్యుల తీరు మారటం లే దు. కొందరు ఈ పద్ధతిని కూడా వారికి అను కూలంగా మార్చుకున్నట్లు ప్రచారం జరుగు తోంది. వైద్యులు సాధారణ సెలవుల కింద 9 రోజులు సెలవు పెట్టవచ్చు. అయితే ఈఎన్‌టీలో ఓ వైద్యురాలు ఏకంగా 12 రోజులు విధుల్లోకి రాలేదు. ఆ తర్వాత విధుల్లో చేరాక ఆయా సెలవులను హాజరయినట్లు రాసుకుంటున్నట్లు విమర్శలు ఉన్నాయి. ఈమె ఆసుపత్రిలో ఉన్నా సరిగ్గా విధులకు హాజరుకారన్న ఆరోపణలు లేకపోలేదు.

బదిలీ చేసినా ఇంతేనా?

జీజీహెచ్‌లో ఉన్న వైద్యులందరిని కొంత కాలం క్రితం కడప, కర్నూలు, అనంతపురం, తిరుపతి తదితర జిల్లాలకు బదిలీ చేశారు. ఆయా ప్రాంతాల వారు బదిలీపై ఇక్కడికి వచ్చారు. దీంతో రోగులకు మెరుగైన వైద్యం అందుతుందని ప్రభుత్వం భావించింది. అయితే బదిలీపై వచ్చిన వారిలోనూ కొందరు వైద్యులు విధులకు డుమ్మా కొట్టి విధుల్లోనే ఉన్నట్లు కలరింగ్ ఇస్తున్నారు. స్వంత ఆసుపత్రులు ఉండటంతో వాటికే పరిమితమవుతూ జీజీహెచ్‌లో వైద్య సేవలను విస్మరిస్తున్నారు. ప్రసూతి విభాగం మినహా మిగిలిన విభాగాల్లో వైద్యులు సక్రమంగా విధులకు హాజరుకావడం లేదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఆసుపత్రిలో వైద్యులు అందుబాటులో ఉండాలనే నిబంధన ఉన్నప్పటికీ దానిని చాలా మంది పాటించడం లేదు. ఇలా వైద్యుల గైర్హాజరుతో రోగులకు తిప్పలు తప్పడం లేదు. డాక్టర్ కోసం గంటల తరబడి నిరీక్షించిన వారికి చివరకు హౌస్‌సర్జన్లు, సీనియర్ రెసిడెంట్లు, నర్సింగ్ సిబ్బందే దిక్కవుతున్నారు.

వైద్యులు సక్రమంగా విధులు నిర్వహించాలి

వైద్యులు సక్రమంగా విధులకు హాజరు అయ్యేలా చర్యలు తీసుకుంటు న్నాం. వారిలో పరివర్తన తీసుకువస్తున్నాం. ప్రతిరోజూ హాజరు వివరాలు డీఎంఈకి పంపిస్తున్నాము. అయితే వైద్యుల హాజరుపై అనేక అనుమానాలు ఉన్నాయి. దీన్ని సరిదిద్దేందుకు అన్ని విభాగాల హెచ్‌వోడీలతో సమావేశం నిర్వహిస్తున్నాం. వైద్యులు సక్రమంగా విధులకు హాజరయ్యేలా పర్యవేక్షించా లని ఆదేశిస్తున్నాం. లేదంటే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరిస్తు న్నాం. ప్రభుత్వ నిబంధనలు సక్రమంగా అమలయ్యేలా చూస్తాం.

- డాక్టర్ సిద్దానాయక్, జీజీహెచ్ సూపరింటెండెంట్



ఇందుకూరుపేట : సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి

కోవూరులో రూ.118లక్షలతో అభివృద్ధి పనులు

కోవూరు, అక్టోబరు17 (ఆంధ్రజ్యోతి): మండలంలో రూ. 118లక్షలతో అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి తెలిపారు. స్థానిక పంచాయతీ కార్యాలయం ఎదుట గురువారం ఆమె పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా పలు అంతర్గత రోడ్ల పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం మాట్లాడుతూ బుచ్చి- ఊటుకూరు రోడ్డు విస్తరణ పనులకు కేంద్రం నిధులు మంజూరు చేసిందన్నారు. కార్యక్రమంలో సర్పంచు యాకసిరి విజయ, తహసీల్దారు నిర్మలానందబాబ, ఎంపీడీవో శ్రీహరిరెడ్డి, డ్వామా పీడీ గంగాభవాని, ఏపీడీ మృదుల, స్థానిక నాయకులు జెట్టి రాజగోపాలరెడ్డి, ఇంతా మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● 'పల్లె పండుగ'తో గ్రామీణాభివృద్ధికి శ్రీకారం

ఇందుకూరుపేట, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): పల్లె పండుగ కార్యక్రమంతో గ్రామీణాభివృద్ధికి శ్రీకారం చుట్టామని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి తెలిపారు. మండలంలోని పడమరపాలెం మత్స్యకారకాలనీలో నిర్మించనున్న బంగారమ్మ ఆలయ భూమిపూజలో గురువారం ఆమె పాల్గొన్నారు. అనంతరం రూ.10లక్షలతో మైపాడులో సీసీ రోడ్డు, డ్రైన్ల నిర్మాణం, రూ.82 లక్షలతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంట్రాక్టర్ల ప్రమేయం లేకుండా గ్రామస్థులే నాణ్యతా ప్రమాణాలు పాటించి అభివృద్ధి పనులు చేసుకోవాలన్నారు.కార్యక్రమంలో సర్పంచు యాకసిరి విజయ, తహసీల్దారు నిర్మలానందబా బా, ఎంపీడీవో శ్రీహరిరెడ్డి, స్థానిక నాయకులు జెట్టి రాజగోపాలరెడ్డి, ఇంతా మల్లారెడ్డి, జీ అశోక్‌కుమార్, టీ అశోక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వర్షంతో రైతులకు ప్రయోజనం



సర్వేపల్లి రిజర్వాయర్ కట్ట బలహీనంగా ఉండటంతో వేసిన ఇసుక బస్తాలు

ముత్తుకూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావంతో కురిసిన వర్షంతో సర్వేపల్లి నియోజకవర్గంలో అన్నదాతలకు ప్రయోజనం చేకూరింది. సాగుకి సిద్ధమవుతున్న రైతులకు ఈ వర్షాలతో పరిస్థితులు అనుకూలంగా మారాయి. పలుచోట్ల రైతులు పచ్చిరొట్ట విత్తనాలను సాగు చేయడంతో ప్రస్తుతం పడ్డ వానల వల్ల దుక్కి దున్నుకునే అవకాశం కలిగింది. వరి, వేరుశనగ సాగుకి సిద్ధమైన రైతులు మూడు రోజులుపాటు కురిసిన వర్షాలతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ముత్తుకూరు, పొదలకూరు, వెంకటాచలం, మనుబోలు, టీపీగూడూరు మండలాల్లో ఎక్కడా వర్షాలకు రహదారులు దెబ్బతినడంతోపాటు పంట నష్టం జరగలేదు. పొదలకూరు మండలంలో మెట్ట పంటలకు, నిమ్మ రైతులకు మంచి జరిగింది. వర్షంతోపాటు గాలులు లేకపోవడం వల్ల నిమ్మకు నష్టం వాటిల్లలేదు. వెంకటాచలం మండలంలో సర్వేపల్లి రిజర్వాయర్ కట్ట కోతకు గురవుతుందన్న భయంతో మట్టి, ఇసుక బస్తాలతో అధికారులు కట్టకు మరమ్మతులు చేశారు. పలు లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు నిలవడంతో కూటమి నేతల సాయంతో అధికారులు సహాయక చర్యలు చేపట్టారు.

నిమ్మ యార్డును అభివృద్ధి చేస్తాం : సోమిరెడ్డి



పుల్లయ్యగౌడ్‌కు నివాళి అనంతరం నాయకులు, కుటుంబ సభ్యులతో సోమిరెడ్డి

పొదలకూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని నిమ్మ యార్డును అభివృద్ధి చేయనున్నట్లు సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి స్పష్టం చేశారు. గురువారం ఆయన యార్డును పరిశీలించారు. మూడు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు నిమ్మయార్డులోని లోతట్టులో గల కొన్ని దుకాణా ల్లో నీరు చేరింది. దీంతో వ్యాపారం కొనసా గించడం కష్టంగా ఉందని సోమిరెడ్డికి నిమ్మ వ్యాపారులు విన్నవించుకున్నారు. స్పందించిన సోమిరెడ్డి త్వరితగతిన సమస్యను పరిష్కరించి, యార్డ్‌ను అభివృద్ధి చేయనున్నట్లు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, వ్యాపారులు తదితరులు పాల్గొన్నారు.

● పుల్లయ్య గౌడ్ సేవలు మరువలేనివి

టీడీపీకి పుల్లయ్యగౌడ్ అందించిన సేవలు ఎనలేనివని, ఆయన మరణం తీరని లోటని ఎమ్మెల్యే సోమిరెడ్డి అన్నారు. ఇటీవల అనారోగ్యంతో పుల్లయ్య మృతి చెందడంతో గురువారం సోమిరెడ్డి ఆయన చిత్రప టానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూ తిని తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని మర్రిపల్లి వాసి, రాపూరు ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ వెంపు లూరు పుల్లయ్యగౌడ్ టీడీపీ కోసం సైనికుడిగా పనిచేశారన్నారు. కార్యక్రమంలో సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, తలచీరు మస్తాన్‌బాబు, పుల్ల య్యగౌడ్ కుటుంబ సభ్యులు, బీసీ సంఘం మండల అధ్యక్షుడు వెంపులూరు రామకృష్ణ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

● మైనార్టీ నేతకు పరామర్శ

వెంకటాచలం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): టీడీపీ మైనార్టీ సెల్ మండలాధ్యక్షుడు షేక్ షరీఫ్ తల్లి జహీరాబీ (70) అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో గురువారం కసుమూరులోని షరీఫ్ స్వగృహానికి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ఆయన తనయుడు రాజగోపాల్‌రెడ్డిలు చేరుకుని జమీరాబీ పార్థివదేహానికి నివాళులర్పించారు. షరీఫ్ కుటుంబ సభ్యులను పరామర్శించి, సానుభూతి తెలియజేశారు. వారి వెంట స్థానిక టీడీపీ నేతలు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

మద్యం షాపు తొలగించాలని ఆందోళన

తోటపల్లిగూడూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నరుకూరులో మద్యం షాపు తొలగించాలంటూ సీపీఎం ఆధ్వర్యంలో గురువారం మూడో రోజు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నేత ఎం. రాజా మాట్లాడుతూ మద్యం మత్తులో మందుబాబులు ఇళ్లలో చొరబడి ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. రోడ్డున పోయే మహిళలు, విద్యార్థులకు ఆటంకాలు కలిగిస్తున్నారని తెలిపారు. మద్యం షాపును ఇక్కడి నుంచి తొలగించే వరకు ఆందోళన కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నేతలు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు

వ్యాధులు రాకుండా అవగాహన



రికార్డులను పరిశీలిస్తున్న డాక్టర్ ఖాదర్‌వలి

విడవలూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): లెప్రసీ, హెచ్‌ఐవీ, టీబీ వంటి భయంకరమైన వ్యాధులు రాకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని లెప్రసీ, ఎయిడ్స్ టీబీ అధికారి డాక్టర్ ఎస్‌కే ఖాదర్‌వలి తెలిపారు. రామతీర్థం పీహెచ్‌సీని గురువారం అయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీలించారు. ఆనంతరం పాతూరులో జరిగిన అడల్ట్ బీసీజీ వ్యాక్సినేషన్ కార్యక్రమంలో పాల్గొన్నారు. అయన మాట్లాడుతూ ఎయిడ్స్ కుష్ఠు, టీబీ వ్యాధులు ప్రబలకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాల న్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యులు అమరేంద్రనాథ్‌రెడ్డి, కో-ఆర్డినేటర్, శ్రావణ్‌కుమార్, సూపర్‌వైజరు సత్యనారాయణ, వైద్యులు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

వీఎస్‌యూలో పేదరిక నిర్మూలన దినోత్సవం



మాట్లాడుతున్న వీసీ విజయభాస్కర్‌రావు

వెంకటాచలం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాకుటూరు వద్ద ఉన్న విక్రమ సింహపురి యూనివర్సిటీలో గురువారం అంతర్జాతీయ పేదరిక నిర్మూలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో వీసీ డాక్టర్ సారంగం విజయభాస్కర్‌రావు మాట్లాడుతూ సమాజంలో పేదరికం ప్రధాన సమస్యగా ఉందన్నారు. పేదరికం వల్ల ప్రజలు విద్య, ఆరోగ్యం, ఆర్థిక భద్రత తదితర అంశాల్లో వెనుకబడి పోతున్నారన్నారు. పేదరికం అనేది కేవలం ఆర్థిక సమస్య కాదని ఆయన పేర్కొన్నారు. విద్య మాత్రమే ఓ వ్యక్తిని పేదరికం నుంచి బయటపడేసి స్థిరమైన భవిష్యత్తు ఇవ్వగలదన్నారు. కార్యక్రమంలో వీఎస్‌యూ రిజిస్ట్రార్ డాక్టర్ కే సునీత, వర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ విజయ, ఎస్ఎస్ఎస్ సమన్వయకర్త డాక్టర్ అల్లం ఉదయ శంకర్, డాక్టర్ టీవీ సుబ్బారెడ్డి, డాక్టర్ ఏ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

హమ్మయ్యా.. వాన ఆగింది

- ఊపిరి పీల్చుకున్న యంత్రాంగం
- కొనసాగుతున్న సహాయక చర్యలు



కాలువల్లో పూడికమట్టిని ట్రాక్టర్లలో వేస్తున్న ఎక్స్‌కవేటర్

నెల్లూరు(సిటీ), అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి) : నగరంలో మూడు రోజులుగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలు గురువారం ఆగడంతో ప్రజలు, ప్రభుత్వ యంత్రాంగం ఊపిరిపీల్చుకుంది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వాయుగుండంగా మారి గురువారం వేకువజామున తీరం దాటడమేకాక ఆ తర్వాత వర్షాలు తగ్గుముఖం పట్టడంతో గండం తప్పినట్లయింది. పునరావాస కేంద్రాల నుంచి తిరిగి ఇళ్లకు చేరిన ప్రజలు నివాసాలలోని నీటిని బయటకు తోడేపనిలోపడ్డారు. కాగా, మున్సిపల్ అధికారులు మాత్రం కాలువల్లో పూడికతీత, కల్వర్టుల వద్ద అడ్డంకుల తొలగింపు, ప్రధాన కాలువల అనుసంధానం, పాడైన తూములు తీసేయడం వంటి సహాయక చర్యలను యథావిధిగా కొనసాగించారు. వాయుగుండం తీరం దాటే సమయంలో భారీ వర్షాలు కురుస్తాయన్న హెచ్చరికలతో యంత్రాంగం అప్రమత్తమైంది. ఇప్పటికే 13 పునరావాస కేంద్రాలకు 550 మంది వరకు బాధితులను తరలించిన అధికారులు మిగిలిన ప్రాంతాల్లోని లోతట్టు వాసులను తరలించేందుకు బస్సులు, ట్రాక్టర్లు, మినీలారీలను సిద్ధం చేసుకున్నారు. అయితే గురువారం ఉదయం నుంచి వాతావరణం అనుకూలంగా మారడంతో ఆయా వాహనాలను వెనక్కు పంపేశారు. కమిషనర్ సూర్యతేజ లోతట్టు ప్రాంతాలలో జరుగుతున్న సహాయక చర్యలు, నగరంలోని కాలువల్లో తీస్తున్న పూడికతీత పనులను పరిశీలించారు.

విద్యాశాఖలో వాల్మీకి మహర్షికి నివాళులు



వాల్మీకికి నివాళులర్పిస్తున్న డీఈవో రామారావు

నెల్లూరు (విద్య), అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) :వాల్మీకి మహర్షి జయంతిని పురస్కరించుకుని జిల్లా విద్యా శాఖ కార్యాలయంలో డీఈవో రామారావు గురువారం వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రామాయణం వంటి సుందరకావ్యాన్ని రచించిన వాల్మీకి జయంతిని రాష్ట్ర పండుగగా జరపుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీలు గ్లోరీకుమారి, విజయ్‌కుమార్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని కొనసాగించాలి



మంత్రి నారాయణకు వినతి అందచేస్తున్న ఉపాధ్యాయులు

నెల్లూరు(సిటీ),అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : మున్సిపల్ పాఠశాలల్లోని ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని కొనసాగించాలని రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి పొంగూరు నారాయణకు గురువారం మున్సిపల్ పాఠశాలల ఉపాధ్యాయులు వినతిపత్రం అందచేశారు. స్వీపర్లు, వాచ్‌మెన్లు, కంప్యూటర్ ఆపరేటర్లను యథావిధిగా కొనసాగించాలని కోరారు. కోవిడ్ సమయంలో మరణించిన ఉపాధ్యాయ కుటుంబాల్లోని సభ్యులకు కారుణ్య నియామకాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. అర్హత కలిగిన ఉపాధ్యాయులకు ఉద్యోగోన్నతి కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటరావు, సురేష్‌బాబు పాల్గొన్నారు.

నష్టం అంచనాలు పక్కాగా ఉండాలి

● అధికారులను కోరిన రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి



అధికారులతో మాట్లాడుతున్న రూరల్ ఎమ్మెల్యే

నెల్లూరు రూరల్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి) : భారీ వర్షాల కారణంగా నెల్లూరు రూరల్లో దెబ్బతిన్న వనరులు, కలిగిన నష్టంపై అంచనాలు పక్కాగా ఉండాలని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అధికారులను కోరారు. ఆయన కార్యాలయంలో పలు శాఖల అధికారులతో గురువారం సమీక్షించారు. రోడ్లు, కాలువలు, కల్వర్టులు, నివాసాలు, పంటలు, విద్యుత్ లైన్లు, స్తంభాలకు జరిగిన నష్టాన్ని కుణ్ణంగా పరిశీలించి అంచనాలు రూపొందించాలన్నారు. అధికారులంతా ఇప్పటికే ప్రాథమిక నివేదికలు తయారు చేసినప్పటికీ మరోసారి పూర్తి స్థాయి అంచనాలు తయారు చేయాలన్నారు. ఈ కార్యక్ర మంలో గిరిధర్‌రెడ్డి కూడా పాల్గొన్నారు.

శాలివాహన సంక్షేమ భవన కమిటీ రద్దు

నెల్లూరు (సాంస్కృతికం), అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరుజిల్లా శాలివాహన (కుమ్మరి) సంక్షేమ సంఘానికి అనుబంధంగా ఉన్న శాలివాహ న సంక్షేమ భవన నిర్వహణ కమిటీని రద్దు చేస్తున్నటు ఆ సంఘం ప్రధాన కార్యదర్శి పీ శ్రీనివాసులు, అధ్యక్షుడు నరసయ్య తెలిపారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో వారు విలేకరులతో మాట్లాడారు. శాలివాహన భవన నిర్మాణ కమిటీ ఏర్పడి సుదీర్ఘకాలం అయిందని, కొంతమంది ఎన్నికలు నిర్వహించాలని కోరుతున్నారని తెలిపారు. సంఘం ఐక్యత, పారదర్శకత కోసం కమిటీని రద్దు చేసి, ఎన్నికలకు వెళుతున్నామన్నారు. ఓటు హక్కు కోసం రూ.10, కార్యవర్గ సభ్యులుగా పోటీ చేయదలచినవారు రూ.25వేలను ఈ నెల 31లోపు చెల్లించి రశీదులు పొందాలని కోరారు.

గ్రామ పంచాయతీలను వేధించిన జగన్

నెల్లూరు రూరల్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి) : వైసీపీ ప్రభుత్వంలో పంచాయతీలకు నిధులు ఇవ్వకుండా అనేక రకాలుగా జగన్ వేధింపులకు గురి చేశాడని టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి విమర్శించారు. మండలం లోని కలివెలపాళెంలో గురువారం పల్లెపండుగ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రూ.10 లక్షలతో నిర్మించబోయే సీసీరోడ్లు, డ్రైన్లకు శంకు స్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక పంచాయతీలకు మంచి రోజులు వచ్చాయన్నారు.

ఈ కార్యక్రమంలో ఎం పీపీ విజయకుమార్, ఎంపీడీవో శైలేంద్రకుమార్, సర్పంచ్ మధురెడ్డి, నాయకులు వెడిచర్ల వెంకటేశ్వర్లు యాదవ్, ఇందుపూరు శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పొంగూరు రమాదేవి పుట్టినరోజు వేడుకలు

నెల్లూరు (వైద్యం/సాంస్కృతికం), అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ సతీమణి పొంగూరు రమాదేవి పుట్టిన రోజు వేడుకలు గురువారం జరిగాయి. టీడీపీ నేత తోట సతీష్ ఆధ్వర్యంలో నగరంలోని గీతామయి వృద్ధుల ఆశ్రమంలో అన్నదానం చేశారు. కేక్‌ను కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. కార్యక్రమంలో నాగార్జున, కృష్ణ, గురు, పవన్, సుధీర్, అఖిల్, వెంకటసాయి తదితరులు పాల్గొన్నారు. కాగా, రమాదేవి జన్మదిన వేడుకలను ఉడ్‌కాంప్లెక్స్‌లోని ప్రగతిచారిటీస్‌లో నారాయణ అభిమానులు ఘనంగా నిర్వహించారు. అభిమాని విజయలక్ష్మి, బ్రహ్మంగుప్తా, శ్రీనివాసులు, రమణయ్య, గునుకుల కిషోర్, సిరి శ్రీనివాసులు, విశాలాక్షి, కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక

ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు అలాగే ప్రస్తుత చందాదారులకు పేపరు పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ క్రింది ఫోన్ నెంబర్లకు సంప్రదించగలరు.

తిరుపతి, చంద్రగిరి, రేణిగుంట	: 99854 38368
చిత్తూరు, పూతలపట్టు, గంగాధర నెల్లూరు	: 99854 10940
పలమనేరు, కుప్పం, పుంగనూరు	: 97036 18724
మదనపల్లె, పీలేరు, తంబళ్లపల్లె	: 99854 22298
శ్రీకాళహస్తి, పుత్తూరు, నగరి, సత్యవేడు	: 99890 59755





గురువారం ఉదయం 6గంటల సమయంలో సూళ్లూరుపేటలో చెంగాళమ్మ ఆర్చి వద్ద.. - జాతీయ రహదారిపై లైట్లు వేసుకొని వస్తున్న వాహనాలు

వాన కురవాల్సిన వేళ..

పులికాట్ సరస్సుమీదుగా వాయుగుండం తీరం దాటింది. ఆ ప్రభావంతో వాన కురుస్తుందనుకుంటే.. ఆ స్థానంలో మంచుకురిసింది. సూళ్లూరుపేట, తడలో గురువారం తెల్లవారుజామున మంచుదుప్పటి కప్పుకుంది. ఉదయం 6 గంటల సమయంలోనూ దారి కనబడనంతగా మంచు కురవడంతో లైట్లు వేసుకొని ప్రయాణించారు వాహనదారులు. - తడ, ఆంధ్రజ్యోతి

వాయుగుండం తీరం దాటినా
పడని వర్షం

తడ, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ఓ పక్క అధికారుల హడావుడి. మరో పక్క వాతావరణశాఖ హెచ్చరికలు. పులికాట్ సరస్సు మీదుగా వాయుగుండం తీరం దాటుతోందంటే జనంలోనూ ఎక్కడో భయం. ఈ రాత్రికి ఏమవుతుందోనన్న ఆందోళన.. తీరా చూస్తే అమ్మోతుఫాన్ అనుకున్నది కాస్త తుస్సు తుఫాన్‌గా మారిపోయింది. బుధవారం అర్ధరాత్రి 11 గంటల నుంచి గురువారం తెల్లవారుజామున 3 గంటల లోపు సూళ్లూరుపేట, చెన్నైల మధ్య తీరం దాటుతుందని అంచనావేశారు. ముఖ్యంగా సూళ్లూరుపేట, తడ మండలాలు అప్రమత్తంగా ఉండాలని తీవ్రమైన ప్రభావం ఈ మండలాలపై ఉంటుందని అధికారులు నిర్ధరణకు వచ్చారు. ఈ హడావుడి హెచ్చరికలతో ఈ రెండు మండలాలలోని ప్రజలలో కొంత ఆందోళన కన్పించింది. తీరా చూస్తే బుధవారం ఉదయానికి తుఫాన్ తీరందాటిందా అన్న అనుమానం ప్రజల్లో కలిగింది. ఎందుకంటే అసలు తుఫాన్ తీరందాటిన దాఖలాలే ఈ మండలాల్లో కనిపించలేదు. గురువారం తెల్లవారుజామున 4 గంటల సమయంలో తడ మండలంలో సుమారు 22 కిలోమీటర్ల వేగంతో తుఫాన్ తీరందాటిందని అధికారులు చెప్పారు. అయితే తీరందాటే సమయంలో.. దాటిన తరువాత ఒక్క చినుకు కూడా పడలేదు. గురువారం ఉదయం నుంచి ఎండకాసింది. ఇంత పెద్ద తుఫాన్ ఎటువంటి ప్రభావం చూపకుండానే వెళ్లిపోయింది. ఇలాంటి పరిస్థితి ఎప్పుడూ లేదని కొందరు పెద్దలు వ్యాఖ్యానించారు. కాగా, ఈ తుఫాన్ ప్రభావంతో ఐదు రోజుల్లో తడ మండలంలో 278.9 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదుకాగా, సూళ్లూరుపేట మండలంలో 378.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఇంత వర్షం కురిసినా చెరువులు, గుంటలు పాతికశాతంకూడా నిండకపోవడం విశేషం.

జిల్లాకు తప్పిన ముప్పు

- ఊపిరి పీల్చుకున్న అధికార యంత్రాంగం

భారీ వర్షాలు, పెనుగాలులకు తోడు మెరుపు వరదలు ముంచెత్తే ప్రమాదం ఉందని వాతావరణ శాఖ చేసిన హెచ్చరికలకు భిన్నంగా.. వాయుగుండం తీరం దాటింది. గురువారం తెల్లవారుజామున 4.30 గంటల సమయంలో తడ మండలంలో తీరం దాటినట్లు అధికారులు చెప్పారు. ఆ సమయంలో వర్షాలు, పెనుగాలులు, వరదలూ సంభవించకపోవడంతో జిల్లాకు ముప్పు తప్పినట్టయింది. దీంతో జిల్లా యంత్రాంగం ఊపిరి పీల్చుకుంది. - తిరుపతి, ఆంధ్రజ్యోతి

- చెరువులు, రిజర్వాయర్లలోకి చేరుతున్న నీరు
- భారీ వర్షాలకు రూ. 6.52 కోట్ల పంట, ఆస్తి నష్టాలు

వాయుగుండం ప్రభావంతో గత 13 నుంచి 16వ తేదీ వరకూ భారీ వర్షాలు కురిశాయి. 14 మండలాల పరిధిలోని 52 గ్రామాలపై దీని ప్రభావం కనపడింది. ఊర్లలోకి.. ఇళ్లలోకి నీరు చేరడం, ఇళ్లు దెబ్బతినడం వంటి ఘటనల్లో 1183 మంది బాధితులను పునరావాస కేంద్రాలకు తరలించారు. ఒక పక్కా ఇల్లు పూర్తిగా ధ్వంసం కాగా మరో రెండు పాక్షికంగా దెబ్బతిన్నాయి. 14 మిద్దె ఇళ్లు, 13 పూరి గుడిసెలు దెబ్బతిన్నాయి. మొత్తంగా వంద ఇళ్లు నీట మునిగాయి. 350 ఇళ్లలోకి వర్షపు నీరు చేరింది. 363 బాధిత కుటుంబాలకు చెందిన 1183 మందికి 20 పునరావాస కేంద్రాల్లో తాత్కాలిక ఆశ్రయం కల్పించారు. ఇక, 6512 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. అందులో 6487 ఎకరాలు వ్యవసాయ, 30 ఎకరాల్లో ఉద్యాన పంటలున్నాయి. ఏడు పశువులు, నాలుగు గొర్రెలు మృతిచెందాయి. పంచాయతీరాజ్ రహదారులు దారుణంగా దెబ్బతిన్నాయి. నాలుగు రోడ్లు 12.11 కిలోమీటర్ల మేర ఛిద్రమయ్యాయి. నాలుగు కల్వర్టులు కూలిపోవడం, కొట్టుకుపోవడం జరిగాయి. ఈ శాఖకు రూ.1.55 కోట్లు నష్టం వాటిల్లింది. మున్సిపల్ శాఖకు సంబంధించి ఒక భవనంతో పాటు 2.45 కిలోమీటర్ల రోడ్లు, 2.2 కిలోమీటర్ల మేరకు డ్రైయినేజీ కాలువలు, 326 వీధి దీపాలు దెబ్బతిన్నాయి. తద్వారా ఈ శాఖకు రూ. 4.13 కోట్లు నష్టం జరిగింది. మైనర్ ఇరిగేషన్ శాఖ పరిధిలో నాలుగు చెరువులు దెబ్బతినడంతో రూ.62 లక్షల నష్టం సంభవించింది. 33-11 కేవీ సబ్ స్టేషన్లు ఆరు, 11 కేవీ విద్యుత్ స్తంభాలు 16, ఎల్‌టీ విద్యుత్ స్థంభాలు 30 దెబ్బతిని రూ.6.79 లక్షల నష్టం కలిగింది. జిల్లావ్యాప్తంగా భారీ వర్షాలకు రూ.6.52 కోట్ల నష్టం వాటిల్లిందని జిల్లా యంత్రాంగం ప్రభుత్వానికి నివేదిక అందజేసింది.

భారీ వర్షాలు కలిగించిన నష్టాలు

- వెంకటగిరి మండలం చిన్నప్పపేట గ్రామం వద్ద సిమెంటు పైపులతో ఏర్పాటు చేసిన కల్వర్టు కొట్టుకుపోయింది. దీనిని గురువారం కలెక్టర్ వెంకటేశ్వర్ పరిశీలించారు.
- నారాయణవనం మండలం తిరువణ్యం వద్ద పంచాయతీ రాజ్ శాఖకు చెందిన కాజ్‌వే దారుణంగా దెబ్బతింది.
- గూడూరు-వెంకటగిరి మార్గంలో రోడ్డు ఛిద్రమైంది. గూడూరు మండలం చెన్నూరు వద్ద కూడా రోడ్డు దెబ్బతింది.
- చిట్టమూరు మండలం మల్లాం రోడ్డు నుంచి కోగిలి వెళ్ళే మార్గంలో వర్షపు నీరు నలిచి భారీ గోతులు ఏర్పడ్డాయి.
- సూళ్లూరుపేటలో జీఎన్టీ రోడ్డు దారుణంగా దెబ్బతింది.
- పెళ్లకూరు మండలం పెనల గుర్రప్ప తోట వద్ద జాతీయ రహదారి నుంచి పాలచ్చూరు ఎస్టీ కాలనీకి నిర్మించిన తారు రోడ్డు తీవ్రంగా దెబ్బతింది. చిన్నప్ప నాయుడుపల్లి వద్ద తారురోడ్డు గోతులమయమైంది.
- నాయుడుపేట మండలం చిగురుపాడు రోడ్డు ఛిద్రమైంది.
- వరదయ్యపాలెం మండలం యానాది వెట్టు పంచాయతీలో రోడ్లన్నీ గోతులతో బురదమయంగా మారాయి.
- పిచ్చాటూరు మండలంలో శ్రీకాళహస్తి వెళ్ళే ప్రధాన రహదారి రూపం కోల్పోయింది.

నిన్న ఎడారిలా...
నేడు జలకళ



గురువారం జలకళతో ఇలా..




బుధవారం అలా..


వర్షాకాలంలోనూ చుక్కనీరు లేక ఎడారిని తలపించేలా బుధవారం వరకు ఉన్న స్వర్ణముఖినది. ఇటీవల కురిసిన వర్షాలకు గురువారం జలకళతో తొణికిసలాడుతూ ప్రవహించింది. దాంతో స్థానికులు ఎంతో ఉత్సాహంగా స్వర్ణముఖినది పారుదల నీటిని చూసి ఆనందించారు.

- నాయుడుపేట, ఆంధ్రజ్యోతి

22 అడుగులకు చేరిన అరణియార్



పిచ్చాటూరు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): తుఫాను ప్రభావంతో అరణియార్ నీటిమట్టంపెరుగుతోంది. ఏలం కాలువల ద్వారా గంటకు 1366 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు వచ్చి చేరుతుంది. దీని వల్ల గురువారం ఉదయం 6 గంటల సమయంలో ప్రాజెక్టు నీటి మట్టం 22 అడుగులకు(0.800 టీఎంసీ) చేరింది. అరణియార్ పూర్తి స్థాయి నీటిమట్టం 31 అడుగులు కాగా, నీటి సామర్థ్యం 1.85 టీఎంసీగా ఉంది.



చెరువులకు గండ్లు

- సాగునీరంతా పులికాట్‌లోకి

పరవళ్లు తొక్కుతున్న జలపాతాలు -6లో

సూళ్లూరుపేట, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట మండలంలో చెరువులకు గండ్లు పడడంతో రైతులు లబోదిబో మంటున్నారు. కుదిరి-తిప్పకండ్రిగ గ్రామాలకు చెందిన చింతాల చెరువుకు గండి పడి ఉన్న నీరంతా పులికాట్‌లోకి వెళుతోంది. తీర ప్రాంత గ్రామాల్లో దామరాయికి చెందిన పాడేరు చెరువు, కొల్లపొట్టుకు చెందిన కొత్త ట్యాంకు చెరువులకు కూడా గండ్లు పడడంతో వర్షపు నీరంతా పులికాట్ సరస్సులోకి వెళ్తుంది. గత ఏడాది డిసెంబరు మీచౌంగ్ తుఫాన్ ప్రభావంతో చింతాల చెరువుకు గండ్లు పడ్డాయి. అప్పుడు చెరువు కింద రైతులందరూ కలసి ఇసుక బస్తాలు వేసి గండ్లు పూడ్చి నీటిని కాపాడుకొన్నారు. దీనికి రూ.40 వేల వరకు ఖర్చయిందని గ్రామస్తులు చెబుతున్నారు. కూటమి ప్రభుత్వమైనా చెరువుల మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.



చింతాల చెరువుకు గండి పడడంతో పులికాట్‌లోకి వెళ్తున్న నీరు - దామరాయి వద్ద పాడేరు చెరువుకు పడ్డ గండి



బాధితులతో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

బాధితులకు కలెక్టర్ పరామర్శ

ఏర్పేడు, అక్టోబరు 17: భారీ వర్షాలకు ఏర్పేడు మండలం కందాడు పంచాయతీ చిన్నప్పగుంట ఎస్టీ కాలనీలో కూలిపోయిన మట్టి మిద్దెలు, పూరిగుడిసెలను గురువారం కలెక్టర్ వెంకటేశ్వర్ పరిశీలించారు. బాధితులు గంగమ్మ, చంద్రమ్మ, చెంచమ్మను పరామర్శించారు. ప్రభుత్వం నుంచి పరిహారం అందిస్తామని పట్టా ఇచ్చి ఇల్లు కట్టించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కాలనీకి మంజూరు చేసిన ఇళ్లను దీపావళికి ప్రారంభించాలని లబ్ధిదారులకు సూచించారు. గ్రామంలోని పిల్లలందరిని పాఠశాలలకు పంపాలన్నారు. అనంతరం ఎన్టీఆర్ హౌసింగ్ కింద ఇంటి మంజూరుకు అధికారులుపరిశీలించి ప్రతిపాదనలు సమర్పించాలని ఆదేశించారు. తహసీల్దారు భార్గవి, ఎంపీడీవో సౌభాగ్యం, హౌసింగ్ ఏఈ తదితరులుపాల్గొన్నారు.

గాయపడిన సాయితేజారెడ్డి మృతి



సాయితేజారెడ్డి (ఫైల్ ఫొటో)

శ్రీకాళహస్తి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): అమెరికాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సాయి తేజారెడ్డి చికిత్సపొందుతూ మృతి చెందాడు. దీంతో కారులో ప్రయాణిస్తున్న నలుగురూ మృత్యువాత పడ్డారు. ఈ నలుగురిలో ముగ్గురు శ్రీకాళహస్తి వారే. పట్టణంలోని బంగారమ్మ కాలనీకి చెందిన సాయితేజారెడ్డి, హరితారెడ్డి దంపతులు, దక్షిణకైలాస్‌నగర్ కాలనీకిచెందిన రాజినేని శివతో పాటు ఓజిలి మండలం రాజుపేటకు చెందిన గోపి వారాంతపు విహార యాత్రకు వెళ్తొస్తుండగా ప్రమాదం జరిగిన విషయం తెలిసిందే. ఈ నలుగురిలో ముగ్గురు అక్కడికక్కడే మృతచెందగా, తీవ్రంగా గాయపడిన సాయితేజారెడ్డికి తానా సభ్యులు చికిత్స అందించారు. భారతదేశ కాలమానప్రకారం బుధవారం అర్ధరాత్రి సాయితేజా రెడ్డి కూడా మృతి చెందాడు. దీంతో దంపతులు ఇద్దరు మరణించడంతో ఆకుటుంబంలో మరింత విషాదం అలుముకుంది. మొత్తం నాలుగు మృతదేహాలు ఆదివారం లేదా సోమవారం శ్రీకాళహస్తికి చేరుకుంటాయని బంధువులు భావిస్తున్నారు ఇక రాజినేని శివ మృతదేహాన్ని చూసేందుకు నిరీక్షించలేక వారి తల్లిదండ్రులైన రమేష్‌నాయుడు, శశికుమారి తల్లడిల్లిపోయారు. బుధవారం బెంగళూరు నుంచి బిడ్డ భౌతికకాయాన్ని చూసేందుకు అమెరికా వెళ్లారు.



రాజినేని శివ (ఫైల్ ఫొటో)

సర్కారు మద్యం గోడౌన్లకు..

- రికార్డుల ఆధారంగా స్టాకు పరిశీలిస్తున్న ఎక్సైజ్ అధికారులు
- దుకాణాల్లోని ఫర్నిచర్, సామగ్రి వేలానికి సిద్ధం

తిరుపతి(నేరవిభాగం) అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ మద్యం దుకాణాల్లోని స్టాకును ఎక్సైజ్ అధికారులు స్వాధీనం చేసుకుంటున్నారు. ఈనెల 16 నుంచి ప్రైవేటు మద్యం దుకాణాలు ప్రారంభం కావడంతో 15నే ప్రభుత్వ షాపులు మూతపడ్డాయి. వీటిలో ఎంత స్టాకు ఉంది? గోడౌన్ల నుంచి ఎంత స్టాకు తీసుకొచ్చారు? ఎంత విక్రయించారనే వివరాలు సేకరిస్తున్నారు. ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ వాసుదేవచౌదరి ఆధ్వర్యంలో ఐదు నుంచి ఆరు టీములు దుకాణాల వారీగా స్టాకును పరిశీలించి పంచనామా నిర్వహించి స్వాధీనం చేసుకుని గోడౌన్లకు తరలిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా రూ.36 కోట్లు విలువ చేసే మద్యం స్టాకు ఉంటుందని అధికారుల అంచనా. గురువారం దాదాపు 20 శాతం దుకాణాల్లోని స్టాకు రికార్డులు పరిశీలించారు. వీటిల్లోని ఫర్నిచర్, ఎలక్ట్రానిక్ వస్తువులు, డిజిటల్ మిషన్లు ఇతర పరికరాలు, ఎక్కడైనా సొంత భవనాలుంటే స్వాధీనం చేసుకుంటున్నారు. వీటిని వేలం వేసి వచ్చిన డబ్బును ఖజానాకు జమచేయనున్నారు.

ర్యాట్ బైట్ పేరుతో స్వల్ప తేడాలు

తిరుపతి అర్బన్ పరిధిలోని ఒక దుకాణంలో మాత్రం ర్యాట్ బైట్ పేరిట రూ.6500 విలువ చేసే ప్లాస్టిక్ సీసాల మద్యం బాటిళ్ల తేడాలు వున్నట్లు అధికారుల దృష్టికి వచ్చింది. దీన్ని సంబంధిత సూపర్‌వైజర్, సేల్స్‌మెన్ ద్వారా ప్రభుత్వానికి జమచేయిస్తామని ఎక్సైజ్ అధికారులు చెప్పారు. మిగిలిన దుకాణాల్లో మాత్రం స్వల్పంగా తేడాలున్నట్లు తెలిపారు. ఒంగోలులో జరిగిన గోల్‌మాల్‌తో మేల్కొన్న ఎక్సైజ్ అధికారులు.. దుకాణాల్లోని ప్రతి స్టాకును క్షుణంగా పరిశీలిస్తున్నారు. ఈ ప్రక్రియ పూర్తి కావడానికి 10 నుంచి 15 రోజులు పట్టవచ్చని అధికారులు అంటున్నారు.

పల్లె పండుగతో గ్రామాలకు మేలు

మంగళం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పల్లె పండుగతో గ్రామాలకు ఎంతో మేలు జరుగుతుందని డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్ అన్నారు. గురువారం ఆయన తన కార్యాలయంలో మాట్లాడుతూ తిరుపతి జిల్లా పరిధిలో పల్లె పండుగ ద్వారా ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో రూ.50కోట్లతో సీసీ రోడ్లు, రూ.30 కోట్లతో డ్రైన్‌లు నిర్మిస్తున్నామన్నారు. రూ.25కోట్ల అంచనాతో అనిమల్ షెల్టర్లు నిర్మించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. శ్మశాన వాటికల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. రోడ్లపై తిరిగే పశువుల షెల్టర్ నిర్మాణానికి రూ.50లక్షలతో ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. దామినేడు హౌసింగ్ కాలనీ వద్ద యూడీఎస్ నిర్మాణానికి రూ.కోటి మంజూరు చేశామన్నారు. జిల్లా అటవీ శాఖ పరిధిలో నర్సరీలు ఏర్పాటు చేసి, వనాభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. జిల్లావ్యాప్తంగా 3,288 కాలువల్లో పూడికతీశామని, తద్వారా వర్షపునీరు నేరుగా చెరువుల్లోకి వెళుతోందని తెలిపారు.

21న పీజీ స్పాట్ అడ్మిషన్లు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): పద్మావతి యూనివర్సిటీలో ఈనెల 21వ తేదీన పీజీ కోర్సుల్లో ప్రవేశానికి స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నారు. పీజీసెట్‌లో ఉత్తీర్ణత సాధించి ఇప్పటిదాకా ఎక్కడా అడ్మిషన్ పొందని వారు ఇందుకు అర్హులు. ఒరిజినల్ సర్టిఫికెట్లతో డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్ (డీఓఏ) కార్యాలయంలో కానీ, ఎస్పీఎంవీవీ.. వెబ్‌సైట్ కానీ చూడవచ్చునని వర్సిటీ పీఆర్వో శ్రీరజని తెలిపారు.

స్విమ్స్‌లో మహిళలకు రాయితీతో మామోగ్రామ్ పరీక్షలు

- ఈనెల 21 నుంచి 31వ తేది వరకు నిర్వహణ

తిరుపతి(వైద్యం),అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ రొమ్ము క్యాన్సర్ అవగాహన మాసాన్ని పురస్కరించుకుని స్విమ్స్‌లో ఈనెల 21 నుంచి 31వ తేదీ వరకు మహిళలకు ప్రత్యేక రాయితీతో మామోగ్రామ్ పరీక్షలు నిర్వహించనున్నట్లు మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్ గురువారం తెలిపారు. 40 ఏళ్ల పైబడిన మహిళలు రొమ్ము, అండాశయ క్యాన్సర్‌కు సంబంధించి మామోగ్రామ్ పరీక్ష చేయించుకోవాలని సూచించారు. రూ.వెయ్యికే డాక్టర్ కన్సల్టేషన్, మామోగ్రామ్ పరీక్షలు అందుబాటులోకి తీసుకువచ్చామని, ప్రభుత్వ సెలవు దినాలు మినహా మిగిలిన రోజుల్లో సేవలు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు స్పెషల్ క్లినిక్‌గా పేర్లు నమోదు చేసుకోవాలని, పూర్తి వివరాలకు 83339 97968కు సంప్రదించాలని కోరారు.

బైకు హోటల్



టమోటా రైస్, వెజ్ పలావ్, చపాతీ, పులిహోర రైస్, లెమన్ రైస్.. ఇలా స్కూటర్‌కు ప్లకార్డులు కట్టారు. ఫుట్‌పాత్‌పై స్టాండు పెట్టి ఇంటి నుంచి తీసుకొచ్చిన హాట్‌బాక్సు, గిన్నెలు సర్ది పెట్టారు. ఎండ, వానకు రక్షణకు పెద్ద గొడుగు ఉంచారు. అంతే.. రోడ్ సైడ్ హోటల్ రెడీ. ఇంటి నుంచి తీసుకొచ్చిన ఆహార పదార్థాలు అయిపోగానే.. తిరిగి ఇంటికి వెళ్లిపోతారు రేణిగుంటకు చెందిన భరత్‌కుమార్. ఇలా గురువారం తిరుపతి నగరం కపిలతీర్థం రోడ్డులో స్కూటర్ హోటల్ కనిపించింది.

- తిరుపతి (కపిలతీర్థం), ఆంధ్రజ్యోతి

మందు కోసం..




జగన్ ఐదేళ్ల పాలనలో నాణ్యమైన మద్యానికి దూరమయ్యారు మందుబాబులు. ధర ఎక్కువైనా, నాసిరకం 'జే' బ్రాండ్లే దిక్కయ్యాయి. బుధవారం సాయంత్రం ప్రైవేటు మద్యం దుకాణాలు ప్రారంభం కాగానే.. తమకు కావాల్సిన బ్రాండ్ల కోసం బారులు తీరారు. గురువారం కూడా పలు మద్యం షాపుల వద్ద మందుబాబుల సందడి కనిపించింది.

- తిరుపతి(నేరవిభాగం), ఆంధ్రజ్యోతి

■ నేడు శ్రీకృష్ణదేవరాయలు 459వ వర్ధంతి

వెంకన్న వీరభక్తుడు దేవరాయలు



తిరుమల ఆలయంలోకి మహాద్వారం గుండా ప్రవేశించగానే కుడివైపున ఉండే శ్రీకృష్ణదేవరాయలు, తిరుమలదేవి, చిన్నాదేవి విగ్రహాలు



తిరుమల ఆలయం ఉత్తరపు గోడమీద శ్రీకృష్ణదేవరాయలు క్రీ.శ.1513లో తెలుగులో వేయించిన శాసనం. తిరుమలదేవి, చిన్నాదేవిలు స్వామికి బంగారపు నైవేద్యపు పాత్రలు సమర్పించినట్లు ఇందులో పేర్కొన్నారు.

తిరుమల ఆలయానికి గొప్ప వైభవం రావడంలో విజయనగర రాజుల పాత్ర కీలకమైనది. వీరిలో శ్రీకృష్ణదేవరాయలు తిరుమల శ్రీవేంకటేశ్వరుడికి వీరభక్తుడు. తన 21 ఏళ్ల పాలనా కాలంలో ఆయన ఏడుసార్లు తిరుమలను సందర్శించారు. అనేక దానాలు చేశారు. స్వామికి విలువైన ఆభరణాలు చేయించి ఇచ్చారు. అందుకే తిరుమల ఆలయంలో ముకుళిత హస్తాలతో ఉన్న శ్రీకృష్ణదేవరాయలు విగ్రహం ఉంటుంది. ఆయనకు అటూ ఇటూ ఇద్దరు భార్యల విగ్రహాలుంటాయి. ఆయన వెంకన్నకి ఎంత భక్తుడంటే.. భార్యల్లో ఒకరి పేరు తిరుమల దేవి. కూతురికి తిరుమలాంబ అని, కుమారుడికి తిరుమల దేవరాయలు అని ఆయన పేర్లు పెట్టుకున్నారు. చిన్నల్లుడి పేరు కూడా తిరుమల రాయలు కావడం విశేషం. కృష్ణదేవరాయలు వేయించిన శాసనాల ద్వారా తిరుమల వైభవ విశేషాలు అనేక తెలుస్తాయి.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

ఏడుసార్లు తిరుమలకు వచ్చిన కృష్ణదేవరాయలు

- 1513 ఫిబ్రవరి 10వ తేదిన మొదటిసారిగా దేవరాయులు తిరుమలకు వచ్చారు. నవరత్న ఖచిత కిరీటాన్ని స్వామికి సమర్పించారు.
- 1513 మే 2న తిరుమలకు వచ్చిన ఆయన శ్రీవారికి పాలు నైవేద్యంగా సమర్పించటానికి 374 తులాల బంగారు గిన్నె ఇచ్చారు. ఉత్సవమూర్తులకు మూడు బంగారు కిరీటాలు ఇచ్చారు.
- 1513 జూన్ 13న శ్రీవారిని దర్శించుకున్న ఆయన నిత్యసేవల కోసం మాన్యాలు రాసిచ్చారు. నవరత్న ఖచిత ఆభరణాలు సమర్పించారు.
- 1513జూలై 6న స్వామిని దర్శించుకున్న శ్రీకృష్ణ దేవరాయలు 30 వేల బంగారు నాణేలతో అభిషేకం చేశారు. పలు బంగారు కానుకలను ఇచ్చారు.
- 1515 అక్టోబరు 25న తిరుమలకు వచ్చిన ఆయన మకరతోరణం సమర్పించారు.
- 1517 జనవరి 2న ఆనందనిలయానికి బంగారు పూత పూర్తి అయిన సందర్భంగా కూడా శ్రీకృష్ణ దేవరాయలు తిరుమలకు వచ్చారు.
- 1521 ఫిబ్రవరి 17న తిరుమలకు వచ్చిన ఆయన పీతాంబరంతో పాటు అత్యంత విలువైన వజ్రాలు, ఇతర బంగారు ఆభరణాలు సమర్పించుకున్నారు.

విశేషం

శ్రీకృష్ణదేవరాయలు సమర్పించిన బంగారు పాత్రలూ, ఆభరణాల జాబితా అయితే శాసనాల ఆధారంగా లభించింది కానీ, ఆభరణాలు ఒక్కటి కూడా ప్రస్తుతం లేవు. 1952లో టీటీడీ ఆధ్వర్యంలోకి వచ్చిన ఆభరణాలలో వీటి జాడ లేదు. అప్పటికే మాయమయ్యాయి. కరిగించి కొత్త ఆభరణాలు చేయించి ఉండవచ్చని ఒక ఊహ.

'జల'జలమంటూ..



సదాశివకోన



అమ్మవారికోన

సదాశివకోనలో జలపాత సోయగం


వడమాలపేట మండలంలోని దట్టమైన అటవీ ప్రాంతంలో ఉన్న సదాశివకోన, అమ్మవారి కోనల జలపాతాల సోయగం పర్యాటకులను అలరిస్తోంది. ఇటీవల కురిసిన వర్షాలకు గతంలో ఎన్నడూ లేనివిధంగా ఉధృతంగా నీళ్లు జాలువారుతున్నాయి.

- వడమాలపేట, ఆంధ్రజ్యోతి

కనువిందు చేస్తున్న ఉబ్బలమడుగు

వరదయ్యపాళెం మండలంలోని ఉబ్బలమడుగు జలపాతం కనువిందు చేస్తోంది. రెండు రోజులుగా కురిసిన వర్షాలకు అడవిలో నుంచి ముందుకు సాగుతున్న ప్రవాహం.. చూపరులను ఆకట్టుకుంటోంది.

- వరదయ్యపాళెం, ఆంధ్రజ్యోతి





ఉధృతంగా కైలాసనాథ కోన

నారాయణవనం మండల పరిధిలో దట్టమైన అటవీ ప్రాంతంలో కామాక్షి దేవి సమేత కైలాసనాథ స్వామి కొలువై ఉన్నారు. అక్కడి కైలాసనాథ కోనలో ప్రస్తుతం వర్షాల కారణంగా జలపాతం ఉధృతంగా పడుతోంది. దీంతో భక్తుల రాకపోకలను నిషేధించారు. ప్రకృతి సోయగాల నడుమ, పెద్ద వృక్షాల మధ్య జలపాతం అత్యంత శోభాయామానంగా ఉంది. కొందరు భక్తులు ఇక్కడకు వచ్చి స్నానాలను ఆచరించి అయ్యప్పమాల ధరిస్తున్నారు.

- నారాయణవనం, ఆంధ్రజ్యోతి


సందడి.. సందడిగా

మూడు రోజులుగా తిరుమల కొండల్లో కురిసిన వర్షానికి జలధారలు పరుగులు తీస్తున్నాయి. తిరుపతిలోని కపిలతీర్థంలోకి జలపాతం ఉరుకుతోంది. ఈ నీటి సోయగాలను చూసేందుకు స్థానికులు, భక్తులు గురువారం తరలివచ్చారు. ఫొటోలు, సెల్ఫీలతో సందడి చేశారు.

- తిరుపతి(కపిలతీర్థం), ఆంధ్రజ్యోతి




ఉరుకుతున్న తలకోన



శేషాచలంలోని తలకోన జలపాతాలు ఆహ్లాదం పంచుతున్నాయి. కొండల నుంచి ఉవ్వెత్తున కిందికి ఉరుకుతున్నాయి. నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఈ దట్టమైన అటవీప్రాంతంలో భారీగా నీరు చేరింది. తలకోన సముద్ర మట్టానికి సుమారు 700 అడుగు ఎత్తున ఉంది. దీంతో ఇక్కడి పర్వత శ్రేణుల శిఖరాల నుంచి వర్షపు నీరు ఉధృతంగా కిందకు చేరుతున్న తీరు మానసిక ఉల్లాసం కలిగిస్తోంది. భద్రత దృష్ట్యా ప్రస్తుతం ఇక్కడకు భక్తులను అనుమతించడంలేదు.

- ఎర్రావారిపాలెం, ఆంధ్రజ్యోతి





శ్రీవారికి పౌర్ణమి గరుడసేవ

తిరుమలలో గురువారం పౌర్ణమి గరుడసేవ వైభవంగా జరిగింది. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈనెల 8వ తేదీన గరుడవాహనమెక్కి దర్శనమిచ్చిన శ్రీవారు పౌర్ణమి సందర్భంగా మరోసారి విశేష అలంకరణలో తన ఇష్టవాహనమైన గరుత్మంతుడిపై కొలువుదీరారు. ఆలయ నాలుగు మాడవీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో మంగళవాయిద్యాలు, వేదమంత్రాలు, భక్తుల కర్పూర నీరాజనాలు, గోవిందనామ స్మరణల మధ్య గరుడోత్సవం కన్నుల పండువగా జరిగింది.

- తిరుమల, ఆంధ్రజ్యోతి



అతిథిగృహం ముందు అక్టోపస్ సిబ్బంది

'పద్మావతి'లో అక్టోపస్ మాక్‌డ్రిల్

తిరుమల, అక్టోబరు17(ఆంధ్రజ్యోతి): తిరుమలలోని పద్మావతి అతిథిగృహంలో గురువారం రాత్రి అక్టోపస్ కమాండోలు మాక్‌డ్రిల్ నిర్వహించారు. వీరు ప్రతినెలా ఒక్కో ప్రదేశంలో మాక్‌డ్రిల్ నిర్వహిస్తుంటారు. ఈక్రమంలో శ్రీవారి దర్శనార్థం తిరుమలకు వచ్చే వీవీఐపీలు బస చేసే పద్మావతి అతిథిగృహంలో గురువారం రాత్రి మాక్‌డ్రిల్ చేపట్టారు. వీవీఐపీని ఎవరైనా బంధిస్తే ఎలా రక్షించాలనే అంశంపై ఈ ఆపరేషన్ సాగింది.

ప్రైవేట్ పాఠశాలకు షోకాజ్ నోటీసులు

కోట, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): కోటలోని ఓ ప్రైవేట్ పాఠశాలకు జిల్లా విద్యాశాఖాధికారి శేఖర్ నోటీసులు జారీచేసినట్లు ఎంఈవో మస్తానయ్య గురువారం తెలిపారు. తుఫాన్ కారణంగా కలెక్టర్ వెంకటేశ్వర్ మూడు రోజులపాటు సెలవుదినం ప్రకటించినప్పటికి ఈ నెల 15వ తేదీన తరగతులు నిర్వహించడం.. తహసీల్దారు జయజయరావు, ఎంఈవో మస్తానయ్య, ఎంపీడీవో వేణు పాఠశాలను తనిఖీచేసి డీఈవోకు నివేదికలు పంపారు. దీంతో ఆ పాఠశాల యాజమాన్యంకు షోకాజ్‌నోటీసులు జారీ అయినట్లు ఎంఈవో తెలిపారు.

ఆర్టీసీ బస్సుల పునరుద్ధరణ

తిరుపతి(ఆర్టీసీ), అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల కారణంగా కొన్ని గ్రామాలకు ఆర్టీసీ యాజమాన్యం తాత్కాలికంగా సర్వీసులను నిలిపేసింది. బుధవారం సాయంత్రానికే వర్షం తగ్గిపోవడం, గురువారం ఎండ రావడంతో మధ్యాహ్నం నుంచి అన్ని మార్గాల్లో బస్సుల రాకపోకలను పునరుద్ధరించారు. తిరుపతి- గుడిమల్లం, సూళ్లూరుపేట- కొరిడి, పెర్నాడు, వేనాడు, శ్రీకాళహస్తి- పెరిమిడి, పాలచూరు, సత్యవేడు- శ్రీకాళహస్తి, పాపవినాశనం- తిరుమల, వెంకటగిరి- ఉడమలపాడుకు 25 బస్సులు యథావిధిగా నడుస్తున్నాయి. శ్రీవారిమెట్టు మార్గంలో శుక్రవారం ఉదయం నుంచి నడవనున్నాయి. వర్షాల కారణంగా ఆర్టీసీ రోజు రాబడి సరాసరి రూ.1.7కోట్లు నుంచి బుధవారం రూ.1.3కోట్లకు పడిపోయింది.

మద్యం దుకాణాలు ఇక్కడొద్దు



తిరుపతిలో తరలించాలంటూ ఆందోళన

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): తమ ప్రాంతంలో మద్యం దుకాణాలు వద్దని, తరలించాలంటూ జిల్లాలోని మూడు చోట్ల స్థానికులు గురువారం ధర్నాకు దిగారు. తిరుపతి నగరం డీబీఆర్ ఆస్పత్రి పక్కన ఏర్పాటు చేసిన మద్యం దుకాణం తొలగించాలని సీపీఎం నగర కార్యదర్శి సుబ్రహ్మణ్యం, ఐద్వా జిల్లా కార్యదర్శి సాయిలక్ష్మి ఆధ్వర్యంలో స్థానికులు దుకాణం ఎదుట బైఠాయించారు. గుడి, బడి, ఆస్పత్రి, నివాస ప్రాంతాల్లో మద్యం దుకాణాలు ఏర్పాటు చేయకూడదని నిబంధనలు ఉన్నా పట్టించుకోకపోవడం సరికాదన్నారు. ప్రజలకు ఇబ్బందిలేని చోటకు మార్చకుంటే ఆందోళన తీవ్రం చేస్తామని హెచ్చరించారు. సీపీఎం నేతలు వేణుగోపాల్, రమణ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఆరిమేనిపాడు దళితవాడలో ప్రతిఘటన

ఓజిలి, ఆంధ్రజ్యోతి: ఓజిలి మండలం ఆరిమేనిపాడు దళిత కాలనీ వద్ద మద్యం షాపు ఏర్పాటు చేయవద్దంటూ గురువారం దళితులు ప్రతిఘించారు. ఓజిలిలో ఒక షాపు, ఆరిమేనిపాడు దళితకాలనీలో మరో షాపును ఏర్పాటు చేసేందుకు వేలం పాటదారులు సన్నాహాలు చేసుకున్నారు. దీంతో అక్కడి దళిత కాలనీవాసులు షాపు ఏర్పాటును ప్రతిఘటించారు. కాలనీ వాసులకు ఇదే దారి కావడంతో మద్యం మత్తులో ఉన్న వారి ఆగడాలు మహిళలకు ఇబ్బందులు కలిగిస్తాయంటూ వాగ్వివాదానికి దిగారు. ఎక్సైజ్ సీఐ అరుణ కుమారి గ్రామానికి వెళ్ళి అక్కడి దళితులతో మాట్లాడి వారి నుంచి ఫిర్యాదు తీసుకున్నారు. జిల్లా ఉన్నతాధికారుల ఉత్తర్వులు లేనిదే తాముకూడా ఏమీ చేయలేమంటూ తేల్చి చెప్పారు. జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసుకుంటే సమస్యకు పరిష్కారం ఉంటుందని దళితులకు సూచించారు. ప్రత్యక్ష చర్యలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని సీఐ హెచ్చరించారు.





ఎక్సైజ్ అధికారులతో మాట్లాడుతున్న స్థానికులు

చిన్నపాండూరులోనూ మార్చాలంటూ..

వరదయ్యపాలెం, ఆంధ్రజ్యోతి: వరదయ్యపాలెం మండలం చిన్నపాండూరు ప్రధాన రహదారి పక్కన ఉన్న మద్యం దుకాణాన్ని తరలించాలని పరిసర గ్రామాల ప్రజలు కోరుతున్నారు. ఈ మేరకు గురువారం వారు సత్యవేడు ఎక్సైజ్ సీఐని కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రధాన రహదారి పక్కనే మద్యం దుకాణం ఉండటంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతుందని.. పొలాలకు వెళ్లే రైతులు, శ్రీసిటీకి వెళ్లే ఉద్యోగులు ఈ మార్గం గుండానే వెళ్లాల్సి ఉన్నందున ఇబ్బందులు ఎదురవుతాయన్నారు. బస్సులు, టిప్పర్లు, ఆటోలు వెళుతున్న నేపథ్యంలో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. ఈ మద్యం దుకాణాన్ని మరోచోటకు మార్చాలని వారు కోరారు.

వేనాటి ఫ్లెక్సీ రేపిన రాజకీయ చర్చ



మంత్రి ఆనంతో ఉన్న వేనాటి ఫ్లెక్సీ

సూళ్లూరుపేట, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): నాలుగు దశాబ్దాలకు పైగా పార్టీ ఆవిర్భవం నుంచి టీడీపీలో ఉన్న టీటీడీ బోర్డు మాజీ సభ్యులు, సీనియర్ నేత వేనాటి రామచంద్రా రెడ్డి ఎన్నికల ముందు వైసీపీలో చేరిన విషయం తెలిసిందే. ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం, వైసీపీ ఓటమి పాలవ్వడంతో వేనాటి అప్పటి నుంచి పార్టీకి దూరంగా ఉంటున్నారు. ఈ నేపథ్యంలో సూళ్లూరుపేటలో వేనాటి అభిమానులు టీడీపీకి చెందిన మంత్రి ఆనం రామనారాయణ రెడ్డితో కలిసి ఉన్న ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. ఈ ఫ్లెక్సీ ఇప్పుడు పట్టణంలో చర్చనీయాంశమైంది. వేనాటి ఫ్లెక్సీ పార్టీ కార్యాలయం ఎదుటే వెలవడం హాట్ టాపిక్‌గా మారింది.

చెంగాళమ్మ సేవలో తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి



సూళ్లూరుపేట, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): తెలుగు, తమిళ భక్తుల ఆరాధ్య దైవమైన చెంగాళమ్మ పరమేశ్వరి అమ్మవారిని గురువారం తెలంగాణా రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పి.సుధ దర్శించుకొన్నారు. న్యాయమూర్తిని సహాయ కమిషనర్ ప్రసన్న లక్ష్మీ ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అమ్మవారి దర్శనంతరం వేదపండితులు ఆశీర్వవచనంచేసి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సూళ్లూరుపేట కోర్టు అదనపు న్యాయమూర్తి ఎస్.అనూష, ఆర్డీవో ఈ.కిరణ్మయి, తహసీల్దార్ ఎస్‌వి.నరసింహరావు, సీఐ మురళీకృష్ణ, ఎస్ఐ బ్రహ్మనాయుడు ఉన్నారు.

స్వర్ణముఖి పరవళ్లు



పెన్నక్కచెరువులోకి పరుగులు తీస్తున్న నీరు

కోట, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): కోట మండలం గూడలి వద్ద ఉన్న స్వర్ణముఖి నది వరద నీటితో పరవళ్లు తొక్కుతోంది. ఎగువ ప్రాంతాలైన నాయుడుపేట, శ్రీకాళహస్తిల నుంచి నీరు వస్తుండడంతో గూడలి వద్ద ఉన్న స్వర్ణముఖి, మామిడి కాలువ త్రివేణి సంగమం పరివాహక గ్రామాల రైతులు ఆనందంలో మునిగితేలారు. అలాగే 7వేల ఎకరాల ఆయకట్టు భూములున్న పెన్నక్కచెరువులోకి స్వర్ణముఖి నీరు చేరడంతో చిల్లకూరు, కోట మండలాల ఆయకట్టు రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పెన్నక్కచెరువు కింద నారుమడులు పోసుకునేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

కారు ఢీకొని ఒకరి మృతి



మృతి చెందిన డిల్లీ బాబు

తడ, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : ద్విచక్ర వాహనాన్ని కారు ఢీ కొన్న ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందాడు. తడలో నివాసం ఉంటున్న డిల్లీ బాబు (55) తన స్నేహితుడు బవర్‌లాల్ పనిమీద అతడి బైక్‌పై వెనుక కూర్చోని స్థానిక తహసీల్దారు కార్యాలయానికి బయలుదేరారు. మార్గమధ్యంలో బోడిలింగాలపాడు మలుపువద్ద నెల్లూరుకు వెళ్లే కారు అదుపుతప్పి వెనుక నుంచి ఢీకొంది. ద్విచక్ర వాహనం వెనుక కూర్చోని ఉన్న డిల్లీబాబు డివైడర్‌పె పడి తీవ్ర గాయాలపాలై అక్కడిక్కడే మృతి చెందాడు. వాహనం నడుపుతున్న బవర్‌లాల్ రోడ్డుపైన పడి తీవ్ర గాయాలపాలయ్యాడు. వెంటనే పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని గాయపడ్డ బవర్ లాల్‌ను శ్రీసిటీ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం చెన్నైకి తరలించారు డిల్లీబాబు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సూళ్లూరుపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సీసీ రోడ్ల నిర్మాణాలకు భూమిపూజ



బాలాయపల్లి, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి) మండంలోని పలు పల్లెల్లో గురువారం 'పల్లె పండుగ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కయ్యూరులో రూ.12 లక్షలు, కాలగంధలో రూ.13 లక్షలు, సిద్ధాగుంటలో రూ.4 లక్షలు చొప్పున 29 లక్షల వ్యయంతో సిమెంటు రోడ్ల నిర్మాణాలకు శంకుస్థాపనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వినీల్ కుమార్, ఇన్‌చార్జి ఈఓపీఆర్డీ మోహన్‌రాజు, ఏపీఓ మృత్యుంజయరావు, ఎంపీటీసీ చంద్రమౌళి, నాయకులు జనార్ధన్‌రెడ్డి, రామచంద్రయ్య, పెంచలయ్య పాల్గొన్నారు.

120 గ్రాముల గంజాయి స్వాధీనం



వెంకటగిరిటౌన్, అక్టోబరు17 (ఆంధ్రజ్యోతి): గంజాయి కలిగి ఉన్న వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. గురువారం స్థానిక అంబేడ్కర్ కాలనీలో పోలీసులు దాడిచేశారు. షేక్ రహంతుల్లా వద్ద వెయ్యి రూపాయల విలువైన 120 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. సీఐ రమణ మాట్లాడుతూ గంజాయిపై ఉక్కుపాదం మోపుతు న్నామని అన్నారు. ఈ దాడుల్లో ఎస్ఐ రాంబాబు, సిబ్బంది మునిప్రసాద్, నారాయణ పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులపై అవగాహన



మాట్లాడుతున్న ఏడీఏ నాగార్జునసాగర్

వెంకటగిరిటౌన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): రైతులు యాజమాన్య పద్ధతులపై అవగాహన పెంచుకోవాలని ఏడీఏ నాగార్జునసాగర్ అన్నారు. గురువారం స్థానిక కుర్చాగుంట, బుసపాళెంలో 'పొలంపిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. ఆర్ఎన్ఆర్-15048 రకం సాగు పద్ధతులపై, డ్రంసీడర్‌పై అవగాహన కల్పించారు. ఏవో సుజాత, పలువురు రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

గోతులు..ఆదమరిస్తే అంతేసంగతులు..!



చెన్నూరు సమీపంలో ప్రధాన రహదారిపై భారీ గోతులు



గోతుల కారణంగా కష్టాలు పడుతున్న వాహనదారులు

గూడూరు అర్బన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): గూడూరు- వెంకటగిరి ప్రధాన రహదారి ముందే గోతులమయంగా ఉండేవి. మూడు రోజులుగా కురిసిన వర్షాలకు మరింత అధ్వానంగా తయారై మోకాళ్ల లోతు గోతులు పడ్డాయి. గూడూరు నుంచి వెంకటగిరి, రాపూరుకు వెళ్లే మార్గంలో చెన్నూరు గ్రామసమీపంలో సుమారు కిలోమీటరు మేర రోడ్డు గుంతలమయంగా తయారైంది. దీంతో వర్షపు నీరు నిల్వచేరడంతో గోతులు కనిపించక వాహనాలు ప్రమాదాల బారిన పడుతున్నారు. అధికారులు స్పందించి తాత్కాలిక మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.


తప్పిన తుఫాన్ ముప్పు

గూడూరు అర్బన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన తుఫాన్ ప్రమాదం తప్పడంతో ఇటు ప్రజలు అటు అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. తుఫాన్ కారణంగా రెండు రోజులుగా ఓ మోస్తరు వర్షాలు కురిశాయి. తుఫాన్ తడ సమీపంలో తీరం దాటుతుందని దీంతో భారీ వర్షాలు కురిసే ప్రమాదం ఉందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరికలు జారిచేశారు. ప్రధానంగా వాకాడు మండలం తూపిలిపాళెం వద్ద సముద్రం 20 అడుగుల మేర ముందుకు రావడంతో తీరప్రాంత గ్రామాలైన వాకాడు, కోట, చిల్లకూరు మండలాల్లో అధికారులు అప్రమత్తమై పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశారు. అయితే బుధవారం అర్ధరాత్రి తడ సమీపంలో తుఫాన్ బలహీనపడి తీరం దాటడంతో ముప్పు తప్పడంతో జనం ఊపిరి పీల్చుకున్నారు.

లాక్‌లు ఏర్పాటు చేయాలి

వాకాడు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): తిరుమూరు చెరువు తూములకు లాక్‌లు ఏర్పాటు చేయాలని ఆయకట్టు మాజీ అధ్యక్షుడు కేసీవీ రమణయ్య అధికారులను కోరారు. వర్షాలకు చెరువు నిండినా నీరు నిలవడం లేదని పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.

స్వర్ణముఖినదికి వరద రైతుల్లో ఆనందం



వాకాడు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : తుఫాన్ ప్రభావంతో పలుచోట్ల కురిసిన భారీ వర్షాలతో గురువారం సాయంత్రం 4.50 నిమిషాలకు వరదనీరు స్వర్ణముఖి నది బ్యారేజీకి చేరుకుంది. బ్యారేజీలోకి నీరు చేరడంతో తహసీల్దారు రామయ్య, ఇరిగేషన్ ఏఈ శ్రీనివాసులు స్వర్ణ ముఖిచెక్ డ్యామ్ నుంచి 14 చెరువులకు వరదనీటిని మళ్లించారు. స్వర్ణముఖి నీరు చెరువులకు చేరడంతో 15 వేల ఎకరాల ఆయకట్టు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ముత్యాలమ్మకు ప్రత్యేక పూజలు



వెండిచీర అలంకరణలో అమ్మవారు

చిల్లకూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తూర్పుకనుపూరు గ్రామంలో కొలువైన ముత్యాలమ్మ అమ్మవారికి గురువారం పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు, చండీహోమపూజలు నిర్వహించారు. అమ్మవారిని భక్తుల దర్శనార్థం వెండిచీర అలంకారంలో ఉంచారు. రాత్రికి అమ్మవారికి పల్లకీసేవ జరిపారు.

ఇసుక అక్రమ రవాణాకు బ్రేక్



కాళంగిలో ప్రవహిస్తున్న నీరు

సూళ్లూరుపేట, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలో ఇన్నాళ్లు జోరుగా సాగిన ఇసుక అక్రమ రవాణాకు వర్షంతో బ్రేకు పడింది. కాళంగి నది నుంచి కొందరు ఇసుకను ఇలుపూరు, సుద్దమడుగు తాగేలి, మోదుగులపాలెం ప్రాంతాల వద్ద తవ్వి ట్రాక్టర్ల ద్వారా అక్రమంగా తరలించే వారు. మూడు రోజుల కురిసిన భారీ వర్షానికి కాళంగికి భారీగా నీరు చేరడంతో ఇసుక అక్రమ రవాణాకు బ్రేకు పడింది.

నేడు ఓజిలి మండల సమావేశం

ఓజిలి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : ఓజిలి మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం మండల పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీవో విజయలక్ష్మి తెలిపారు.

యుద్ధప్రాతిపదికన పనులు పూర్తిచేయాలి



తూము డామేజీని పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

వెంకటగిరిటౌన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కవలపూడి- ఎల్లకారు మార్గం మధ్యలో ఆర్‌అండ్‌బీరోడ్డు పనులను యుద్ధప్రాతిపదికన పూర్తిచేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. గురువారం మండలంలోని కలవపూడి-ఎల్లకారు మార్గంలో దెబ్బతిన్న రోడ్డును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పనులకు నిధులను వెంటనే మంజూరు చేసేలా చర్యలు చేపడుతామన్నారు. అడవి పోరంబోకు స్థలంలో ఇళ్లు కట్టుకున్న తమకు రెవెన్యూ సిబ్బంది పొజిషన్ సర్టిఫికెట్ ఇవ్వడం లేదని వారు కలెక్టర్ దృష్టికి తీసుకు వచ్చారు. ఏళ్ల తరబడి సీజేఎఫ్ ఎస్ భూములలో సాగు చేసుకుంటున్న వారికి పట్టాలను మంజూరు చేయాలని విన్నవించారు. రికార్డులను పరిశీలించి సమస్యలు పరిష్కరిస్తామన్నారు. వర్షాలకు దెబ్బతిన్న రోడ్లు, కల్వర్టులు, ఇళ్లను గుర్తించి నివేదికలను అందించాలన్నారు. ఎంపీడీవో కోటేశ్వరరావు, ఆర్ఐ రాజేష్ పాల్గొన్నారు.

హైకోర్టు ఉత్తర్వులు బేఖాతర్

- వీవోఏలను విధుల్లోకి తీసుకోని 'వెలుగు'



హైకోర్టు ఉత్తర్వులను చూపుతూ ఆవేదన వ్యక్తం చేస్తున్న వీవోఏలు

బాలాయపల్లి, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): దేవుడు వరమిచ్చినా పూజారి వరమివ్వని చందంగా హైకోర్టు ఆదేశించినా వీవోఏ(విలేజ్ ఆరగ్నైజేషన్ ఏజెంట్లు)ను విధుల్లోకి తీసుకోని పరిస్థితి మండలంలోని వెలుగు కార్యాలయంలో జరుగుతోంది. బాధిత వీవోఏల కథనం మేరకు.. మండలంలోని అలిమిలి, మన్నూరు, కయ్యూరు గ్రామాలకు చెందిన వీవోఏలు మాధవి, వాణి, హజరత్తమ్మలను విధులకు రావద్దని ఓ సీసీ ఆదేశించారు. గ్రామ సంఘం తీర్మానించినా విధులకు రావద్దనడంతో వారు హైకోర్టును ఆశ్రయించారు. దీంతో వారిని విధుల్లోకి తీసుకోవాలని కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. ఆ మేరకు వారు కొన్ని రోజులుగా కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. ఇదే క్రమంలో గురువారం కూడా వచ్చారు. సీసీని కలవగా 'మీరు కోర్టుకు వెళ్లారుగా..ఉద్యోగం కోర్టు వాళ్లే ఇస్తారు పోండి' అని పంపించేశారు. దీంతో వారు న్యాయం కోసం విలేకరులను ఆశ్రయించారు. ఉన్నతాధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరుతున్నారు.

వీడిన వాయుగండం..ఊపిరిపీల్చుకున్న అధికారులు, ప్రజలు





తిమ్మాజికండ్రిగ చెరువుకు చేరిన వర్షపునీరు, గుంతలమయంగా మారిన చిగురుపాడు రోడ్డు

నాయుడుపేట, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం కారణంగా మూడు రోజులుగా ఓ మోస్తారు వర్షాలు కురిశాయి. బుధవారం అర్ధరాత్రి వాయుగుండం తీరం దాటడంతో గురువారం ఎండ కాసింది. వాయుగుండం తీరందాటే సమయంలో భారీ వర్షాలు, ఈదురుగాలులు వీస్తాయన్న అధికారుల హెచ్చరికలతో ప్రజలు ఆందోళన చెందారు. ముందస్తు చర్యలుగా పట్టణంలో 13, మండలంలో 16 పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశారు. అయితే వాయుగండం తప్పడంతో అందులోకి ఎవరూ వెళ్లలేదు. అటు అధికారులు, ఇటు ప్రజలు ఊపిరిపీల్చుకున్నారు.

వరండాలోనే విధులు..!



మందులు తడవకుండా కప్పి ఉన్న ఫ్లెక్సీ



వరండాలో విధులు నిర్వహిస్తున్న డాక్టర్

బాలాయపల్లి, అక్టోబరు17(ఆంధ్రజ్యోతి): వర్షం రాకతో బాలాయపల్లి పశు వైద్యాధికారి వరండాలోనే విధులు నిర్వహించాల్సి వచ్చింది. బాలాయపల్లిలోని పశువైద్యశాల భవనం దుస్థితికి చేరుకుని పెచ్చులూడుతోంది. చిన్నపాటి వర్షానికే ఉరుస్తుంది. మూడు రోజులుగా కురిసిన వర్షానికి పశువైద్యాధికారి గదితో పాటు మందులు నిల్వ ఉండే గది చిత్తడిగా మారింది. దీంతో పశువైద్యాధికారి గురువారం వరండాలో కూర్చుని విధులు నిర్వహించారు. ఉన్నతాధికారులు స్పందించి పశువైద్య శాలను బాగుచేయాలని పశువైద్యాధికారితోపాటు పాడి రైతులు కోరుతున్నారు.

గుంతలమయంగా జీఎన్‌టీ రోడ్డు



ఆర్‌అండ్‌బీ కార్యాలయ సమీపంలో ఇలా



అధ్వానంగా ఉన్న జీఎన్‌టీ రోడ్డు

సూళ్లూరుపేట, అక్టోబరు 17 (ఆంధ్ర జ్యోతి): సూళ్లూరుపేటలోని జీఎన్‌టీ రోడ్డు రాళ్లుతేలి గుంతలు పడడంతో వాహన చోదకులకు అవస్థలు పడుతున్నారు. వైసీపీ పాలనలో ఈ రోడ్డుకు తట్టెడు మట్టి కూడా వేయకపోవడంతో ఇలాంటి పరిస్థితి ఏర్పడింది. దీనికి తోడు తుఫాన్ ప్రభావంతో మూడు రోజుల పాటు కురిసిన వర్షాలకు రోడ్డు అధ్వానంగా మారింది. పట్టణానికి రావాలంటే ముఖద్వారం హోలిక్రాస్ సర్కిల్ నుంచి రైల్వేస్టేషన్ రోడ్డు వరకు దాదాపు అర కిలోమీటరు మేర రాళ్లులేచి రోడ్డు మధ్యలో పెద్దపెద్ద గుంతలు ఏర్పడి వాహనాలు కూడా వెళ్లలేని పరిస్థితి. ద్విచక్ర వాహనాదారులైతే గుంతల్లో పడిపోయిన ఘటనలు చోటు చేసుకొంటున్నాయి. ఆర్‌అండ్‌బి బంగ్లా, కార్యాలయం ముందే గుంతలున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ఎమ్మెల్యే అధికారులు స్పందించి కనీసం తాత్కాలిక మరమ్మతులైనా చేయాలని ప్రజలు కోరుతున్నారు.

గుండెపోటుతో లారీ డ్రైవర్ మృతి

తడ, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : గుండెపోటుతో ఓ లారీ డ్రైవర్ మృతి చెందాడు. తమిళనాడు తిరుచురాపల్లి జిల్లా రౌతంమేడు గ్రామానికి చెందిన కర్ణన్‌అన్నాదోరై (37) లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. మంగళవారం చెన్నై నుంచి లోడ్ తీసుకొని శ్రీసిటీకి వచ్చాడు. అక్కడ సరుకును అన్‌లోడ్‌చేశారు. మళ్లీ లోడింగ్ కోసం స్థానిక నిప్పో పరిశ్రమ ఎదురుగా ఖాళీస్థలంలో లారీని నిలిపి నిద్రపోయాడు. బుధవారం లారీ యజమాని శ్రీసిటీలో సరుకులోడింగ్ కోసం వెళ్లాలని చెప్పేందుకు ఫోన్ చేశాడు. ఆ ఫోన్ ఎత్తకపోవడంతో పరిశ్రమవారికి లారీ విషయం ఆరా తీయాలని కోరాడు. పరిశ్రమకు చెందిన వ్యక్తులు ఈ లారీని బుధవారం రాత్రి సమయంలో గుర్తించారు. డ్రైవర్ క్యాబిన్ లోపల నిర్జీవంగా ఉండటం గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల సమక్షంలో అతడిని బయటకుతీశారు. శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. గురువారం కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. వారి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

గూడూరు అర్బన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక రైల్వేస్టేషన్ పరిధిలోని గూడూరు- కొండాగుంట రైల్వే మార్గంలో గల టిడ్కోగృహాల సమీపంలోని రైల్వేపట్టాల సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెంది ఉండటాన్ని రైల్వేసిబ్బంది గుర్తించారు. రైల్వేజీఆర్ పోలీసులకు సమాచారం అందించారు. మృతుడి వయసు 35 సంవత్సరాలు ఉండవచ్చని భావిస్తున్నారు. బూడిద రంగు చొక్కా, నీలిరంగు ప్యాంటు ధరించి ఉన్నాడు. రైలులో ప్రయాణిస్తూ ప్రమాదవశాత్తు జారిపడి మృతిచెంది ఉంటాడని భావి స్తున్నారు. రైల్వే జీఆర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా చండీయాగం



సూళ్లూరుపేట, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): పౌర్ణమి పర్వదినం సందర్భంగా చెంగాళమ్మ ఆలయంలో గురువారం మహా చండీయాగం వైభవంగా నిర్వహించారు. ఉభయకర్తలుగా నెల్లూరుకు చెందిన డాక్టర్ రమణారెడ్డి దంపతులు వ్యవహరించారు. వారికి సహాయ కమిషనర్ అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేశారు.

ఘనంగా వాల్మీకి జయంతి



ఓజిలి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : ఓజిలి మండల పరిషత్ కార్యాలయంలో గురువారం వాల్మీకి జయంతి ఘనంగా నిర్వహించారు. వాల్మీకి చిత్రపటానికి పూల మాలవేసి నివాళులర్పించారు. ఎంపీడీవో విజయలక్ష్మి, ఏఓ విజయరాణి, సీనియర్ సహాయకులు ప్రసూన, పాల్గొన్నారు.

నారుమడులలో జాగ్రత్తలు తీసుకోవాలి

నాయుడుపేట టౌన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : రైతులు సేద్యంలో నారు మడుల పట్ల తగు జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా మంచి దిగుబడులను సాధించవచ్చని ఏవో గణేష్ అన్నారు. మర్లపల్లి, అత్తలపాళెం గ్రామాల్లో గురువారం 'పొలం పిలుస్తోంది' కార్య క్రమంలో రైతులకు నారుమడి యాజ మాన్యం గురించి వివరించారు. వీఏఏలు చెంగల్‌రాజు, ఆదినారాయణరెడ్డి, పాల్గొన్నారు.

పెళ్లకూరు: ప్రకృతి వ్యవసాయ పద్ధతులను పాటించి సాగు చేపడితే అధిక దిగుబడులు సాధించవచ్చని ఏవో ప్రవీణ పేర్కొన్నారు. చిల్లకూరు, జీలపాటూరు గ్రామాలలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని నిర్వహించారు. రసాయన ఎరువులు తగ్గించి సేంద్రియ సాగుచేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో వీఏఏ చందు, మణెయ్య, ఏహెచ్‌ఏ లతవ్యకుమార్ తదితరులు ఉన్నారు.

సీపీఐ నాయకుడి సతీమణికి ఎమ్మెల్యే నివాళి

సూళ్లూరుపేట, అక్టోబరు 17 (ఆంధ్ర జ్యోతి): సీపీఐ నాయకుడు మోదుగుల రమణయ్య సతీమణి అన్నపూర్ణమ్మ అనారోగ్యంతో మృతిచెందిన విషయం తెలిసిందే. ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ ఆమె భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యేతో పాటు టీడీపీ నాయకులు ఆకుతోట రమేష్ ఉన్నారు.

రీసర్వే పూర్తయిన గ్రామాల్లో నేటి నుంచి గ్రామ సభలు

పెళ్లకూరు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): భూముల రీసర్వే పూర్తయిన గ్రామాల్లో శుక్రవారం నుంచి గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు డిప్యూటీ తహసీల్దార్ యువరాజ్ తెలిపారు. గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఈ నెల 18న తాళ్వాయిపాడు, 19న జీలపాటూరు, 21న కానూరు, 22న పెన్నేపల్లి, 23న బంగారంపేట, 24న శెట్టిగుంట, 25న పెళ్లకూరు, 26న ఊడిపూడి, 27న ఆర్లపాడు గ్రామాలలో గ్రామ సభలు నిర్వహిస్తామన్నారు. భూ సమస్యలపై అర్జీలు స్వీకరిస్తామన్నారు.

పునరావాస కేంద్రంలో భోజనం పంపిణీ

కోట, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): కోటలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలోని పునరావాస కేంద్రంలో గురువారం పీపుల్స్ ప్రొటక్షన్ ఫోర్స్ సంస్థ ఆహారాన్ని అందించింది. సంస్థ ప్రతినిధులు మీజూరు మల్లికార్జున్‌రావు, తిరుమలశెట్టి కోటేశ్వరరావు, బాలసుబ్రహ్మణ్యం భోజనాలను అందించారు. ఈ పునరావాస కేంద్రాన్ని తహసీల్దారు సందర్శించారు.

దుస్థితిలో గూడూరులోని సీసీరోడ్లు

గూడూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలువీధుల్లో సీసీరోడ్లు దుస్థితికి చేరుకున్నాయి. మున్సిపాలిటీ పరిధిలో గత టీడీపీ ప్రభుత్వంలో పలు వార్డులలోని వీధుల్లో జన్మభూమి పథకం ద్వారా సీసీ రోడ్లను ఏర్పాటు చేశారు. అయితే మంచినీటి కొళాయి కనెక్షన్‌లు తీసుకునే సమయంలో సీసీరోడ్లును పగలగొట్టి తిరిగి వాటిని అభివృద్ధి పరచకపోవడంతో అవి గుంతలమయంగా మారాయి. దీనికి తోడు గత వైసీపీ ప్రభుత్వంలో ప్రైవేటు గ్యాస్ ఏజెన్సీ అండర్ పైప్‌లైన్ల నిర్మాణం కోసం సీసీరోడ్లును పగలగొట్టారు. ఆ గుంతలను కొన్ని ప్రాంతాల్లో పూడ్చివేసినా మరికొన్ని ప్రాంతాల్లో అలాగే వదలివేశారు. ఫలితంగా ఆ గుంతలు అలాగే ఉండిపోయాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రధానంగా నాయుడుకాలువకట్ట, నలజాలమ్మ వీధి, కృష్ణమందిరం వీధి, కోనేటిమిట్ట, మాళవ్యానగర్, సత్రపువీధి తదితర ప్రాంతాల్లో సీసీరోడ్లు అక్కడక్కడా గోతులమయంగా మారాయి. దీంతో చిన్నపాటి వర్షానికే నీరు నిల్వచేరి గుంతలు కనిపించక పలువురు పాదాచారులు, ద్విచక్రవాహనదారులు ప్రమాదాలకు గురువుతున్నారు. దెబ్బతిన్న సీసీరోడ్లును బాగుచేయాలని స్థానికులు కోరుతున్నారు.





దెబ్బతిన్న నాయుడుకాలువకట్ట వద్ద సీసీ రోడ్డు, గుంతలమయంగా ఉన్న కృష్ణమందిరం వీధి